www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

ప్రజాపక్షం 7th ANNIVERSARY 22nd October, 2025

PRAJAPAKSHAM ★★

‘సిగాచీ’ ఎండికి హైకోర్టు నోటీసులు

‘సర్’ ఫేజ్-2 షురూ 04

సంపుటి 08, సంచిక: 334 | బుధవారం | 05-11-2025 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00



## అజాహరుద్దీన్‌కు మైనారిటీ సంక్షేమం

శాఖలు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం

ప్రజాపక్షం / హైదరాబాద్

రాష్ట్ర కేబినెట్ లో కొత్తగా చేరిన మంత్రి మహ్మద్ అజారుద్దీన్ కు ప్రభుత్వం శాఖలను కేటాయించింది. మైనార్టీ సంక్షేమం, ప్రభుత్వ రంగ సంస్థలు శాఖలను కేటాయిస్తూ మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. గవర్నర్ ఆమోదంతో శాఖలు కేటాయించినట్టు పేర్కొన్నారు. ప్రస్తుతం సిఎం వద్ద మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌తో పాటు పట్టణాభివృద్ధి శాఖ, జనరల్ అడ్మినిస్ట్రేషన్, లా అండ్ ఆర్డర్ మంత్రికి తరువాయి 2లో




## రోడ్డు ప్రమాదంపై హెచ్ఆర్‌సి ఆగ్రహం

మీర్జాగూడ ఘటనలో సుమోటోగా కేసు నమోదు

అధికారులకు నోటీసులు

ప్రజాపక్షం/హైదరాబాద్

రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలంలోని మీర్జాగూడ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (హెచ్ఆర్‌సి)మంగళవారం సుమోటోగా కేసు నమోదు చేసింది. ఈ ప్రమాదంలో 19 మంది మృత్యువాత పడిన విషయం తెలిసిందే. దీనిపై డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలోని కమిషన్ స్పందించింది. రోడ్డు భద్రతా లోపాలు, అధిక వేగం, హైవే విస్తరణ ఆలస్యం, అధికారుల నిర్లక్ష్యం వంటి అంశాలపై కమిషన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. రవాణా శాఖ, హోం శాఖ, గనులు భూగర్భశాస్త్ర శాఖ, ఎన్‌హెచ్‌ఐఎ, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, తరువాయి 2లో




## మరో ఏడాది పొడిగింపు

‘ఔట్ సోర్సింగ్ గ్రామ పంచాయతీ కార్యదర్శుల’ కాలపరిమితి పెంచిన ప్రభుత్వం

ప్రజాపక్షం/హైదరాబాద్

ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న పంచాయతీ కార్యదర్శుల కాల పరిమితిని రాష్ట్ర ప్రభుత్వం మరో ఏడాది పొడిగించింది. జిల్లాలో పంచాయతీ కార్యదర్శుల సంఖ్య గ్రామ పంచాయతీల సంఖ్యను మించకుండా చూసుకోవాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. రాష్ట్రంలో పని చేస్తున్న (1037) పంచాయతీ కార్యదర్శుల కాలపరిమితిని 2025,ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2026, మార్చి 31 వరకు పొడిగించారు. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీ చేశారు. కాగా కాంట్రాక్ట్/అవుట్ సోర్సింగ్ నియామకానికి సంబంధించిన పద్ధతులను అనుసరించాలని, వారికి ప్రతినెలా రూ.19,500 వేతనం చెల్లించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# మరోసారి వణికిన వరంగల్

## ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు

- పలు చోట్ల రహదారులు జలమయం
- ఎనుమాముల మార్కెట్‌లో తడిచి ముద్దయిన పత్తి, ధాన్యం
- కరీంనగర్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లోనూ వర్షాలు
- జలదిగ్బంధంలో మహేశ్వరం మండలం రామచంద్రగూడ
- నీటమునిగిన మోడల్ స్కూల్



ప్రజాపక్షం/వరంగల్ టౌన్

వారం రోజుల క్రితం సంభవించిన ‘మొంథా’ తుఫాన్ నుంచి తేరుకోకముందే ఉమ్మడి వరంగల్, కరీంనగర్, నల్లగొండ జిల్లాలను మరోసారి వరుణుడు వణికించాడు. మంగళవారం ఉదయం ఆయా జిల్లాల్లోని పలు చోట్ల భారీ వర్షం కురిసింది. వరంగల్ నగరంలో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఈదురు గాలులతో కూడిన భారీ వాన కురిసింది. సుమారు 30 నిమిషాల పాటు కురిసిన కుండపోత వర్షానికి నగరంలోని పలు రహదారులు జలమయమయ్యాయి. దీంతో పలు చోట్ల ట్రాఫిక్ నిలిచి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇటీవల మొంథా తుఫాన్ కల్లోలానికి ముంపు నుంచి ఇంకా వరంగల్, హనుమకొండ, కాజీపేట నగరాలు పూర్తిగా తేరుకోలేదు. తాజా వర్షంతో మరోసారి ముంపు భయంతో కాలనీవాసులు వణికిపోయారు. జనగామ జిల్లా వ్యాప్తంగా ఉదయం నుంచి వర్షం కురిసింది. స్టేషన్ ఘన్‌పూర్, లింగాల ఘన్‌పూర్, తరిగొప్పుల, నర్మెట, బచ్చన్నపేట మండలాల్లో వర్షం పడింది. ఒక్కసారిగా కురిసిన భారీ వర్షానికి వరంగల్ వ్యవసాయ మార్కెట్లో రైతుల పత్తి, మొక్కజొన్న తడిసి ముద్దయ్యాయి. వ్యవసాయ మార్కెట్‌కు జిల్లా వ్యాప్తంగా రెతులు పత్తి, మొక్కజొన్న పంటలను విక్రయించేందుకు తీసుకురాగా, ఉదయం కురిసిన భారీ వర్షానికి తడిసిపోయాయి. తడిసిన పంటను కొనేవారు లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. అష్టకష్టాలు పడి సాగు చేసిన పంటలను మార్కెట్ యార్డుకు తరలిస్తే, ఒక్కసారిగా కురిసిన వర్షం తమను నట్టేట ముంచిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాగైనా తమ పంటను కొనుగోలు చేసి న్యాయం చేయాలని అన్నదాతలు వ్యాపారులను వేడుకున్నారు. వర్షానికి ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో పత్తి, మొక్కజొన్న తడిసిపోవడంతో రైతుల ఆక్రందనలు తరువాయి 2లో

## మూడు రోజులు మోస్తరు వర్షాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో మూడురోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతానికి ఆనుకొని ఉన్న మధ్య బంగాళా ఖాతంలో సగటు సముద్రమట్టానికి 0.9 కిలో మీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతుందన్నారు. ఉత్తర తమిళనాడు తీరం, పరిసర ప్రాంతాల్లో సగటు సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం ఉందని తెలిపారు. రాష్ట్రంలో మూడురోజుల పాటువర్షాలు కురిసే తరువాయి 2లో



## హైదరాబాద్‌లో జిసిసి

- ప్రారంభించనున్నట్లు జర్మనీ బృందం ప్రకటన
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన జర్మనీ కాన్సుల్ జనరల్ మైఖేల్ హాస్పర్ బృందం
- రాష్ట్రంలో మరిన్ని పెట్టుబడులు పెడితే ప్రభుత్వం అండగా ఉంటుందని సిఎం హామీ
- అమెజాన్ వెబ్ సర్వీసెస్ పెట్టుబడులు, విస్తరణకు ప్రభుత్వం సహకారం

ప్రజాపక్షం/హైదరాబాద్

డ్యుయిష్ బోర్స్ కంపెనీ విస్తరణలో భాగంగా హైదరాబాద్‌లో డ్యుయిష్ బోర్స్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జిసిసి)ని హైదరాబాద్‌లో ప్రారంభిస్తున్నట్లు జర్మనీ బృందం ప్రకటించింది. జర్మనీ కాన్సుల్ జనరల్ మైఖేల్ హాస్పర్ నేతృత్వంలోని జర్మనీ బృందం తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని మంగళవారం ఆయన నివాసంలో కలిసి ఈ విషయాన్ని తెలియజేసింది. జిసిసి ఏర్పాటుకు హైదరాబాద్‌ను ఎంచుకున్నందుకు జర్మనీ బృందానికి సిఎం ధన్యవాదాలు తెలిపారు. హైదరాబాద్‌లో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని, ఇందుకు ప్రజా ప్రభుత్వం పూర్తి మద్దతుగా నిలిచి అన్నిరకాల సహాయ సహకారాలు అందిస్తుందని సిఎం హామీ ఇచ్చారు. హైదరాబాద్ డ్యుయిష్ బోర్స్ కంపెనీ జిసిసి ఏర్పాటుతో వచ్చే రెండేళ్లలో ఐటి రంగంలో వెయ్యి మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలగనున్నట్లు సిఎంకు జర్మనీ బృందం వివరించింది. హైదరాబాద్‌ను ఇన్నోవేషన్ హబ్‌గా తయారు చేసేందుకు సహకరించాలని జర్మనీ బృందాన్ని సిఎం కోరారు. హైదరాబాద్‌లో జర్మనీ టీచర్లను నియమించి తెలంగాణ విద్యార్థులకు జర్మనీ భాషను నేర్పించేందుకు సహకరించాలని జర్మనీ కాన్సులేట్ జనరల్‌కు ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. పెట్టుబడుల విషయంలో తెలంగాణ జర్మనీ భాగస్వామ్యాన్ని కోరుకుంటోందన్న సిఎం చెప్పారు. ఐటి, ఫార్మా, ఆటోమొబైల్ రంగంలో జర్మనీ కంపెనీలు పెట్టుబడులు పెట్టాలని సిఎం జర్మనీ బృందాన్ని కోరారు. వీటితో ‘టామ్ కామ్’ ద్వారా వొకేషనల్ ఎడ్యుకేషన్, స్కిల్ వర్క్ విషయంలో శిక్షణ అందించేందుకు సహకరించాలన్నారు. ఈ భేటీలో డ్యుయిష్ బోర్స్ సిఐఓ, సిఓఓ అమిత దేశాయ్, డాక్టర్ క్రిస్టోఫ్ బోమ్, సిఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**అమెజాన్ వెబ్ సర్వీసెస్ పెట్టుబడులు, విస్తరణకు ప్రభుత్వం సహకారం**

తెలంగాణలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఎడబ్ల్యుఎస్) పెట్టుబడులు, విస్తరణ కార్యక్రమాలకు ప్రభుత్వం పూర్తి తరువాయి 2లో



## నాణ్యతపై రాజీపడం

- ఎత్తిపోతల నిర్మాణాల్లో విధిగా పాటించాల్సిందే
- రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులకు, ఏజెన్సీలకు హెచ్చరిక
- హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లోని ఎత్తిపోతలపై సమీక్ష

ప్రజాపక్షం/హైదరాబాద్/సూర్యాపేట

ఎత్తిపోతల నిర్మాణాలలో విధిగా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడే ప్రసక్తే లేదని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం హుజూర్‌నగర్, కోదాడ నియోజక వర్గాలలో నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకాలపై డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యత లోపించిందని తెలిస్తే ఉపేక్షించేది లేదని పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. రైతాంగం కళ్ళలో వెలుగులు నింపడంతో పాటు హుజూర్‌నగర్, కోదాడ నియోజక వర్గాలను సస్యశ్యామలం చేయడానికే ఎత్తిపోతల పథకాల నిర్మాణాలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని మొదలు పెట్టామన్నారు. అటువంటి నిర్మాణంలో నాణ్యత లోపించిందని తేలితే సహించేది లేదని అధికారులకు, ఏజెన్సీలకు అల్టిమేటం జారీ చేశారు. హుజూర్‌నగర్ నియోజక వర్గ పరిధిలోని మహాత్మాగాంధీ ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ ఎత్తిపోతల పథకంతోపాటు జవహర్ జాన్‌పహాడ్ బ్రాంచ్ కెనాల్, బెట్టేతండ, నక్కగూడెం, రాజీవ్‌గాంధీ ఎత్తిపోతల పథకాల పురోగతితోపాటు హుజూర్‌నగర్‌లో నిర్మిస్తున్న నీటిపారుదల శాఖా కార్యాలయ భవన పురోగతిపై సమీక్షించారు. కోదాడ నియోజక వర్గ పరిధిలోని రెడ్లకుంట, రాజీవ్ శాంతినగర్, ఆర్9, మోతె ఎత్తిపోతల పథకాలతో పాటు కోదాడలో నిర్మిస్తున్న నీటిపారుదల శాఖ కార్యాలయ భవన నిర్మాణం పురోగతిని తెలుసుకున్నారు. ప్రస్తుతం నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకాల ద్వారా నిర్దేశిత తరువాయి 2లో

## ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై కమిటీ

ప్రత్యేక ప్రధాన కార్యదర్శితో పాటు 15 మందితో నియామకం

కమిటీలో ప్రొఫెసర్లు కోదండరామ్, కంచ ఐలయ్యకు చోటు




ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులలో జాప్యం జరుగుతున్న నేపథ్యంలో మొబలైజేషన్ ఆఫ్ ఫైనాన్స్ ఫర్ ఫీజ్ రీయింబర్స్‌మెంట్ స్కీమ్’ కమిటీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చైర్మన్‌గా ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి వైస్ ఛైర్మన్‌గా, సభ్యులుగా ప్రొఫెసర్ కంచఐలయ్య, ప్రొఫెసర్ ఎం.కోదండరామ్‌ను సభ్యునిగా నియమించారు. మొత్తంగా తరువాయి 2లో

## డాక్టర్ ఇంట్లో భారీగా డ్రగ్స్

- రూ.3 లక్షల విలువైన మత్తుపదార్థాలు స్వాధీనం
- వైద్యుడి అరెస్ట్



ప్రజాపక్షం/హైదరాబాద్

పది మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి రోగులకు వైద్య వృత్తితో ప్రాణం పోయాల్సిన వైద్యుడే ప్రాణాంతకమైన డ్రగ్స్ కు బానిస అయ్యాడు. డ్రగ్స్ కొనాలంటే తనకు తగినంత డబ్బు లేదని ముగ్గురు స్నేహితులు చేసే డ్రగ్స్ వ్యాపారంలో పాలుపంచుకున్నాడు. ఢిల్లీ, బెంగళూరు నుంచి దిగుమతి చేసుకున్న డ్రగ్స్ తన ఇంట్లో పెట్టుకుని అమ్మకాలు సాగిస్తూ ఎక్సైజ్ ఎస్‌టిఎఫ్ బి టీం కు తరువాయి 2లో

## పెన్షనర్లకు మోదీ సర్కార్ తీరని ద్రోహం



ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ 12

# ప్యాసింజర్, గూడ్స్‌రైలు ఢీ

ఎనిమిదిమంది మృతి, 14 మందికి గాయాలు

ఛత్తీస్‌గఢ్ బిలాస్‌పూర్ స్టేషన్ సమీపంలో ఘటన



**బిలాస్‌పూర్ :** ఛత్తీస్‌గఢ్‌లో మంగళవారం రైలు ప్రమాదం సంభవించింది. బిలాస్‌పూర్ స్టేషన్ సమీపంలో ప్యాసింజర్ రైలు వెనుక నుండి గూడ్స్ రైలును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది మరణించగా, 14 మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. మేము (మెయిన్‌లైన్ ఎలక్ట్రిక్ మల్టిపుల్ యూనిట్) ప్యాసింజర్ రైలు గెవ్రా (పొరుగున ఉన్న కోర్బా జిల్లాలో) నుండి బిలాస్‌పూర్‌కు వెళుతుండగా సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఈ ఘటన జరిగిందని తెలిపారు. ఘటన ప్రభావం చాలా తీవ్రంగా ఉండటంతో ప్యాసింజర్ రైలు కోచ్ కార్గో రైలు వ్యాగన్ పైన పడిందని అధికారులు తెలిపారు. హౌరా–ముంబయి రైలు మార్గం విభాగంలో గటోరా, బిలాస్‌పూర్ రైల్వే స్టేషన్ల మధ్య గూడ్స్ రైలును ప్యాసింజర్ రైలు ఢీకొట్టిందని తరువాయి 2లో



## బిఆర్‌ఎస్-బిజెపి ఒక్కటే

కాదు అంటే ఈనెల 11లోగా కాళేశ్వరం కేసులో సిబిఐ ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలి

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి సిఎం రేవంత్ బహిరంగ సవాల్ 04

## ఒక్క ఓటరును తొలగించినా కేంద్ర ప్రభుత్వ పతనం ఖాయం

- పశ్చిమ బెంగాల్ సిఎం మమతా హెచ్చరిక
- సర్‌కు వ్యతిరేకంగా భారీ నిరసన ప్రదర్శన



**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్‌లో ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్)ను చేపట్టడంపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మండిపడ్డారు. అర్హులైన ఒక్క ఓటరును కూడా జాబితా నుండి తొలగిస్తే కేంద్రంలో బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం పతనం ఖాయమని హెచ్చరించారు. 2026 అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఓటర్లను బెదిరించడానికి కాషాయ పార్టీ, ఎన్నికల సంఘం ఎస్ఐఆర్‌ను రాజకీయ అస్త్రంగా ఉపయోగిస్తున్నాయని ఆరోపించారు. కోల్‌కతాలో ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా మంగళవారం మమతా బెనర్జీ నేతృత్వంలో భారీ ర్యాలీ నిర్వహించారు. నిరసన ప్రదర్శనలో తన మేనల్లుడు, పార్టీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ కూడా పాల్గొన్నారు. దాదాపు 4 కిలోమీటర్ల మేర ర్యాలీ కొనసాగింది. ర్యాలీనుద్దేశించి సిఎం మాట్లాడుతూ బిజెపి పాలిత రాష్ట్రాలను తరువాయి 12లో

## బిహార్‌లో తొలివిడత ప్రచారానికి తెర

6న 18 జిల్లాల పరిధిలోని 121నియోజకవర్గాల్లో ఓటింగ్ : పోలింగ్‌కు రంగం సిద్ధం



**పాట్నా :** బిహార్‌లో తొలి విడత ప్రచారానికి మంగళవారం సాయంత్రం తెరపడింది. ఈనెల 6న 18 జిల్లాల పరిధిలోని 121నియోజకవర్గాల్లో ఓటింగ్ జరగనుంది. ఇందుకు రంగం సిద్ధమైంది. ఎన్‌డిఎ, మహాఘట్‌బంధన్ కూటములు హోరాహోరీగా ప్రచారం నిర్వహించాయి. ఇరుకూటముల తరఫున అగ్ర నేతలు సుడిగాలి ప్రచారం నిర్వహించారు. జంగల్ రాజ్‌ను అడ్డుకోవాలంటే ఎన్‌డిఎను గెలిపించాలని బిజెపి, జెడియు నేతలు, ఇంటికో ప్రభుత్వ ఉద్యోగం కావాలంటే మహాఘట్‌బంధన్‌కు ఓటేయాలని కాంగ్రెస్, ఆర్‌జెడి నేతలు ప్రచారం నిర్వహించారు. అధికారం నిలబెట్టుకోవాలని పావులు కదుపుతున్న బిజెపి సారథ్యంలోని ఎన్‌డిఎ, మళ్లీ గద్దెనెక్కాలని సర్వశక్తులు ఒడ్డుతున్న ఆర్‌జెడి నేతృత్వంలోని మహాఘట్‌బంధన్ మధ్య గట్టిపోటీ నెలకొంది. ఎన్‌డిఎ తరఫున ప్రధాని మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, బిజెపి పాలిత రాష్ట్రాల సిఎంలు, సిఎం నితీశ్‌కుమార్, ఎల్‌జెపి అధినేత చిరాగ్ పాశ్వాన్, మహాఘట్‌బంధన్ తరఫున రాహుల్ గాంధీ, తేజస్వీ యాదవ్, అఖిలేష్ యాదవ్ తదితరులు ప్రచారం నిర్వహించారు. బిహార్‌లో 243 అసెంబ్లీ స్థానాలు ఉండగా ఈనెల 6న 18జిల్లాల పరిధిలోని తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## ఆత్మరక్షణ వ్యూహానికే కట్టుబడ్డాం: చైనా

**బీజింగ్:** తమ దేశం అణు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై చైనా విదేశాంగశాఖ ప్రతినిధి మావో నింగ్ స్పందించారు. చైనా అణ్వస్త్రాలను కలిగివున్న దేశమే అయినాగానీ బాధ్యతగా వ్యవహరిస్తుందని చెప్పారు. ఆత్మరక్షణ అణు వ్యూహాన్ని సమర్థిస్తుందని అన్నారు. అణు పరీక్షలు నిలిపివేయాలనే విషయంలోనూ తమ వైఖరి మారదని తెలిపారు. రష్యా, చైనా సహా ఇతర దేశాలు అణుసామర్థ్యాలు పెంచుకుంటున్న క్రమంలో అణ్వస్త్రాల పరీక్షలు పున:ప్రారంభించేలా డిపార్ట్‌మెంట్ ఆఫ్ వార్‌కు ట్రంప్ ఆదేశాలు ఇవ్వడం విదితమే.

**మొదటి దేశం మాది కాదు– పాక్ :** అణు పరీక్షలు నిర్వహించిన మొదటి దేశం తమది కాదని పాకిస్థాన్ పేర్కొంది. అణు పరీక్షలను ముందుగా పునరుద్ధరించబోమని తెలిపింది. అణ్వస్త్రాల పరీక్షలపై ట్రంప్ వ్యాఖ్యల క్రమంలో పాకిస్థాన్ కీలక అధికారి ఈ వ్యాఖ్యలు చేశారు.

## ప్రపంచాన్ని 150 సార్లు పేల్చే శక్తి అమెరికా సొంతం

### అణ్వస్త్ర పరీక్షలపై ట్రంప్



**వాషింగ్టన్:** రష్యా, చైనా, ఉత్తర కొరియా, పాకిస్థాన్ అణ్వస్త్రాల పరీక్షలను రహస్యంగా జరుగుతున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. తమ వద్ద ప్రపంచాన్ని 150 సార్లు పేల్చేంత శక్తిగల అణ్వాయుధాలు ఉన్నాయని చెప్పారు. 30 ఏళ్ల తర్వాత అణ్వస్త్రాల పరీక్షలకు ఆదేశాలిచ్చిన నేపథ్యంలో ట్రంప్ తాజా వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడింది. తమ వద్ద ఉన్న అణ్వాస్త్రాల పనితీరును తెలుసుకోవాలంటే పరీక్షలు నిర్వహించాల్సిందేనని చెప్పారు. అణు పరీక్షల కోసం తన నిర్ణయాన్ని సమర్థించుకున్నారు. ఈ జాబితాలో రష్యా, చైనా, ఉత్తర కొరియా, పాకిస్థాన్ కూడా ఉన్నాయని, అవి వాటి గురించి మాట్లాడటం లేదని ఆయన చెప్పుకొచ్చారు. ఏ దేశం వద్ద లేనంత అణుశక్తి అమెరికా దగ్గర ఉందని వక్కాణించారు. మరో ఐదేళ్లలో చైనా తమ దేశానికి సమానంగా శక్తిని పెంచుకోగలదని అన్నారు. మిగతా దేశాలు అణ్వాస్త్రాలను పరీక్షించుకుంటుంటే అమెరికా ఎందుకు వెనుకుండాలి? మేము కూడా అణ్వాస్త్రాలను పరీక్షిస్తాం. ఇందుకోసం ఉత్తర్వులు జారీచేశాను. ఈ ప్రక్రియ త్వరలోనే ప్రారంభం అవుతుంది' అని ట్రంప్ అన్నారు. అమెరికా చివరిసారి 1992లో అణ్వాయుధాన్ని పరీక్షించింది. ఒకవేళ మళ్లీ పరీక్షలు నిర్వహించాలంటే, వందల మిలియన్ల డాలర్లు ఖర్చు అవుతుందని సంబంధిత అధికారులు భావిస్తున్నారు.

## ఇరాక్ దురాక్రమణ సూత్రధారి
## అమెరికా మాజీ ఉపాధ్యక్షుడు డిక్ షెనీ మృతి



**వాషింగ్టన్ :** అమెరికా దేశ మాజీ ఉపాధ్యక్షుడు డిక్ షెనీ (84) మంగళవారం నాడు మరణించారు. ఆయనకు న్యుమోనియా, హృద్రోగ వ్యాధులు తీవ్రమవడంతో మరణించినట్లు కుటుంబసభ్యులు తెలియజేశారు. డిక్ షెనీ జార్జ్‌బుష్ జూనియర్ అమెరికా అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఉపాధ్యక్షుడిగా పని చేశారు. 2003లో ఇరాక్‌పై అమెరికా దురాక్రమణ వెనుక ఆయనే ప్రధాన కారణమని చెబుతుంటారు. అమెరికా చరిత్రలోనే అత్యంత శక్తివంతమైన ఉపాధ్యక్షుడు ఆయన అని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తుంటారు. రిపబ్లిక్ పార్టీకి చెందిన ఆయన వ్యోమింగ్ నుంచి కాంగ్రెస్‌కు ఎన్నికయ్యారు. అలాగే అమెరికా రక్షణ మంత్రిగా కూడా వ్యవహరించారు. 2000 సంవత్సరంలో బుష్ అధ్యక్ష పదవికి పోటీ పడినప్పుడు డిక్ షెనీని ఆయన రన్నింగ్ మేట్‌గా ఎంపిక చేసుకున్నారు. 2001 నుంచి 2009 వరకు షెనీ అమెరికా ఉపాధ్యక్షుడిగా ఉన్న సమయంలో అమెరికా అధ్యక్ష స్థానం అధికారాన్ని విస్తరించేందుకు, ఉపాధ్యక్ష పదవిని శక్తివంతం చేసేందుకు ఆయన పని చేశారు. అనేకమంది వద్దని హెచ్చరించినప్పటికీ షెనీ మాట విని 2003లో ఇరాక్‌పై దురాక్రమణకు బుష్ ఆమోదం తెలిపారు. ఆయన కుమార్తె లిజ్ షెనీ రిపబ్లిక్ పార్టీ తరుపున ప్రతినిధుల సభకు ఎన్నికయ్యారు. ట్రంప్‌ను వ్యతిరేకించడంతో ఆమె పదవిని కోల్పోయారు. అమెరికా 248 సంవత్సరాల చరిత్రలో దేశ గణతంత్రానికి ట్రంప్ లాగా పెనుముప్పు కలిగించే వ్యక్తి మరొకరు లేరని డిక్ షనీ వ్యాఖ్యానించారు. ఆయనకు తొలిసారిగా 37వ ఏట గుండెపోటు వచ్చిన తరువాత అనేక మార్లు గుండె పోటు వచ్చింది. 2012లో హృదయమార్పిడి శస్త్రచికిత్స చేయించుకున్నారు. 1941లో నెబ్రెస్కాలోని లింకన్‌లో జన్మించిన షెనీ తల్లి వెయిట్రస్‌గా, తండ్రి నేల సంరక్షణ సేవలో ఫెడరల్ వర్కర్‌గా పని చేశారు.

## జోరుగా న్యూయార్క్ మేయర్ ఎన్నిక

### ఫలితాల కోసం ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి



**వాషింగ్టన్ :** ప్రపంచవ్యాప్తంగా ఉత్కంఠ రేకెత్తిస్తున్న అమెరికా ఆర్థిక రాజధాని, పెట్టుబడుల స్వర్గదామమైన న్యూయార్క్ నగర మేయర్ ఎన్నికలు మంగళవారం జరిగాయి. ఓటర్లు ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. మొదటి దశలోనే 7.35 లక్షల మందికి పైగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గత ఎన్నికల్లో ఇదే సమయానికి పోలైన వాటికంటే ఇది నాలుగింతలు ఎక్కువ. డెమొక్రాటిక్ పార్టీ తరుపున న్యూయార్క్ రాష్ట్ర అసెంబ్లీ సభ్యుడు, సోషలిస్టు 34 ఏళ్ళ జోహ్రాన్ మమ్దానీ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. ఈ ఎన్నికల్లో ఆయన నెగ్గితే న్యూయార్క్ నగరానికి తొలి ముస్లిం మేయర్ అవుతారు. డెమొక్రాటిక్ పార్టీ ప్రైమరీలో మమ్దానీ చేతిలో ఓడిపోయిన మాజీ గవర్నర్ ఆండ్రూ క్వోమో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉన్నారు. మమ్దానీ సోషలిస్టు ఎజెండా న్యూయార్క్ నగరాన్ని వెనిజువెలా లాగా మారుస్తుందని ఆయన ఓటర్లను హెచ్చరించారు. అధికార రిపబ్లికన్ పార్టీ తరుపున కర్టిస్ సిల్వా పోలిసింగ్, ప్రజా భద్రతపైనే తన ఎన్నికల ఎజెండాను ముందుకు తీసుకువెళ్ళారు. అయితే, న్యూయార్క్‌లోనే జన్మించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ మాత్రం మమ్దానీని బలంగా వ్యతిరేకించారు. ఆయనను కమ్యూనిస్టు పిచ్చివాడిగా పేర్కొన్నారు. అలాంటి సోషలిస్టు అభ్యర్థి ఎన్నికైతే ఫెడరల్ ఫండింగ్‌ను నిలిపివేస్తానని కూడా ట్రంప్ హెచ్చరించారు. ఒపీనియన్ పోల్స్ అన్నీ జోహ్రాన్ మమ్దానీ వైపే మొగ్గు చూపుతున్నాయి. ఉదయం 6 గంటలకు ప్రారంభమైన పోలింగ్, రాత్రి 9 గంటలకు వరకు కొనసాగుతుంది. న్యూయార్క్‌తో పాటు న్యూజెర్సీ, వర్జీనియా, కాలిఫోర్నియా నగరాల మేయర్ పదవులకు కూడా మంగళవారమే ఓటింగ్ జరుగుతోంది. ఫలితాలు భారతకాలమానం ప్రకారం బుధవారం ఉదయం వెలువడమే అవకాశం ఉంది.

## ఔను... అవినీతికి పాల్పడ్డారు

### డిఎస్‌పి లంచం కేసులో ఏడుగురి వాంగ్మూలం
### ఎసిబి డైరెక్టర్‌కు చేరిన నివేదిక




**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో అవినీతిని అరికట్టే శాఖలోనే రూ. కోటి రూపాయల లంచాల పర్వం వెలుగుచూడటం సంచలనం రేపింది. ఓ కేసులో బినామీలంటూ కోటి రూపాయలు డిమాండ్ చేసి తొలివిడత రూ.20 లక్షలు వసూళ్లకు పాల్పడిన అంశంపై గత నెల 24న బాధితులు నేరుగా ఎసిబి డైరెక్టర్ చారుసిన్హాకు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. ఈ కేసులో నిజాయతీ పరులైన అధికారులతో విచారణ జరిపిస్తే వరంగల్ రేంజ్‌లో ఎసిబి అధికారుల అవినీతి, అక్రమాలు, లంచగొండి తనం అన్నీ వెలుగుచూస్తాయని బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. తాము ఇచ్చిన ఫిర్యాదుపై రహస్యంగా విచారణ చేపట్టాలని కోరుకుంటున్నామని, ఈ విషయం సదరు అవినీతి అధికారికి తెలిస్తే బాధితులపై మరింత వేధింపులకు గురిచేసే అవకాశం ఉందని ఎసిబి డైరెక్టర్‌కు విన్నవించారు. బాధితుల ఫిర్యాదుపై వెంటనే స్పందించిన ఏసీబీ డైరెక్టర్ జాయింట్ డైరెక్టర్ నేతృత్వంలో విచారణ పూర్తి చేసి నివేదిక సమర్పించాలని కోరారు. ఈక్రమంలో నాలుగు రోజుల పాటు ఆరుగురు బాధితుల వాంగ్మూలం సేకరించిన ఏసీబీ అధికారులు విచారణ పూర్తి చేసి పూర్తి స్థాయి నివేదికను ఎసిబి డిజి చారుసిన్హాకు అందజేసినట్లు తెలియవచ్చింది. కాగా రూ.కోటి లంచం మొత్తాలలో రూ.20 లక్షలు చేతులు మారినట్లు చోటుచేసుకున్న ఆరోపణలపై సదరు అధికారులు పక్కా ఆధారాలు సేకరించినట్లు తెలుస్తోంది. బాధితుల వాంగ్మూలంలో పేర్కొన్న అంశాలతో పాటు అవినీతి అధికారులు సాక్షాలను తారుమారు చేసిన వైనంపై దర్యాప్తు సాగించారు. ఇందులో భాగంగా ఈ వ్యవహారంలో నగదు తరలింపులో కీలక పాత్ర వహించిన మరో డిఎస్పి పాత్రపై పక్క ఆధారాలు సేకరించారు. అదేవిధంగా బాధితుల వద్ద ఆడియో రికార్డులను పరిశీలించడంతో పాటు వాటికి సంబంధించిన సీసీ ఫుటేజీలను స్వాధీనం చేసుకున్నారు. అయితే వరంగల్ రేంజ్ ఏసీబీ డీఎస్పి లంచావతారం వ్యవహారంలో విచారణ ముగిసిందని, ఇక చర్యలే మిగిలాయని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

**ఎసిబి కార్యాలయంలో విచారణ..**

వరంగల్ ఎసిబి డిఎస్‌పి లంచాల పర్వంపై హైదరాబాద్‌లోని ఎసిబి కేంద్ర కార్యాలయానికి చెందిన ఉన్నతాధికారులు ఈ కేసులో బాధితులను పలుమార్లు ప్రశ్నించి వారి వాంగ్మూలం సేకరించారు. మాజీ ఎంఆర్‌ఓ ఆదాయానికి మించి ఆస్తుల కేసుకు సంబంధించిన మొత్తం ఎంత మందిని వరంగల్ ఎసిబి డిఎస్‌పి సాంబయ్య విచారించారు, అందులో ఎవరెవరికి నోటీసులు ఇచ్చారన్న సమాచారం సైతం సేకరించారు. దీంతో అప్రమత్తమైన విచారణాధికారులు హైదరాబాద్‌కు చెందిన డీఎస్పీ మరో ముగ్గురు కలిసి పిస్తా హౌస్‌లో భోజనం చేసిన సమయంలో సిసి ఫుటేజీ, కాల్‌డేటా సేకరించడంతో పాటు ఈ వ్యవహారాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. వెరసి సెప్టెంబరు 11 రాత్రి హైదరాబాద్‌కు చెందిన డీఎస్పీ, బాధితులు కలిసి రూ. 20 లక్షల లంచం ఎవరికి చేరిందన్న వ్యవహారంపై పూర్తి స్థాయి నివేదిక ఏసీబీకి డైరెక్టర్‌కు ఇచ్చిన నివేదికలో పేర్కొన్నట్లు తెలిసింది.

## వీసాలపై కెనడా కఠిన ఆంక్షలు

### 74 శాతం భారతీయుల దరఖాస్తుల తిరస్కృతి




**ఒట్టావా:** భారతీయులకు వీసాలకు సంబంధించిన ఆంక్షలను కెనడా మరింతగా కఠినతరం చేసింది. వీసా కోసం వచ్చే దరఖాస్తులో అధిక శాతాన్ని తిరస్కరిస్తోంది. ఈ ఏడాది ఆగస్టులో 74 శాతం అర్జీలను తిరస్కరించింది. అంటే ప్రతి నాలుగు దరఖాస్తులలో మూడు కచ్చితంగా తిరస్కరిస్తున్నది. 2023 ఆగస్టులో 32 శాతం దరఖాస్తులు తిరస్కరించగా, ఈ ఏడాది ఆగస్టులో 74 శాతం తిరస్కరించింది. చైనా విద్యార్థులు పెట్టుకున్న 24 శాతం వీసా దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యారు. ఇతర దేశల విద్యార్థుల అర్జీలు 40 శాతం మేర తిరస్కరించబడ్డాయి. దీంతో కెనడాపై విదేశీ విద్యార్థులకు ముఖ్యంగా భారతీయులకు ఆసక్తి తగ్గుతోందన్న సంకేతాలున్నాయి. 2023 ఆగస్టులో 20,900 మంది కెనడా వీసాల కోసం దరఖాస్తు చేసుకోగా, ఈ ఏడాది ఆగస్టు నాటికి ఆ సంఖ్య బాగా తగ్గిపోయింది. కేవలం 4,515 మంది దరఖాస్తు చేసుకున్నారు. మోసపూరిత విధానాలతో తమ దేశంలోకి వచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్న క్రమంలో వీసా ఆంక్షలను కెనడా కఠినతరం చేసుకున్నది.

## హిందూజా గ్రూప్ చైర్మన్ కన్నుమూత



**న్యూఢిల్లీ:** ప్రముఖ వ్యాపార వేత్త, హిందుజా గ్రూప్ ఛైర్మన్ గోపీచంద్ పి హిందూజా (85) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన లండన్‌లో తుదిశ్వాస విడిచారు. వ్యాపార వర్గాల్లో జీపీగా పేరుగాంచిన గోపీచంద్ హిందూజా బ్రిటన్‌లోని అత్యంత ధనవంతులైన వ్యాపారవేత్తలలో ఒకరు. ఆయనకు భార్య సునీత, కుమారులు సంజయ్, ధీరజ్, కుమార్తె రీటా ఉన్నారు. 1950లో కుటుంబ వ్యాపారంలోకి ప్రవేశించి కంపెనీని ఇండోమిడిల్ ఈస్ట్ ట్రేడింగ్ ఆపరేషన్ నుండి ఒక అంతర్జాతీయ కంపెనీగా మార్చడంలో ఘనత పొందారు. ప్రభావవంతమైన వ్యాపార కుటుంబంలోని రెండవ తరానికి ప్రాతినిధ్యం వహించిన గోపీచంద్ పి హిందూజా... తన అన్నయ్య శ్రీచంద్ పి హిందూజా మరణం తర్వాత... మే 2023లో బహుళజాతి సంస్థ హిందూజా గ్రూప్ బాధ్యతలు స్వీకరించారు. భారత దేశ స్వాతంత్ర్యానికి ముందు సంప్రదాయ వ్యాపార కుటుంబంలో జన్మించిన గోపీచంద్ హిందూజా 1959లో తన వత్తిపరమైన ప్రయాణాన్ని ప్రారంభించి, ముంబైలోని కుటుంబ సంస్థలో చేరారు. దశాబ్దాలుగా, ఒకప్పుడు ఇండోమిడిల్ ఈస్ట్ వాణిజ్య వ్యాపారాన్ని 30 కంటే ఎక్కువ దేశాలలో ఉనికితో ప్రపంచ పారిశ్రామిక సమ్మేళనంగా మార్చడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఆయన నాయకత్వంలో, గ్రూప్ బ్యాంకింగ్, ఫైనాన్స్, ఎనర్జీ, ఆటోమోటివ్, మీడియా, మౌలిక సదుపాయాలు సహా అనేక రంగాలలోకి విస్తరించింది. హిందూజా గ్రూప్‌ను 1919లో పరమానంద్ దీప్‌చంద్ హిందూజా స్థాపించారు, అతను సింధ్ (అప్పుడు అవిభక్త భారతదేశంలో, ఇప్పుడు పాకిస్థాన్‌లో ఉంది) నుండి ఇరాన్‌కు వెళ్లారు. ఆ తరువాత 1979లో తన స్థావరాన్ని ఇరాన్ నుండి లండన్‌కు మార్చింది. అప్పటినుంచి కంపెనీ ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది. ప్రస్తుతం ముంబై ప్రధాన కార్యాలయం కలిగిన గ్రూప్ ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 2 లక్షల మందికి ఉపాధి కల్పిస్తోంది. ఈ వ్యాపార సామ్రాజ్యంతో పాటు హిందూజా గ్రూపు రియల్ ఎస్టేట్ పోర్ట్ ఫోలియోకు కూడా ప్రసిద్ధి చెందింది. దాని అత్యంత విలువైన ఆస్తులలో వైట్‌హాల్‌లోని ఓల్డ్ వార్ ఆఫీస్ భవనం. ఇది లండన్‌లోని చారిత్రాత్మక ల్యాండ్‌మార్క్.ఈ భవనాన్ని సెప్టెంబర్ 2023లో ప్రారంభించిన రాఫెల్స్ లండన్ హోటల్‌గా తిరిగి అభివద్ధి చేశారు.

## వణికిన వరంగల్
(మొదటి పేజీ తరువాయి)

కలచి వేస్తున్నాయి.

**కరీంనగర్ – వరంగల్ జాతీయ రహదారిపై వర్షపు నీరు**

కరీంనగర్ జిల్లాలోని హుజూరాబాద్‌లో మంగళవారం భారీ వర్షం కురిసింది. సుమారు గంటపాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం కారణంగా పలు కాలనీలు జలమయమయ్యాయి. మామిండ్లవాడ, గ్యాస్ గోదాం ఏరియా, బుడిగ జంగాల కాలనీ, గాంధీనగర్, ఇందిరానగర్ కాలనీలలోకి భారీగా వర్షపు నీరు చేరింది. డిపో అడ్డదారి వద్ద కరీంనగర్ వరంగల్ జాతీయ రహదారిపై భారీగా వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కాగా, యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పెద్ద చెరు వు అలుగుపోయడంతో వరద నీరు ఇళ్లలోకి చేరింది. వినాయకనగర్‌లో స్థానికులు ఇబ్బందులు పడుతున్నా రు. చౌటుప్పల్‌లోని ఎంపిడిఒ కార్యాలయం, పాలకేంద్రం, టిటిడి కల్యాణ మండపాలను వరద నీరు చుట్టుముట్టింది. దీంతో ఎంపిడిఒ కార్యాలయంలో సామగ్రి తడిచింది.

## హైదరాబాద్‌లో జిసిసి
(మొదటి పేజీ తరువాయి)

సహకారం అందిస్తుందని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఎడబ్ల్యుస్) ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా కలిసి, ప్రస్తుతం కొనసాగుతున్న డేటా సెంటర్ ప్రాజెక్టులు, తెలంగాణలో ఎడబ్ల్యుఎస్ విస్తరణ ప్రణాళికలపై చర్చలు జరిపింది. ఈ ప్రతినిధి బృందంలో ఎడబ్ల్యుఎస్ గ్లోబల్ ఆపరేషన్స్ అండ్ డేటా సెంటర్ డెలివరీ వైస్ ప్రెసిడెంట్ కెర్రీ పర్సన్, ఎడబ్ల్యుఎస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పబ్లిక్ పాలసీ డైరెక్టర్ విక్రమ్ శ్రీధరన్, ఎడబ్ల్యుఎస్ డైరెక్టర్ అనురాగ్ ఖిల్నాని తదితర సీనియర్ అధికారులు ఉన్నారు.

## ప్యాసింజర్, గూడ్స్ రైలు ఢీ
(మొదటి పేజీ తరువాయి)

వారు తెలిపారు. ప్రమాదంలో ఇప్పటివరకు ఏడుగురు మరణించినట్లు నిర్ధారించారు. మరో ఇద్దరు ఇంకా శిథిలాల లోపల చిక్కుకున్నారని, వారిని బయటకు తీసే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని బిలాస్‌పూర్ కలెక్టర్ సంజయ్ అగర్వాల్ పిటిఐకి తెలిపారు. గూడ్స్ రైలు కూడా ప్యాసింజర్ రైలు వెళ్ళే దిశలోనే కదులుతోందని ఆయన అన్నారు. గాయపడిన ప్రయాణికులను బిలాస్‌పూర్‌లోని అపోలో హాస్పిటల్, ఛత్తీస్‌గఢ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (సిఐఎంఎస్) ఆసుపత్రికి తరలించారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని ఆయన తెలిపారు. రైల్వే అధికారులు ఘటనా స్థలంలో సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వ్యక్తుల చికిత్స కోసం అవసరమైన చర్యలు తీసుకుంటున్నారని అధికారులు తెలిపారు. కాగా, మృతుల బంధువులకు ఒక్కొక్కరికి రూ.10 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ. 5 లక్షలు పరిహారం ప్రకటించగా, స్వల్పంగా గాయపడిన వారికి రూ.లక్ష సహాయం అందుతుందని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఘటనపై రైల్వే భద్రతా కమిషనర్ (సిఆర్‌ఎస్) స్థాయిలో వివరణాత్మక విచారణ నిర్వహించి, కారణాన్ని నిర్ధారించి, అవసరమైన దిద్దుబాటు చర్యలను సిఫార్సు చేస్తామన్నారు. రైల్వే యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన సహాయ, రక్షణ చర్యలను ప్రారంభించింది. పరిస్థితిని పర్యవేక్షించడానికి సీనియర్ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని చికిత్స కోసం సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. బాధిత ప్రయాణికులకు రైల్వే అధికారులు సాధ్యమైనంత అందించారు. ప్రయాణికులు, వారి కుటుంబాల సౌలభ్యం కోసం హెల్ప్‌లైన్ నంబర్లను జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి ప్రమాదంపై విచారం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బాధిత కుటుంబాలకు పూర్తి సంఘీభావంగా ఉందని చెప్పారు.

## జలదిగ్బంధంలో రామచంద్రగూడ



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** మంగళవారం కురిసిన భారీ వర్షంతో రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం రామచంద్ర గూడలోని కోటిరెడ్డి చెరువు అలుగు పారుతోంది. దీంతో గ్రామంలోకి భారీగా వరదనీరు చేరింది. ఇళ్లలోకి వరదనీరు రావడంతో రామచంద్రగూడ గ్రామస్థులు భయంతో బిక్కుబిక్కుమంటున్నారు. పలు ఇళ్లలోని నిత్యావసర వస్తువులు పూర్తిగా నీట మునిగాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా రామచంద్రగూడలోని మోడల్ స్కూల్ ప్రహరీ గోడ కూలి వరద నీరు భారీగా చేరుకోవడంతో విద్యార్థులు స్కూల్ పైకి ఎక్కారు. విషయం తెలుసుకున్న స్థానిక మహేశ్వరం సిఐ వెంకటేశ్వర్లు తన సిబ్బందితో హుటాహుటిన అక్కడికి చేరుకుని విద్యార్థులను మహేశ్వరంలోని ప్రభుత్వ, ప్రైవేటు బిల్డింగులకు ఆశ్రయం కల్పించడం తోపాటు. విద్యార్థులకు అవసరమైన వసతులు ఏర్పాటు చేయించారు. అదేవిధంగా మహేశ్వరం పట్టణంలోని కాలనీలు, జలదిగ్బంధంలో కూరుకుపోయాయి. రాకపోకలు స్తంభించి తీవ్ర ఇబ్బందులకు లోనవుతున్నారు. మహేశ్వరం పట్టణంతోపాటు మండలంలోని పలు చెరువులు నిండిపోయాయి. దీంతో తమ చెరువులకు ఏ క్షణానైనా గండి పడచ్చని భయంతో ఆయా గ్రామాల ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

## డాక్టర్ ఇంట్లో భారీగా డ్రగ్స్
(మొదటి పేజీ తరువాయి)

పిజి మెడిసిన్ చదువుతున్న ఓ డాక్టర్ పట్టుబడ్డాడు. జాన్‌పాల్ అనే వ్యక్తి ఎంబిబిఎస్ పూర్తి చేసుకుని హైదరాబాద్‌లో మెడిసిన్‌లో పిజి చదువుతూ.. ముషీరాబాద్‌లో ఒక ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. ఏడాది నుంచి జాన్‌పాల్ డ్రగ్స్‌కు అలవాటు పడ్డాడు. డ్రగ్స్ ఖరీదు చేసేందుకు తన వద్ద డబ్బులు లేకపోవడంతో డ్రగ్స్ విక్రయించాలని నిర్ణయానికి వచ్చాడు. ఈ క్రమంలోనే హైదరాబాద్ కు చెందిన తన స్నేహితులు ప్రమోద్, సందీప్, శరత్‌లను ఆశ్రయిస్తాడు. ఈ ముగ్గురు బెంగుళూరు ఢిల్లీ నుంచి డ్రగ్స్‌ను తెప్పిస్తారు. ఈ క్రమంలోనే డాక్టర్ కూడా డ్రగ్స్ తెప్పించుకుని తన ఇంట్లో నిల్వ పెట్టుకునేవాడు. తన ముగ్గురు స్నేహితులు చెప్పిన వారికి జాన్‌పాల్ డ్రగ్స్ అమ్మేవాడు. ఈ డ్రగ్స్ అమ్మకాలు జరిపినందుకు తన వద్ద ఉన్న డ్రగ్స్‌ను తాను ఉచితంగా వాడుకుంటూ కాలం గడుపుతున్నాడు. ఈ మేరకు ఎస్‌టిఎఫ్ టీం లీడర్ ప్రదీప్ రావుకు సమాచారం అందింది. దీంతో మంగళవారం ముషీరాబాద్‌లోని డాక్టర్ జాన్‌పాల్ ఇంటిపై ఎస్‌టిఎఫ్ ఎస్‌ఐ బాలరాజు, కానిస్టేబుల్ విజయ్ కృష్ణలు సోదాలు నిర్వహించారు. డాక్టర్ జాన్ పాల్ ఇంట్లో 26.95 గ్రాముల ఓజి కుష్, 6.21 గ్రాముల ఎండిఎంఎ, 15 ఎల్‌ఎస్‌డి బాస్ట్స్, 1.32 గ్రాముల కొకైన్, 5.80 గ్రాముల గుమ్మస్, 0.008 గ్రాముల హాసిస్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న ఈ డ్రగ్స్ విలువ రూ.మూడు లక్షలు విలువ ఉంటుందని ఎస్‌ఐ బాలరాజు తెలిపాడు. ఒక డాక్టర్ వద్ద ఇంత పెద్ద మొత్తంలో డ్రగ్స్ పట్టుకోవడం పట్ల ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం అభినందించారు.

**రూ. కోటి విలువ చేసే డ్రగ్స్ కాల్చివేత..**

హైదరాబాద్ ఎక్సైజ్ డివిజన్‌లోని అమీర్‌పేట్, ధూళిపేట్, కాచిగూడ, ముషిరాబాద్, నాంపల్లి ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 104 కేసుల్లో పట్టుకున్న గంజాయి, డ్రగ్స్‌ను మంగళవారం కాల్చివేశారు. షాద్‌నగర్‌లో ఉన్న జిజె మల్టీకావ్ ప్రైవేట్ లిమిటేడ్ కంపెనీలో కాల్చివేశారు. డ్రగ్స్‌ను, గంజాయిని కాల్చి వేయాలని హైదరాబాద్ డిప్యూటి కమిషనర్ అనిల్ కుమార్ రెడ్డి ఇచ్చిన అదేశాల మేరకు ఎఇఎస్ శ్రీనివాసరావు కాల్చివేయించారు.295 కెజిల గంజాయి, 7.65 గ్రాములు ఎండిఎంఏ, 1.25 కేజీల స్ట్రా పప్పీ, కొద్దిపాటిగా కోకైన్, హాశీష్ అయిల్ పెంనల్ ఇంజక్షన్లు , 35 ఎంఎల్ హైక్లోరిడ్‌ను కాల్చివేసిన వాటిలో ఉన్నాయి. కాల్చేస్తున్న డ్రగ్స్ విలువ సుమారు కోటి మీద ఉంటుందని అంచనా వేశారు.

## నాణ్యతపై రాజీపడం
(మొదటి పేజీ తరువాయి)

ఆయకట్టుకు ఆనుకొని ఉన్న భూములు సేద్యంలోకి వస్తాయని భావిస్తే ఎత్తిపోతల పథకాల సామర్థ్యాన్ని పెంచుకోవచ్చని అధికారులకు సూచించారు. మైనర్ మార్పులతో అదనపు ఆయకట్టు సేద్యంలోకి వచ్చేందుకు అయ్యే అదనపు నిధులను సమకూరుస్తానని వెల్లడించారు. ఎత్తిపోతల పథకాల నిర్మాణాల నిమిత్తం ప్రభుత్వం భూసేకరణ నిర్వహించి రైతులకు నగదు చెల్లింపులు జరిపిన భూములను సత్వరమే అధికారులు స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. పంటకు పంటకు మధ్యలో ఉండే సమయాన్ని సద్వినియోగం చేసుకుని ఎత్తిపోతల పథకాల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. ఎత్తిపోతల పథకాల నిర్మాణాలపై ఆయకట్టు రైతాంగం పెంచుకున్న ఆశలు అమలులోకి రావాలంటే నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్, కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి, ఇఎస్‌సిలు అంజద్ హుస్సేన్, శ్రీనివాస్, రమేష్ బాబు, హుజూర్‌నగర్, కోదాడ నియోజక వర్గాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నీటిపారుదల శాఖాధికారులు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై కమిటీ
(మొదటి పేజీ తరువాయి)

15 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పాలసీపై ప్రభుత్వానికి సూచనలు ఇవ్వనుంది. అలాగే ప్రత్యేక ట్రస్ట్ ద్వారా ఫీజు రీయింబర్స్‌మెంట్ సాధ్యాసాధ్యాలను ఈ కమిటీ పరిశీలించనుంది. మూడు నెలల్లో ఈ కమిటీ తమ నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంటుంది. ఉన్నత విద్యను మరింత మెరుగుపర్చేందుకు కూడా కమిటీ సూచనలు ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. విద్యా సంస్థల సూచనలను కూడా కమిటీ అధ్యయనం చేయనుంది.

**కమిటీ :** ఛైర్మన్ సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, వైస్‌ఛైర్మన్ ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి, సభ్యులుగా విద్య, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ సంక్షేమ శాఖలకు చెందిన కార్యదర్శులు, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్, ప్రొఫెసర్ కంచె ఐలయ్య, ప్రొఫెసర్ ఎం.కోదండరామ్‌తో పాటు ఎఫ్‌ఎటిఎస్‌ఐ నుంచి ముగ్గురు సభ్యులు. ఎస్‌సి సంక్షేమ శాఖ కమిషనర్ మెంబర్ కన్వీనర్‌గా వ్యవహారిస్తారు. కాగా మరో సభ్యున్ని ఛైర్మన్ నియమించుకునేందుకు అవకాశం కల్పించారు.

## మోస్తరు వర్షాలు
(మొదటి పేజీ తరువాయి)

అవకాశాలున్నాయన్నారు. మంగళవారం నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేశామన్నారు. బుధ, గురువారాల్లో రాష్ట్రంలో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందన్నారు.

## మైనారిటీ సంక్షేమం
(మొదటి పేజీ తరువాయి)

కేటాయించని ఇతర విభాగాలు ఉన్నాయి. వాటిలో పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖను అజారుద్దీన్ కు కేటాయించారు. ఇక గత జూన్‌లో మంత్రివర్గంలో చేరిన అడ్లూరి లక్ష్మణ్ కు ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ, వికలాంగులు, వృద్ధుల సంక్షేమ, ట్రాన్స్‌జెండర్ల సాధికారత శాఖలను ప్రభుత్వం అప్పగించింది. తాజాగా ఆయన వద్దనున్న మైనార్టీ శాఖను అజారుద్దీన్‌కు అప్పగించింది. కాగా గత శుక్రవారం అజారుద్దీన్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన చేత గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రమాణం చేయించారు. మైనార్టీ సంక్షేమం, పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్ శాఖలను ప్రభుత్వం కేటాయించింది.

## హెచ్‌ఆర్‌సి ఆగ్రహం
(మొదటి పేజీ తరువాయి)

అలాగే టీజీఎస్ ఆర్టీసీ అధికారుల నుండి ప్రమాదంపై సమగ్ర నివేదికలను డిసెంబర్ 15, 2025 ఉదయం 11 గంటల లోపు సమర్పించాలని కమిషన్ ఆదేశించింది. ఈ ఘటనపై మరింత విచారణ జరిపి బాధ్యత వహించాల్సిన అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని కమిషన్ సూచించింది. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఒక ప్రకటన విడుదల చేసింది.



# జనరల్
STATE & REGIONAL NEWS

## భూసార పరీక్షల ద్వారా ఎరువుల మోతాదు




ప్రజాపక్షం/హైదరాబాద్: రైతులు భూసార పరీక్షలు చేయించడం ద్వారా భూములలో ఉన్న పోషకాలు తెలుస్తాయని, తద్వారా పంటల సాగుకు అనుకూలంగా ఎరువుల మోతాదును గుర్తించే అవకాశాలు ఉంటాయని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు సూచించారు. సాటిలైట్ టెక్నాలజీతో మట్టి పరీక్షలు చేసే కంపెనీలతో ప్రభుత్వం జరుపుతున్న చర్చలు ఇంకా ప్రయోగ దశలోనే ఉన్నాయని, ఈ టెక్నాలజీ అందుబాటులోకి రాగానే, రాష్ట్రమంతా ఒకేసారి మట్టి పరీక్షలు నిర్వహిస్తామని వెల్లడించారు. వరి, పత్తి పంటలకు బదులుగా ఆయిల్ పామ్ పంట సాగు చేపట్టాలని, ఎక్కువ ఆదాయం పొందవచ్చని, ప్రభుత్వం కూడా తగిన ప్రోత్సాహం అందిస్తుందన్నారు.

# ‘మక్కల కొనుగోలు’లో సహకారం లేదు

### కేంద్రమంత్రులు కిషన్, బండి చొరవ తీసుకోవాలి: తుమ్మల

ప్రజాపక్షం/హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం నుండి ఎటువంటి సహకారం అందకపోయినప్పటికీ రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వమే మార్కెట్ ధరకు మక్కలను కొనుగోలు చేసేందుకు సిద్ధమైందని వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. రూ. 2500 కోట్లతో మక్కలను కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. జిన్నింగ్ మిల్లర్ల సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని తెలంగాణ రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కి తుమ్మల లేఖ రాశారు. జిన్నింగ్ మిల్లర్ల అంశంపైన మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మంగళవారం సమీక్ష నిర్వహించారు. కాగా జిన్నింగ్ మిల్లర్ల సమస్యల విషయమై సిసిఐ సిఎండి లలిత్ కుమార్ గుప్తాతో మంత్రి తుమ్మల మంగళవారం ఫోన్‌లో మాట్లాడారు. ఎకరాకు 7 క్వింట వరకు మాత్రమే కొనుగోలు చేయాలనే కేంద్రం విధించిన పరిమితి అభ్యంతరకరమని,ఈ నిబంధనను ఎత్తివేయడం అత్యవసరమని, ఈ నిబంధనను సవరించేలా చూడాలని సిసిఐ సిఎండిని కోరారు. సిసిఐ అవలంబిస్తున్న ఎల్1, ఎల్2, ఎల్3 అలాట్‌మెంట్ విధానంతో కొన్ని జిన్నింగ్ మిల్లులలో మాత్రమే కొనుగోల్లు జరుగుతున్నాయని, అనేక జిన్నింగ్ మిల్లులు మూతపడే పరిస్థితులు నెలకొనే పరిస్థితులు ఉన్నాయని మంత్రి తుమ్మల వివరించారు. కపాస్ కిసాన్ యాప్ ద్వారా పత్తి కొనుగోళ్లలో




ఎదురవుతున్న సాంకేతిక ఇబ్బందుల కారణంగా రైతులు, మిల్లుదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే ఈనెల 6వ తేదీ నుంచి కొనుగోళ్లు నిరవధికంగా నిలిపివేయాలని తెలంగాణ రాష్ట్ర కాటన్ అసోసియేషన్ నిర్ణయం తీసుకున్న విషయాన్ని మంత్రి తుమ్మల వివరించారు.

# ఫిన్ టెక్ ‘గ్లోబల్ కమాండ్ సెంటర్’గా హైదరాబాద్

### ‘డాయిష్ బోర్స్ గ్రూప్’ జిసిసి ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు

ప్రజాపక్షం/హైదరాబాద్: హైదరాబాద్ ను గ్లోబల్ ఫైనాన్షియల్ టెక్నాలజీ(ఫిన్ టెక్)కి అత్యంత కీలకమైన గ్లోబల్ కమాండ్ సెంటర్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. రాయదుర్గంలో అంతర్జాతీయ దిగ్గజ ఫైనాన్షియల్ మార్కెట్ సంస్థ ‘డాయిష్ బోర్స్ గ్రూప్‘ గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్(జిసిసి)ను ఆయన మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు.




ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడు తూ.... ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు పిల్లర్‌గా ఉన్న డాయిష్ బోర్స్ గ్రూప్ హైదరాబాద్‌ను ఎంచుకోవడం రాష్ట్ర ప్రభుత్వ పటిష్ఠమైన పాలసీలు, స్థిరత్వం, ఇక్కడి టాలెంట్ పూల్‌పై గ్లోబల్ కంపెనీలకు ఉన్న నమ్మకానికి నిదర్శనమన్నారు. ప్రపంచంలోని టాప్ టెన్ అసెట్ మేనేజ్‌మెంట్ సంస్థలలో ఏడు ఇక్కడ నిర్వహిస్తుండటం మనకు గర్వకారణమన్నారు. డాయిష్ బోర్స్ రాకతో హైదరాబాద్ గ్లోబల్ క్యాపిటల్, సంపదకు శక్తినిచ్చే కేంద్రంగా అంతర్జాతీయ యవనికపై మరోసారి నిరూపించుకుందన్నారు. నగరాన్ని కేవలం ఇంక్యుబేషన్ హబ్‌గా మాత్రమే కాకుండా ‘గ్లోబల్ ఆవిష్కరణ పవర్‌హౌస్‘గా మార్చేలా ఒక ప్రత్యేక గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్‌ను ప్రారంభించబోతున్నట్లుగా వెల్లడించారు. ఈ హబ్ రీసెర్చ్, బ్రేక్‌త్రూ ఐడియాల కు ప్లాట్‌ఫామ్‌గా నిలుస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం పెట్టుబడులను ఆకర్షించడంపైనే కాకుండా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు మద్దతు ఇచ్చే వాల్యూను సృష్టించేందుకు ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ జీసీసీ షాంఘై స్టాక్ ఎక్స్చేంజ్ వంటి ప్రధాన ఎక్స్చేంజీలతో సహా 24 ట్రిలియన్ డాలర్లకు పైగా ఆస్తులను నిర్వహించే గ్లోబల్ మార్కెట్లకు అత్యున్నత సేవలు అందిస్తుందన్నారు. తొలిదశలో ఏఐ, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ ఇంజనీరింగ్ వంటి డీప్ టెక్నాలజీ రంగాల్లో 1,000మందికి హై స్కిల్డ్ ఉద్యోగాలు లభిస్తాయన్నారు. రాబోయే రోజుల్లో ఈ సంఖ్య రెండింతలు అవుతుందన్నారు. కార్యక్రమంలో జర్మనీ అంటూ కాన్సుల్ జనరల్ మైకేల్ హాస్పర్, స్పెషల్ సీఎస్ సంజయ్ కుమార్, డ్యుయిష్ బోర్స్ సిఇఒ,సిఒఒ డాక్టర్ క్రిస్టోఫ్ బోమ్, డైరెక్టర్ డాక్టర్ లుడ్విగ్ హీన్సెల్‌మన్ తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ పార్టీనే గెలిపిద్దాం

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.ఎస్. బోస్ పిలుపు

ప్రజాపక్షం/హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించి, సామాజిక న్యాయానికి కట్టుబడి ఉన్న కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టం కట్టాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్ పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎర్రగడ్డ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలిపించాలని సిపిఐ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వి.ఎస్.బోస్ మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యధికంగా ఉన్న బిసిలకు సామాజిక న్యాయ సాధికారత కోసం తీసుకువచ్చిన విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థలలో 42 రిజర్వేషన్లు అమలు కాకుండా కేంద్రంలో ఉన్న బిజెపి పార్టీ అడ్డుకుంటుందని విమర్శించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత పదేళ్లు పరిపాలించిన బిఆర్‌ఎస్ ఏ ఒక్కనాడు కూడా సామాజిక న్యాయం సాధికారత వైపు ఆలోచించకపోవడమే కాకుండా బిసిలను రాజకీయంగా అణచివేసి, కపట ప్రేమను చూపిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని జిమ్మిక్కులు చేసిన బిఆర్‌ఎస్‌ను ప్రజలు నమ్మడం లేదన్నారు. జనాభాలో అత్యధిక శాతం ఉన్న బిసిలకు దేశవ్యాప్తంగా ఐఐటి, ఐఐఎం లాంటి కేంద్ర విద్యా సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందని బోస్ గుర్తు చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఓటర్లు బిఆర్‌ఎస్, బిజెపి పార్టీల బంధాన్ని గుర్తించాలని కోరారు. ఆ పార్టీలు చేసే ప్రజా వ్యతిరేక కుట్రలను తిప్పి కొట్టాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలిపించాలని ఓటర్లకు బోస్ విజ్ఞప్తి చేశారు. ఎర్రగడ్డ డివిజన్‌లోని సంజయ్ నగర్, మోతి నగర్, న్యూ సుల్తాన్ నగర్, కళ్యాణ్ నగర్ ప్రాంతాలలో సిపిఐ కార్యకర్తలు పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమంలో సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, జిల్లా సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, కె. ఏసురత్నం, జిల్లా కార్యవర్గ సభ్యులు కాంపల్లి శ్రీనివాస్, నేర్లకంటి శ్రీకాంత్, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్ర, పాలబిందెల శ్రీనివాస్, కృష్ణ, దస్తగిరి, చెట్టుకింద శ్రీను, మహమూద్, కొమురెల్లి బాబు, సైఫ్, చైతన్య, గౌస్, లెనిన్, మనోచారి, తలహ, నూర్, అనిల్, సుశాంత్ పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై సిఎం రేవంత్‌రెడ్డి వ్యూహాత్మక అడుగులు

### కార్మిక, సంక్షేమ సంఘాల నేతలను స్వయంగా కలుస్తున్న సిఎం

ప్రజాపక్షం/హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఎన్నికలపై ముఖ్యమంత్రి వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నా రు. నియోజకవర్గంలోని వివిధ వర్గాలు, కార్మిక సంఘా లు, సీనియర్ నేతలను కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా సమీకరిస్తున్నారు. వారితో నేరుగా చర్చించి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతు కూడగడుతున్నారు. అందులో భాగంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత బి.ఎన్. రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర తమిళ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజ్ కుమార్, ప్రధాన కార్యదర్శి ధర్మలు మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్ యాదవ్‌కు తమ మద్దతు ప్రకటించారు. ఈ సమావేశంలో తమిళ సంక్షేమ సంఘం ప్రతినిధులు ముఖ్యమంత్రిని కలుసుకుని, నవీన్ యాదవ్ విజయం కోసం తమ పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. సంఘం నాయకులు మాట్లాడుతూ, తమిళ సమాజ అభ్యున్నతికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ధన్యవాదాలు తెలిపారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం సాధించాలని వారు ఆకాంక్షించారు. ఫిలిం ఫెడరేషన్, ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు.



**కాంగ్రెస్‌లో చేరిన నారాయణ స్వామి**

జూబ్లీహిల్స్ నియోజకవర్గ రాజకీయాల్లో కీలక పరిణా మం చోటుచేసుకుంది. ఉమ్మడి ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి టిడిపి అభ్యర్థిగా ఎమ్మెల్యేగా పోటీ చేసిన బిఆర్‌ఎస్ సీనియర్ రాజకీయ నేత, నారాయణస్వామి, ఆయన కుమారుడు రామచందర్‌లు మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి వారికి కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనర్సింహ, మాజీ ఎమ్మెల్సీ అరకల నర్సా రెడ్డి, బి.ఎన్. రెడ్డి తదితరులు పాల్గొన్నారు. నారాయణస్వామి, రామచందర్‌లు కాంగ్రెస్‌లో చేరికతో పార్టీ బలోపేతం అవుతుందని నాయకులు తెలిపారు. రానున్న జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో ఇది కాంగ్రెస్‌కు శుభపరిణామమని ఈ కార్యక్రమానికి నేతృత్వం వహించిన కాంగ్రెస్ సీనియర్ నేత బి.ఎన్.రెడ్డి తెలిపారు.

**కాంగ్రెస్‌కు తెలంగాణ 24 ఫ్రేమ్స్ ఫిలిం ఫెడరేషన్ యూనియన్ మద్దతు**

తెలంగాణ 24 ఫ్రేమ్స్ ఫిలిం ఫెడరేషన్ యూనియన్ అధ్యక్షుడు కరుణాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మూర్తిలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశా రు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతు ప్రకటించారు. అనంతరం సినీ రంగానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, మాజీ ఎమ్మెల్సీ అరకాల నర్సరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేత బి.ఎన్. రెడ్డి పాల్గొన్నారు. ఫిలిం ఫెడరేషన్ కార్యకలాపాలు, సినీ పరిశ్రమ అభివృద్ధి, కళాకారుల సంక్షేమం వంటి అంశాలకు సంబంధించిన సమస్యలు పరిష్కరిస్తామని సిఎం వారికి హామీనిచ్చినట్లు ఈ కార్యక్రమానికి నేతృత్వం వహించిన బి.ఎన్.రెడ్డి తెలిపారు. తెలంగాణ 24 ఫ్రేమ్స్ ఫిలిం ఫెడరేషన్ యూనియన్ మద్దతు ఇవ్వడం తమ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయానికి దోహదపడుతుందని బి.ఎన్.రెడ్డి చెప్పారు.





# చట్టంపై పట్టు సాధించండి

### ఎఇఎస్, ఎస్ఐల శిక్షణాకార్యక్రమంలో మంత్రి జూపల్లి

ప్రజాపక్షం/హైదరాబాద్: ఉన్నత చదువులు చదివి, కష్టపడి గ్రూప్1, గ్రూప్2 పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మీరు, ఇప్పుడు ఎక్సైజ్ శిక్షణలోనూ రాటుదేలాలి.. ఎక్సైజ్ చట్టంపై పట్టు సాధించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. ఎక్సైజ్ అకాడమీలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో గ్రూప్1 ద్వారా ఎంపికైన ఎఇఎస్‌లు, గ్రూప్2 ద్వారా ఎంపికైన 84 మంది ఎస్ఐలకు శిక్షణ ప్రారంభమైంది. ఈ సందర్భం గా మంత్రి మాట్లాడుతూ.. డ్రగ్స్, గంజాయి, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్, ఫ్యూరియస్ లిక్కర్ వంటి వాటిని అరికట్టడంలో ఎక్సైజ్ సిబ్బంది కీలక పాత్ర పోషించాలి. గత బ్యాచ్‌లకు లభించని ప్రత్యేక అవకాశంగా, ఈసారి మీకు వెపన్ ట్రైనింగ్ కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు శిక్షణలో ప్రతిభ కనబరచిన వారిని గుర్తించి యాక్సలరీ ప్రమోషన్లు అందజేస్తామని వెల్లడించారు. తల్లి దండ్రుల కలలను వమ్ము చేయకుండా నిజాయితీగా పనిచేయండి అని పిలుపునిచ్చారు. ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్‌రావు మాట్లాడుతూ, ఎక్సైజ్ శాఖను కేవలం ఆదాయాన్ని సమకూర్చే విభాగంగా కాకుండా, చట్టం అమలులో నైపుణ్యం(స్కిల్)పై దృష్టి పెట్టాలి అన్నారు. ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా నడుచుకుంటూ డ్రగ్స్, ఫ్యూరియస్ లిక్కర్‌ను అరికట్టడంలో అందరూ బాధ్యతగా వ్యవహరించాలి. శిక్షణకు అవసరమైన అన్ని సౌకర్యాలు, స్పోర్ట్స్ సదుపాయాలు కల్పిస్తాం అన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమీ జాయింట్ డైరెక్టర్ శశిధర్‌రెడ్డి, రంగారెడ్డి డిప్యూటీ కమిషనర్ దశరథ్, ఎఇఎస్‌లు కృష్ణప్రియ, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైద్యశాఖలో ముగ్గురు డిప్యూటీ డైరక్టర్లకు పదోన్నతి

ప్రజాపక్షం/హైదరాబాద్: వైద్య ఆరోగ్యశాఖలో ముగ్గురు డిప్యూటీ డైరక్టర్లకు జాయింట్ డైరక్టర్లుగా రాష్ట్రప్రభుత్వం పదోన్నతి కల్పించినట్లు వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తూ ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యూటీ డైరక్టర్లుగా పనిచేస్తున్న ఎన్.కృష్ణవేణిని హైదరాబాద్‌లోని డిఎంఇ (అడ్మినిస్ట్రేషన్) జాయింట్ డైరక్టర్‌గా, శ్వేత మొంగను ఎంహెచ్ఎస్ఆర్‌బి (అడ్మినిస్ట్రేషన్) జాయింట్ డైరక్టర్‌గా, బి.మంజునాథ్ నాయక్‌ను ఎన్‌హెచ్ఎం సిఇఒగా నియమించింది.


**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
**సూపరింటెండింగ్ ఇంజనీర్, సికింద్రాబాద్ జోన్.**

‘ఇ’ ప్రొక్యూర్‌మెంట్ నోటీసు

**Short NIT No. 40/SE(M)/Sec-bad Zone/GHMC/2025-26** తేది: 04.11.2025

క్ర.సం. 1, **NIT No.** 40/SE(M)/Sec-bad Zone/GHMC/2025-26 తేది: 04.11.2025, **పనుల సంఖ్య:** 01 పని, **అంచనా విలువ:** రూ.54.50లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** *బిడ్ దాఖలుకు ప్రారంభ తేది & సమయం:* 06.11.2025న మ.1.00గం.ల నుండి, *బిడ్ దాఖలుకు ఆఖరి తేది & సమయం:* 12.11.2025న మ.1.00గం.ల వరకు. **అధికారి పేరు & చిరునామా:** ఎస్ఇ, సికింద్రాబాద్ జోన్, జిహెచ్ఎంసి. సెల్ నెం. 9963550657. మరిన్ని వివరాలకు https://www.tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, సికింద్రాబాద్ జోన్, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 10209-PP/CL/ADVT/1/2025-26, Date: 04-11-2025



**తెలంగాణ ప్రభుత్వం**
**ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం,**
**మిషన్ భగీరథ ఇన్‌ట్రా, డివిజన్ :: ఖమ్మం**
(ఎస్.సి. బాయ్స్ హాస్టల్ ప్రక్కన, రామాలయం వీధి, ఎన్.ఎస్.పి. క్యాంప్, ఖమ్మం)

**Short Tender Notice No.01/2025-26, తేది: 03.11.2025**

వివిధ పనుల కోసం అర్హత కలిగిన సివిల్ కాంట్రాక్టర్ల నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంలో బిడ్లు ఆహ్వానించడమైనది. **“1) ఖమ్మం జిల్లాలోని ఖమ్మం రూరల్ మండలం దరీదులోని పడమటితండాలో PWS పథకం విస్తరణ, అంచనా వ్యయం రూ.9.50 లక్షలు”. 2) రఘునాథ పాలెం (ఎం) చెరువు కొమ్ముతండాలో పంపింగ్ మెయిన్ నీటి సరఫరాను అందించడం.** షెడ్యూళ్ళు https://tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో 10.11.2025 నుండి 17.11.2025 వరకు మధ్యాహ్నం 3:00 గంటల వరకు అందుబాటులో ఉంటాయి. బిడ్లు **18.11.2025న సాయంత్రం 4.00 గంటలకు** తెరవబడును.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఎంపి ఇన్‌ట్రా, డివిజన్, ఖమ్మం.

DIPR R.O. No. : 10194-PP/CL/ADVT/1/2025-26, Date: 04-11-2025



**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, డివిజన్-14, జిహెచ్ఎంసి**

**NIT No. 51/E.E.14/GHMC/2025-26** తేది: 03.11.2025

**పని పేరు:** జిహెచ్ఎంసి, కెజెడ్, డివిజన్-14 క్రింద వివిధ సివిల్ ఇంజనీరింగ్ పనులు, **అంచనా విలువ:** రూ.69.65లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** *బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది :* 04.11.2025న ఉ.11.00గం.లకు మరియు *బిడ్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం:* 07.11.2025న ఉ.11.00గం.ల వరకు (క్ర.సం.1 నుండి), *బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది :* 04.11.2025న ఉ.11.00గం.లకు మరియు *బిడ్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం:* 11.11.2025న ఉ.11.00గం.ల వరకు (క్ర.సం.02 నుండి 14 వరకు). **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-14, జిహెచ్ఎంసి, 5వ అంతస్తు, అబిడ్స్ పార్కింగ్ కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్ www.tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-14, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 10171-PP/CL/ADVT/1/2025-26, Date: 04-11-2025




సిపిఐ సీనియర్ నాయకులు ఎఆర్ దేవరాజు కుమారుడు ఎఆర్ రామరాజు చిత్రపటానికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ నాయకులు సయ్యద్ అజీజ్ పాషా, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు పశ్య పద్మ, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, చెన్నకేశవరావు, వందన, వారి కుటుంబ సభ్యులు

## ‘దాశరథి జీవిత చరిత్ర’ పుస్తకావిష్కరణ

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణను నిజాం నుంచి విముక్తి చేయడానికి తన ప్రాణాన్ని లెక్క చేయక ఉద్యమంలో పాల్గొంటూ తన రచనలతో, ప్రసంగాలతో జనచైతన్యం కోసం కృషి చేసిన ప్రజాకవి దాశరథి జీవితాన్ని, రచనలను ఇప్పటికీ ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ ఎనుగు నరసింహా రెడ్డి అన్నారు. రవీంద్రభారతిలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ‘పిల్లల కోసం దాశరథి జీవిత చరిత్ర’ను రాపోలు సుదర్శన్ రాసిన పుస్తకాన్ని డాక్టర్ ఎనుగు నరసింహా రెడ్డి ఆవిష్కరించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న తెలంగాణ సాహిత్య అకాడమి కార్యదర్శి డాక్టర్ నామోజి బాలాచారి తెలంగాణ సాహిత్య అకాడమీలో దాశరథిపై జరుగుతున్న కృషిని వివరించారు.శ్రీకృష్ణదేవరాయ, తెలుగు భాషానిలయం కార్యదర్శి టి.ఉదయవర్లు, మాట్లాడుతూ దాశరథి చమకులు వినిపించారు. బాల సాహితీవేత్త డాక్టర్ అమరవాది నీరజ పుస్తకం వైశిష్ట్యాన్ని తెలియజేశారు.

## ఫీజు బకాయిలపై ఉన్నత విద్యామండలి ముట్టడి




ప్రజాపక్షం/హైదరాబాద్:పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలపై బిసి విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని విద్యా మండలి కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా పోలీసులకు నిర్వాహకులకు తీవ్ర వాగ్వివాదం కావడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో ట్రాఫిక్ స్థంభించింది.ఈ సందర్భంగా బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణలు మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. ఫీజుల బకాయిలు విడుదలలో నిర్లక్ష్యం వహిస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేతులెత్తేసిందన్నారు.

ప్రభుత్వం రియంబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేసేందుకు కుట్ర పన్నుతుందని వారన్నారు. రాష్ట్రంలో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు గాలిలో దీపంగా మారిందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం వైఖరి మారకుంటే లక్షల మంది విద్యార్థులతో విద్యార్థి మార్చ్ త్వరలో నిర్వహిస్తామని హెచ్చరించారు. ముఖ్యమంత్రి దగ్గర ఉన్న శాఖకే నిధులు కేటాయించకపోతే వేరే శాఖ పరిస్థితి ఏంటి? అని వారు ప్రశ్నించారు. 14 లక్షల 75 వేల మంది విద్యార్థుల భవిష్యత్తు గాలిలో దీపంగా మారిందన్నారు. పెండింగ్ లో ఉన్న ఫీజు 9 వేల కోట్లు బకాయిలు చెల్లించకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు ఫీజులు చెల్లించాలంటూ విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నారు, ఫీజులు కట్టలేక ఉన్నత విద్యకు విద్యార్థులు దూరమవుతున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నంద గోపాల్, రక్షక దళం ఉదయ్, శివమ్మ, విద్యార్థి నాయకుడు రాం బాబు, సాయి వెంకట్, రాహుల్, అర్జున్, తదితరులు పాల్గొన్నారు.


**తెలంగాణ ప్రభుత్వం**
**పురపాలక సంఘం : భైంసా, జిల్లా: నిర్మల్.**

**నోటిఫికేషన్ నెం. MCB/E1/Quotation/01/2025-26** తేది: 04.11.2025

కొటేషన్ నోటీసు

భైంసా మున్సిపాలిటీలో స్వచ్ఛ్ భారత్ మిషన్‌లో భాగముగా కంపోస్ట్ సౌకర్యాలు మరియు DRCC ల సమర్థవంతమైన నిర్వహణ పనులు చేపట్టుట కొరకు మున్సిపాలిటీలో రోజుకు 20-30 టన్నుల వ్యర్థాల నిర్వహణ కొరకు ఈ క్రింది యంత్రాల యొక్క ప్రైస్ కొటేషన్లు తేది: 07.11.2025 సా.5.00 గంటలు లేదా ఆలోపు కమిషనర్, భైంసా మున్సిపాలిటీ వారిచే కోరబడుచిన్నవి.

| క్ర.సం. | యంత్రం యొక్క పేరు | కెపాసిటీ |
|---|---|---|
| 1 | Trommel (16-40mm, 4-6mm) | 20-30 Tonnes Per Day Capacity |
| 2 | sorting conveyor belt (Required length as per site condition) | |
| 3 | Baling machine (2No's) | |
| 4 | Garden Shredder | |
| 5 | Shredder | |
| 6 | Windrow turner | |
| 7 | Air Blower(3 No's). | |

**సంప్రదించవలసిన వివరాలు:**
మున్సిపల్ కమిషనర్ (9515121070), మున్సిపల్ ఇంజనీర్ (6305001071)
దీని ప్రతి నోటీసు బోర్డు పై తగు సమాచారం నిమిత్తం.

సం/- కమిషనర్ పురపాలక సంఘం, నిర్మల్

DIPR R.O. No. : 10249-PP/CL/ADVT/1/2025-26, Date: 04-11-2025


# ఎఐటిఇలో పాల్గొనే వలంటీర్లకు ఆహ్వానం

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే అఖిల భారత పులుల లెక్కింపు (ఎఐటిఇ)2026 కార్యక్రమంలో ఆసక్తి కలిగిన వాలంటీర్లు పాల్గొనాలని వన్య ప్రాణుల సంరక్షణ అధికారి ఈలు సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద వన్యప్రాణి మానిటరింగ్ ప్రోగ్రామ్‌గా పేరు గాంచిన ఈ లెక్కింపును వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఐఐ), డెహ్రాడూన్ మరియు నేషనల్ టైగర్ కన్సర్వేషన్ అథారిటీ (ఎన్‌టిసిఎ) సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. 2022లో జరిగిన పులుల లెక్కింపులో దేశవ్యాప్తంగా పులుల సంఖ్య 3,967 గా నమోదైంది. ఇది 2018లో 2,967, 2014లో 2,226, 2006లో 1,411 నుండి నిరంతరంగా పెరుగుతున్న సానుకూల ధోరణిని సూచిస్తోంది. ఈ లెక్కింపులో తెలంగాణ రాష్ట్రంలో కూడా పులుల సంఖ్య పెరుగుతూ వస్తోంది..అమ్రాబాద్, కావల్ టైగర్ రిజర్వుల్లో పులుల సంఖ్యతో పాటు ఇతర వన్యప్రాణుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. ఎఐటిఇ 2026లో దేశంలోని 8.27 లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం, 65,000కు పైగా అటవీ బీట్లను కవర్ చేయనుంది. తెలంగాణ రాష్ట్రం సుమారు 26,000 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం గల 3,000కు పైగా బీట్ల నుండి డేటా సేకరించనుంది. ఇది డెక్కన్ ప్రాంతంలో అత్యధికంగా పాల్గొనే రాష్ట్రాల్లో ఒకటిగా నిలుస్తుంది. ఆధునిక వన్య ప్రాణి సంరక్షణ పారదర్శకమైన, శాస్త్రీయమైన డేటాపై ఆధారపడుతుంది. 2022 లెక్కింపులో పౌర శాస్త్రవేత్తలు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, గ్రామీణ సమూహాలు పాల్గొనడం వల్ల సర్వే నాణ్యత పెరిగింది. 2026లో వీరి పాత్రకీలకమని అధికారులు పేర్కొన్నారు.

**స్వచ్ఛంద సేవకు పిలుపు :** ఈ లెక్కింపులో పౌరులు, విద్యార్థులు, వన్యప్రాణి అభిమానులు పాల్గొనవచ్చు. ప్రతి వాలంటీర్ అట వీ సిబ్బందితో కలిసి 7 రోజులపాటు ట్రాన్సెక్ట్ వాక్స్ నిర్వహిస్తారు. రోజు కు 10–15 కిలోమీటర్ల దూరం నడుస్తూ అడవుల్లో పులుల జాడలు, అడుగుల ముద్రలు, మలచిహ్నాలు, నివాస నాణ్యత వంటి వివరాలను సేకరిస్తారు. స్వచ్ఛంద సేవా అవకాశాలు నవంబర్3, 2025 నుంచి ప్రారంభమవుతున్నాయి. మరిన్ని వివరాలకు తెలంగాణ అటవీ శాఖ అధికారిక వెబ్‌సైట్ లేదా హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించాలని సూచించారు. వయసు: 18–60 సం.లు, ఫిట్నెస్..రోజుకు 10–12 కిమీ అడవుల్లో నడిచే సామర్థ్యం అనుకూలత..తక్కువ సౌకర్యాలతో దూరప్రాంత క్యాంపుల్లో ఉండగల సామర్థ్యం కలిగి ఉండాలని సూచించారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## శ్రీలంక అంతర్జాతీయ క్రీడా సదస్సుకు డాక్టర్ బి.లక్ష్మయ్య



**ప్రజాపక్షం/హైదరాబాద్:** శ్రీలంక రాజధాని కొలంబియాలో జరిగే అంతర్జాతీయ క్రీడా సదస్సుకు కాచిగూడ జూనియర్ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బి.లక్ష్మయ్య పాల్గొంటున్నారు. ఈ సదస్సు ఈనెల 6 ,7 వతేదీల్లో కొలంబియాలో జరుగుతుంది. క్రీడల అభివృద్ధిలో మీడియా పాత్ర అనే అంశంపై ఆయన పరిశోధన పత్రాలను సమర్పించనున్నారు. ఆయన ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర జూనియర్ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్ గా, ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా వ్యవహరిస్తున్నారు. అంతర్జాతీయ సదస్సులో పాల్గొంటున్న సందర్భంగా మంగళవారం డాక్టర్ బి. లక్ష్మయ్యను రాష్ట్ర జూనియర్ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు డాక్టర్ ఎస్. సోమేశ్వరరావు, రాష్ట్ర డిగ్రీ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ. బాలరాజ్, డాక్టర్ ఎం.పర్వతాల గౌడ్, జె.బాబూలాల్, కృష్ణారావులు సన్మానించారు.

## ఇవిఎంల కమిషన్ ప్రక్రియ పూర్తి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలోని కోట్ల విజయ భాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో జూబ్లీ హిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికకు సంబంధించి ఈవిఎంల కమిషన్ ప్రక్రియ ఈ నెల 2, 3వ తేదీలలో రిటర్నింగ్ అధికారి చేపట్టారు. పోటీలో ఉన్న అభ్యర్థులు, వారి ఏజెంట్‌ల సమక్షంలో జరిగిన ఈ ప్రక్రియను ఎన్నికల సాధారణ పరిశీలకులు రంజిత్ కుమార్ సింగ్, పోలీస్ పరిశీలకులు ఓం ప్రకాశ్ త్రిపాఠి, జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్‌లు పరిశీలించారు.



## మంచి మెజారిటీతో గెలుస్తాం

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మంచి మెజార్టీతో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించబోతుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం రెహ్మత్‌నగర్ డివిజన్‌లోని ఓమ్ నగర్ చర్చి కమిటీ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు మంగళవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో రోడ్ సేఫ్టీ అథారిటీ ఛైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి మంత్రి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో గడచిన 23 నెలల్లో చేపట్టిన అభివృద్ధి , సంక్షేమ కార్యక్రమాలే కాంగ్రెస్ పార్టీకి విజయాన్ని చేకూర్చిపెడతాయని ధీమా వ్యక్తం చేశారు. ఈ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మంచి మెజార్టీతో విజయం తథ్యమన్నారు. ఇప్పటికే ఈ డివిజన్‌లో పెద్ద ఎత్తున వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు, నాయకులు, ఆటో యూనియన్ సభ్యులు కాంగ్రెస్ పార్టీలో చేరారని తెలిపారు. త్వరలో మరికొంతమంది కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారని అన్నారు. పదేళ్లలో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఒక్క రేషన్ కార్డుకూడా ఇవ్వలేని బిఆర్‌ఎస్ పార్టీ నాయకులకు ఓట్లు అడిగే హక్కు ఎక్కడిదని ప్రశ్నించారు. 22 నెలల్లోనే జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అర్హులైన 14వేల కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు ఇచ్చామని, సుమారు 8 వేల మంది పేర్లను కార్డులలో చేర్పించామన్నారు.



## 7 నుంచి ఘనంగా వందేమాతరం 150వ వార్షికోత్సవ వేడుకలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : దేశవ్యాప్తంగా వందేమాతరం 150 మహోత్సవాలు ఈనెల 7 నుండి 25 వరకు నిర్వహించనున్నట్టు రాజ్యసభ సభ్యుడు, బిజెపి ఓబిసి మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మణ్ తెలిపారు. హైదరాబాద్ నాంపల్లిలోని బిజెపి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 1875లో బంకిమ్ చంద్ర చటర్జీ రచించిన వందేమాతరం గీతం స్వాతంత్ర్య ఉద్యమానికి ప్రేరణగా నిలిచిందన్నారు. ఈనెల 7న దేశవ్యాప్తంగా 150 ప్రాముఖ్య ప్రదేశాల్లో 150 మంది గాయకులు వందేమాతరాన్ని సమూహంగా ఆలపించనున్నారన్నారు. బిజెపి ఆధ్వర్యంలో ఈనెల 8 నుండి 26 వరకు కార్యక్రమాలు కొనసాగి, ఈనెల 26న రాజ్యాంగ దినోత్సవంతో ముగుస్తాయని తెలిపారు. తెలంగాణలో ఆదిలాబాద్, నిజామాబాద్, గోల్కొండ, మహబూబ్‌నగర్, వరంగల్ జిల్లాల్లో వేడుకలు జరగనున్నాయని చెప్పారు. యువతలో దేశభక్తి, జాతీయ సమైక్యత భావాలు బలపడేలా ఈ మహోత్సవాలు దోహదం చేస్తాయన్నారు.



## బిజెపికి జనసేన మద్దతు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి లంకల దీపక్ రెడ్డికి జనసేన పార్టీ మద్దతు ప్రకటించింది. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు, కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డిలతో జనసేన తెలంగాణ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు శంకర్ గౌడ్ భేటీ అయ్యారు. అనంతరం ఆయన బిజెపికి పూర్తి మద్దతు ప్రకటించారు. రెండు పార్టీల నాయకులు బుధవారం సంయుక్తంగా మీడియా సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. హైదరాబాద్‌లోని సాగర్ సొసైటీలో జరిగిన ఈ భేటీలో బిజెపి అభ్యర్థి లంకల దీపక్ రెడ్డితో పాటు పార్టీ ప్రధాన కార్యదర్శి గౌతమ్ రావు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డితో పాటు రెండు పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఈ భేటీ జనసేన అధ్యక్షులు, ఏపి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు జరిగినట్టు నాయకులు తెలిపారు.

# బిఆర్‌ఎస్-బిజెపి ఒక్కటే

### కాదు అంటే.. ఈనెల 11లోగా కాళేశ్వరం కేసులో సిబిఐ ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలి
### కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి సిఎం రేవంత్ బహిరంగ సవాల్





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్‌ఎస్, బిజెపి ఒక్కటి కాకపోతే ఈనెల 11లోగా కాళేశ్వరం కేసులో సిబిఐ ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహమత్ నగర్ డివిజన్‌లో మంగళవారం జరిగిన రోడ్‌షో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కాళేశ్వరం కెసిఆర్ కుటుంబానికి ఏటిఎంగా మారిందని బిజెపి నేతలు పదే పదే చెప్పారని తెలిపారు. కాళేశ్వరం కేసును సిబిఐకి అప్పగిస్తే 48 గంటల్లో తండ్రి కొడుకులను జైలుకు పంపిస్తామని అనేక పర్యాయాలు కిషన్ రెడ్డి అన్నారన్నారు. మరీ తెలంగాణ ప్రభుత్వం కాళేశ్వరం కేసును సిబిఐకి అప్పగించి మూడు నెలలైనా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని కిషన్ రెడ్డి సిఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. బిజెపి, బిఆర్‌ఎస్ పార్టీలది ఫెవికాల్ బంధం కాకపోతే ఈ నెల 11 లోగా కాళేశ్వరం కేసులో సిబిఐ ఎఫ్‌ఐఆర్ ఫైల్ చేసి, కెసిఆర్, హరీశ్ రావు, కెటిఆర్‌లను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఫార్ములా ఈ కార్ రేస్ కేసులో కెటిఆర్‌ను అరెస్ట్ చేసేందుకు ఎందుకు అనుమతి ఇవ్వడం లేదన్నారు. ఇందులో మీ రెండు పార్టీల మధ్య చీకటి ఒప్పందం ఏంటని సిఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. లోపాయికారీ ఒప్పందం చేసుకుని, జూబ్లీహిల్స్‌లో బిజెపి బిఆర్‌ఎస్‌కు పరోక్ష మద్దతు ఇస్తోందని విమర్శించారు. ఎందుకంటే రాబోయే రోజుల్లో బిఆరెస్ బిజెపిలో విలీనం కాబోతుందని ఆరోపించారు. బిజెపిలో బిఆర్‌ఎస్ విలీనం అవుతుందని తాను చెప్పడం లేదని, స్వయంగా కల్వకుంట్ల ఫ్యామిలీ ఆడబిడ్డ కవితనే చెప్పిందని సిఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు.

**జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ 30 వేల మెజార్టీతో గెలవబోతుంది..**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ 30 వేల ఓట్ల మెజార్టీతో విజయ దుందుభి మోగించబోతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ జనం మధ్య ఉండే నాయకుడన్నారు. ఆయన్ను గెలిపించాలని కోరారు. 'మాగంటి గోపినాథ్ చనిపోవడంతో ఆయన సతీమణి సునీతను గెలిపించాలని బిఆర్‌ఎస్ కోరుతోందని, గతంలో పిజెఆర్ చనిపోతే ప్రత్యర్థిగా ఉన్న చంద్రబాబు టిడిపి అభ్యర్థిని నిలబెట్టకుండా మద్దతు ఇచ్చారన్నారు. కానీ, కెసిఆర్ మాత్రం అభ్యర్థిని నిలబెట్టి ఎన్నిక ఏకగ్రీవం కాకుండా అడ్డుకున్నారన్నారు. గతంలో ఎవరైనా ఎమ్మెల్యే చనిపోతే ఆ కుటుంబ నుంచే ఏకగ్రీవం చేసే సంప్రదాయం ఉండేదని తెలిపారు. కానీ పిజెఆర్ చనిపోయినప్పుడు బిఆర్‌ఎస్ అభ్యర్థిని నిలబెట్టి, ఆ మంచి సంప్రదాయానికి కెసిఆర్ తూట్లు పొడిచారని విమర్శించారు.

**సొంత చెల్లిని బయటకు పంపిన దుర్మార్గుడు కెటిఆర్..**

సొంత చెల్లికి ఆస్తిలో వాటా ఇవ్వాల్సి వస్తుందని ఇంటి నుంచి బయటకు పంపిన దుర్మార్గుడు కెటిఆర్ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. అలాంటాయనా మాగంటి సునీతమ్మను ఆదుకుంటాడంటే నమ్మేది ఎలా అని ప్రశ్నించారు. సొంత చెల్లెను ఇంట్లో నుంచి గెంటేసిన కెటిఆర్, మహిళా సెంటిమెంట్ గురించి మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలో ఉన్నప్పుడు ఐదేళ్లు మహిళలకు మంత్రి పదవి ఇవ్వని బిఆర్‌ఎస్ వాళ్లను చీపురు దెబ్బలు కొట్టాలన్నారు. మహిళలకు, మైనారిటీలకు సముచిత స్థానం కల్పించిన పార్టీ కాంగ్రెస్ ఒక్కటేనని అన్నారు. బిఆర్‌ఎస్‌ను ఎందుకు గెలిపించాలో ఆ పార్టీ నేతలు సమాధానం చెప్పాలని సిఎం రేవంత్ రెడ్డి నిలదీశారు. రేషన్ కార్డులు రద్దు చేయడానికా ?, సన్న బియ్యం, ఉచిత బస్సు రద్దు చేయడానికా ? అని ప్రశ్నల వర్షం కురిపించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక తరువాత నియోజకవర్గంలో పేదలకు 4 వేల ఇళ్లు ఇప్పించే బాధ్యత తనదని సిఎం రేవంత్ హామీనిచ్చారు.



## కాంగ్రెస్ గెలుపు లక్ష్యంగా ఐక్యతా ప్రదర్శన

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మేయర్ జూబ్లీహిల్స్ ప్రజలు కాంగ్రెస్‌పై అపారమైన నమ్మకం ఉంచారని, ఈ నమ్మకాన్ని కాపాడుకుంటూ, ప్రతి డివిజన్‌లో సమన్వయంతో పనిచేసి, నవీన్ యాదవ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నదే సంకల్పమ హైదరాబాద్ మేయర్, జూబ్లీహిల్స్ కోఆర్డినేషన్ కమిటీ చైర్ పర్సన్ గద్వాల్ విజయలక్ష్మి స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ ఘన విజయం సాధించేందుకు కీలకమైన కోఆర్డినేషన్ కమిటీ సమావేశం మంగళవారం గాంధీభవన్‌లో జరిగింది. గద్వాల్ విజయలక్ష్మి , చైర్ పర్సన్, మాజీ ఎంఎల్‌ఏ ఈరవత్రి అనిల్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు 7 డివిజన్ల ఇంఛార్జిలు, చైర్మన్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఏకమై 'నవీన్ యాదవ్ గెలుపు కాంగ్రెస్ గెలుపు' అనే ఏకైక లక్ష్యంతో కట్టుబడి పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. సమావేశంలో అనిల్ మాట్లాడుతూ ప్రతి కార్యకర్త, నాయకుడు ఒక్కొక్కరు ఒక్కో డివిజన్‌లో బూత్ లెవెల్ వరకు చురుకుగా పనిచేయాలని, ఐక్యత, సమన్వయం, క్రమశిక్షణ పార్టీ విజయ సూత్రాలన్నారు. అని పిలుపునిచ్చారు.



ఐపిఎస్ కన్ఫర్డ్ అయిన సందర్భంగా డిజిపి బి. శివధర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన మహేశ్వరం డిసిపి డి. సునీత రెడ్డి

## 'సిగాచీ' ఎండికి హైకోర్టు నోటీసులు

**హైదరాబాద్ :** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం పాశమైలారంలోని సిగాచీ కంపెనీ ఎండికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. మృతులు, బాధిత కుటుంబాలకు పరిహారం చెల్లింపులో కౌంటరు దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఉన్నత న్యాయస్థానం రెండు వారాలకు వాయిదా వేసింది. సిగాచీ పరిశ్రమలో పేలుళ్ల ఘటనపై కలపాల బాబూరావు దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై తెలంగాణ హైకోర్టు విచారణ చేపట్టింది. పిటిషనర్ తరపున వసుధా నాగరాజు వాదనలు వినిపించారు. పేలుడు ఘటనలో 54 మంది మృతి చెందారని, ప్రమాదం జరిగి నాలుగు నెలలు గడిచినా ఇప్పటి వరకు ఎవరినీ అరెస్టు చేయలేదని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. బాధితులకు ఇస్తామన్న రూ.కోటి పరిహారం కూడా ఇవ్వలేదని, ఎన్నో ఉల్లంఘనలు జరిగినట్టు దర్యాప్తులో తేలిందని వివరించారు. నిపుణుల కమిటీ నివేదికను విశ్లేషిస్తున్నామని అదనపు అడ్వొకేట్ జనరల్ రజనీకాంత్ తెలిపారు. 192 మంది ప్రత్యక్ష సాక్షుల నుంచి పోలీసులు వాంగ్మూలం సేకరించారు. సిగాచీ కంపెనీకి చెందిన వైస్ ప్రెసిడెంట్ సైతం ప్రమాదంలో చనిపోయారు. నిపుణుల కమిటీ నివేదిక ఆధారంగా పోలీసులు చర్యలు తీసుకోనున్నారు అని కోర్టుకు తెలిపారు. బాధితులకు రూ.కోటి పరిహారం ఎప్పుడు చెల్లిస్తారని ఈ సందర్భంగా హైకోర్టు ప్రశ్నించింది. మృతుల కుటుంబాలకు రూ.25లక్షలు చెల్లించామని, కంపెనీ నుంచి మిగతా డబ్బులు వచ్చేలా చూస్తున్నామని ఏఏజీ వివరణ ఇచ్చారు. రెండు వారాల్లో సమగ్ర వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఏఏజీని హైకోర్టు ఆదేశించింది.

## తాండూరు ప్రమాదం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం

### టిడిపి నేత పి.సాయిబాబా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమం ప్రహసనంగా మారిందని టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి. సాయిబాబా విమర్శించారు. దోమల్‌గూడ నగర పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ పోలీసులు కొందరికి ఈ కార్యక్రమం కాసుల వర్షం కురిపించే సాధనంగా మారిందని ఆరోపించారు. ప్రభుత్వం పర్యవేక్షణ లోపించడంతో లక్ష్యాలు విఫలమయ్యాయని అన్నారు. తాండూరులో మద్యం సేవించి బస్సు నడిపిన డ్రైవర్ కారణంగా జరిగిన ప్రమాదం దీనికి నిదర్శనమన్నారు. అదే రోజు నల్లగొండ, కరీంనగర్ జిల్లాల్లో వరుసగా జరిగిన బస్సు ప్రమాదాల్లో పలువురు గాయపడ్డారన్నారు. వాహన ఫిట్నెస్ తనిఖీలు సక్రమంగా జరిగితే ఇటువంటి ప్రమాదాలు నివారించవచ్చని, అవినీతిలో మునిగిపోయిన ఆర్‌టిఎ శాఖను ప్రభుత్వం వెంటనే శుద్ధి చేయాలని సాయిబాబా డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు నల్లెల్ల కిశోర్, పి.బాల్‌రాజ్ గౌడ్ పాల్గొన్నారు.

## పోలింగ్ రోజు మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం

### డిఇఒ, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక, పారదర్శక ఎన్నికల నిర్వహణలో మైక్రో అబ్జర్వర్‌లది కీలక పాత్ర అని జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అన్నారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో మంగళవారం మైక్రో అబ్జర్వర్‌లకు పోలింగ్ డే రిపోర్ట్‌పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్.వి. కర్ణన్, సాధారణ పరిశీలకులు రంజిత్ కుమార్ సింగ్‌లు హాజరయ్యారు. ఈ శిక్షణలో పోలింగ్ రోజు మైక్రో అబ్జర్వర్లు చేపట్టవలసిన బాధ్యతలు, మాక్ పోలింగ్, పోలింగ్ కేంద్ర సదుపాయాల పరిశీలన, ఓటర్ల గుర్తింపు, ఓటింగ్ యంత్రాల సీలింగ్, ఓటు గోప్యత కాపాడడం, ఫిర్యాదుల నమోదు విధానం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కర్ణన్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం కళ్లూ చెవుల్లా మైక్రో అబ్జర్వర్లు వ్యవహరిస్తారని చెప్పారు. పోలింగ్ ప్రతి దశలో నిబంధనలు పాటించబడుతున్నాయా అన్న దానిపై వారు కీలక పర్యవేక్షణ బాధ్యతలు నిర్వర్తించాలని చెప్పారు. సాధారణ పరిశీలకులు రంజిత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ మైక్రో అబ్జర్వర్స్ పోలింగ్ రోజు అప్రమత్తంగా, నిష్పాక్షికంగా, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మైక్రో అబ్జర్వర్స్ సందేహాలను అధికారులు నివృత్తి చేశారు.

**ఓటు హక్కు వినిగించుకున్న 97 మంది వృద్ధులు, వికలాంగులు**



జూబ్లీహిల్స్ శాసనసభ నియోజకవర్గం మధురానగర్‌లో హోం ఓటింగ్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ పరిశీలించారు. హోం ఓటింగ్ కోసం దరఖాస్తు చేసుకున్న మొత్తం 103 మందిలో 97 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని అధికారులు తెలిపారు.

## 'సర్' ఫేజ్-2 షురూ



**న్యూఢిల్లీ :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ రెండవ విడత మంగళవారం ప్రారంభమైంది. తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఈ ప్రక్రియను చేపట్టినట్లు కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. ఆయా రాష్ట్రాల్లో ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ మొదలు పెట్టినట్లు తెలిపింది. ఓటర్ల జాబితా ప్రక్షాళనను బిహార్‌లో విజయవంతంగా పూర్తి చేసినట్లు పేర్కొన్న ఇసి.. తాజాగా రెండో దశను ప్రారంభించినట్లు తెలిపింది. ఎస్ఐఆర్ రెండో దశలో ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తర్‌ప్రదేశ్, పశ్చిమ బెంగాల్ సహా అండమాన్ నికోబార్ దీవులు, లక్షద్వీప్, పుదుచ్చేరిలు ఉన్నాయని ఇసి వెల్లడించింది. 321 జిల్లాలు, 1843 అసెంబ్లీ నియోజకవర్గాల్లో దాదాపు 51 కోట్ల ఓటర్లను కవర్ చేయనున్నట్లు తెలిపింది. ఎన్యూమరేషన్ ప్రక్రియ నెల పాటు (డిసెంబర్ 4 వరకు) కొనసాగుతుందని, అక్టోబర్ 27 వరకు ఓటరు జాబితాలో ఉన్న ప్రతి ఓటరుకు సంబంధించి పాక్షిక వివరాలు ఎన్యూమరేషన్ ఫారంలో (ఇఎఫ్) ఉంటాయని ఎన్నికల సంఘం వెల్లడించింది. ఈ ప్రక్రియ సజావుగా సాగేందుకు 5.3లక్షల మంది బూత్‌స్థాయి అధికారులు (బిఎల్‌ఓలు), 7.64లక్షల బూత్ స్థాయి ఏజెంట్లు (బిఎల్‌ఏలు), 10,448 ఇఆర్‌ఒ/ఎఇఆర్‌ఒలు, 321 మంది డిఇఒలు విధుల్లో నిమగ్నమయ్యారని ఇసి పేర్కొంది. ఈ సమయంలో ఇఎఫ్‌ల పంపిణీ, సేకరణ కోసం బిఎల్‌ఓలు ప్రతి ఇంటికి కనీసం మూడుసార్లు వెళ్తారని తెలిపింది. డిసెంబరు 9న ఓటర్ల జాబితా ముసాయిదాను విడుదల చేయనుండగా.. వచ్చే ఏడాది ఫిబ్రవరి 7న తుది ఓటర్ల జాబితా ప్రచురణతో ఎస్ఐఆర్ రెండో దశ ముగియనుంది. అస్సాంలోనూ వచ్చే ఏడాది ఎన్నికలు ఉండగా.. అక్కడ ఎస్ఐఆర్ కోసం ప్రత్యేక తేదీని ప్రకటిస్తామని ఇసి ఇప్పటికే ప్రకటించింది. ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తూ పశ్చిమ బెంగాల్‌లో నిరసనలు మొదలయ్యాయి. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేతృత్వంలో కోల్‌కతాలో భారీ స్థాయిలో నిరసన ప్రదర్శన కొనసాగింది. వచ్చే ఏడాదిలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో దీన్ని ఓ రాజకీయ ఆయుధంగా ఉపయోగిస్తున్నారని దీదీ ఈ సందర్భంగా ఆరోపించారు. ఇదే సమయంలో రాష్ట్రంలో 16లక్షల ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేసినట్లు అధికారులు వెల్లడించారు.



## విచ్చలవిడిగా మట్టి తవ్వకాలు

### సొమ్ము చేసుకుంటున్న దళారులు - చోద్యం చూస్తున్న అధికారులు

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ప్రభుత్వ భూములను లక్ష్యంగా చేసుకుని దళారులు మట్టిని తవ్వి అమ్ముకుంటు సొమ్ము చేసుకుంటున్నారు. మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లి మున్సిపల్‌లో రాత్రి, పగలు తేడా లేకుండా విచ్చలవిడిగా మట్టి తవ్వకాలు జరుపుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.. మూడుచింతలపల్లి మున్సిపల్‌లోని లక్ష్మాపూర్, ఉద్దెమర్రి, కేశ్వాపూర్ తదితర గ్రామాల నుంచి మట్టిని తరలిస్తున్నారు. అమాయకులైన రైతులకు డబ్బు ఆశచూపి వారి భూముల్లో ఇష్టానుసారంగా మట్టిని తీస్తు నగరంలోని పలు ప్రాంతాల్లో అధిక ధరకు విక్రయిస్తున్నారు. మట్టి మాఫియా విచ్చలవిడిగా చేస్తుండటంతో రైతుల పొలాలకు వెళ్లే రోడ్లు పూర్తిగా ధ్వంసమై రైతులు నరకయాతన పడుతున్నారు. ప్రభుత్వ, అసైన్‌మెంట్ భూముల్లో మట్టిని తవ్వుతున్న దళారులకు కింది స్థాయి రెవెన్యూ సిబ్బంది సహకరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మూడుచింతలపల్లి మున్సిపల్ కావడంతో నిర్మాణాలు పెరిగిపోయాయని దీంతో మట్టి లభించకపోవడంతో నిర్మాణదారులు మట్టి దళారులను ఆశ్రయించి మట్టిని కొనుగోలు చేస్తున్నారు.

**- ఆ మూడు గ్రామాలే టార్గెట్..**

కాగా మూడుచింతలపల్లి మున్సిపాలిటిలోని లక్ష్మాపూర్, ఉద్దెమర్రి, కేశ్వాపూర్ గ్రామాలను టార్గెట్ చేసుకుని అక్రమంగా రాత్రి వేళల్లో మట్టిని తరలిస్తు ప్రజలకు నిద్ర లేకుండా చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఆదివారం సెలవు దినం కావడంతో కేశవరంలోని ఓ రిసార్ట్‌కు టిప్పర్‌ల ద్వార భారీగా మట్టిని తరలించారని సమాచారం. ఇంత జరుగుతున్న రెవెన్యూ అధికారులు, మైనింగ్ అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమైతున్నారని విమర్శలు ఉన్నాయి.

**అక్రమ రవాణ చేస్తే క్రిమినల్ కేసులు : తహసీల్దార్**


కాగా ప్రభుత్వ, అసైన్‌మెంట్, పట్టాదార్ భూముల్లో నుంచి ఏలాంటి అనుమతులు లేకుండా మట్టిని అక్రమంగా రవాణ చేస్తున్నారని తహాశీల్దార్ సుచరితను వివరణ కోరగా అక్రమంగా మట్టిని తరలిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహాశీల్దార్ సుచరిత హెచ్చరించారు. ముందుగా రైతులకు మౌఖికంగా చెప్పి చూస్తామని అలాగే మట్టి అమ్మకాలు జరిపితే చర్యలు తప్పవని అన్నారు. మూడుచింతలపల్లి మున్సిపల్‌లో ఏ రెవెన్యూ గ్రామంలోనైనా మట్టిని తరలిస్తున్నట్లు ఆధారాలతో ఫిర్యాదు చేస్తే ఖచ్చితంగా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని చెప్పారు.



## రూ.5 కోట్ల అక్రమ బియ్యం పట్టివేత

### రైస్‌మిల్లుపై కేసు నమోదు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హనుమకొండ జిల్లాలోని ముచ్చెర్ల గ్రామంలో ఉన్న వెంకటేశ్వర మోడరన్ రైస్ మిల్లుపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం ఆకస్మిక దాడి చేశారు. ఈ దాడిలో అక్రమంగా నిల్వ చేసిన 4061 క్వింటాళ్ల సిఎంఆర్ బియ్యంను పట్టుకున్నారు. దీని విలువ రూ.5,16,27,7091 ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. సదరు రైస్‌మిల్లు యజమానిపై కేసు నమోదు చేశారు. అలాగే హైదరాబాద్ సిటీ1 విజిలెన్స్ అధికారులు సోమవారం అర్ధరాత్రి నుంచి తెల్లవారు జాము వరకు బాచుపల్లి, మియాపూర్, బాలానగర్ రోడ్ ప్రాంతాల్లో రూట్ చెక్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓవర్ లోడ్ లైసెన్స్, పన్ను, పర్మిట్ మొదలైన ఉల్లంఘనలకు పాల్పడిన 19 వాహనాలపై కేసు నమోదు చేశారు. రూ.3,15,800 జరిమాన విధించారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## మావోయిస్టుల ఆయుధ తయారీ కేంద్రాన్ని ధ్వంసం చేసిన భద్రతా దళాలు



**సుక్మా :** ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలోని దట్టమైన అడవిలో ఉన్న మావోయిస్టుల ఆయుధ తయారీ కేంద్రాన్ని భద్రతా దళాలు ధ్వంసం చేసి, ఉత్పత్తిలో ఉపయోగించే భారీ పరికరాలతో పాటు 17 తుపాకీలను స్వాధీనం చేసుకున్నట్లు మంగళవారం ఒక పోలీసు అధికారి తెలిపారు. గోమ్‌గూడ అటవీ ప్రాంతంలోని తాత్కాలిక కర్మాగారాన్ని ఛేదించిన తర్వాత జిల్లా రిజర్వ్ గార్డ్ (డిఆర్‌జి) బృందం సోమవారం ఒక బ్యారెల్ గ్రెనేడ్ రాకెట్ లాంచర్, ఆరు బ్యారెల్ గ్రెనేడ్ లాంచర్లు (బిజిఎల్‌లు), ఆరు 12బోర్ రైఫిల్స్, మూడు సింగిల్‌షాట్ రైఫిల్స్, ఒక కంట్రీమేడ్ పిస్టల్‌తో సహా 17 ఆయుధాలను స్వాధీనం చేసుకుంది. వాటిలో రెండు 12బోర్ రైఫిల్ బ్యారెల్స్, 2 సింగిల్‌షాట్ రైఫిల్ బ్యారెల్స్, ఒక పెద్ద హ్యాండ్‌డ్రిల్ మెషిన్, 17 బెంచ్ వీసెస్, మూడు బిజిఎల్ బ్యారెల్స్, రెండు బిజిఎల్ బాడీ కవర్లు, విద్యుత్ వైర్, ఇనుపపైపులు,తుపాకీలతయారీలో ఉపయోగించే పదార్థాలు ఉన్నాయి.

## బిహార్‌లో మహిళల భద్రత ఆందోళనకరం


**సాధికారత, ఆర్థిక అభ్యున్నతికి కట్టుబడి ఉంది: ఖర్గే**



**న్యూఢిల్లీ :** బిహార్‌లో మహిళల భద్రతపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై బిజెపి–జెడి(యు)ను తీవ్రంగా విమర్శించారు. మహాఘట్‌బంధన్ మహిళల సాధికారత, ఆర్థిక అభ్యున్నతికి పూర్తిగా కట్టుబడి ఉందని ఉద్ఘాటించారు. ఎన్నికల సమయంలో లేదా వాటికి ముందు ఓట్లు సంపాదించడం కోసం మాత్రమే కాంగ్రెస్ వాగ్దానాలు చేయదని, చెప్పినవన్నీ నెరవేరుస్తుందని ఖర్గే అన్నారు. బిహార్‌లో బిజెపి–జెడియు ప్రభుత్వం 20 సంవత్సరాలుగా అధికారంలో ఉందని, నేటికీ, కోడళ్లు, కుమార్తెలు సురక్షితంగా లేరని, ఇదీ ఈ 20 ఏళ్లలో ఎన్‌డిఎ సాధించిన ఘనత అని ఎద్దేవా చేశారు. డబుల్ ఇంజిన్ సర్కార్ అని చెప్పుకుంటున్న మోదీ బిహార్‌ను సురక్షితంగా మార్చలేదని ఖర్గే ఎక్స్‌లో హిందీలో పోస్ట్ చేశారు. స్త్రీలు, పిల్లల పరిస్థితి చాలా ఆందోళనకరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. 70 శాతం మంది పిల్లలు రక్తహీనతతో బాధపడుతున్నారని, 40 శాతం మంది పోషకాహార లోపంతో బాధపడుతున్నారని ఖర్గే పేర్కొన్నారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్) డేటాను ఉటంకిస్తూ శిశువులలో 11 శాతం మందికి మాత్రమే తగినంత పోషకాహారం లభిస్తుందని ఆయన అన్నారు. జనాభాలో సగం మంది సాధికారత, ఆర్థిక అభ్యున్నతికి మహాఘట్‌బంధన్ పూర్తిగా కట్టుబడి ఉందని ఆయన మహిళలను ప్రస్తావిస్తూ అన్నారు. మహాఘట్‌బంధన్ మహిళలకు చేసిన వాగ్దానాలను గుర్తుచేస్తూ ప్రతిపక్ష కూటమి అధికారంలోకి వస్తే వారికి నెలకు రూ. 2,500 సహాయం అందిస్తామని ఖర్గే అన్నారు. వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు నెలకు రూ. 1,500–రూ.3,000 పెన్షన్ ఇస్తామని కూడా ఆయన స్పష్టం చేశారు. జీవిక దీదీలకు అధికారిక హోదా ఇస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు చెప్పారు. 'మా వాగ్దానాలు ఎన్నికల సమయంలో లేదా వారి ముందు ఓట్లు సంపాదించడం మాత్రమే కాదు, అవి నెరవేర్చే వాగ్దానాలు. మేము ఇప్పటికే కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో వాటిని నెరవేర్చాము' అని ఆయన అన్నారు.

## యువత పట్ల మోదీ ఉదాసీనత

**సోషల్ మీడియా రీల్స్ తయారు చేయడంలో బిజీగా ఉండాలని చూస్తున్నారు : రాహుల్‌గాంధీ**



**ఔరంగాబాద్ :** దేశ యువత పట్ల ప్రధాని నరేంద్ర మోదీ చూపుతున్న ఉదాసీనతపై లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ మండిపడ్డారు. యువత సోషల్ మీడియా రీల్స్ తయారు చేయడంలో బిజీగా ఉండాలని మోదీ కోరుకుంటున్నారని, తద్వారా వారు విద్య, ఆరోగ్యం, ఉపాధి సమస్యల నుండి దృష్టి మరల్చకుండా ఉండాలని చూస్తున్నారని ఆరోపించారు. బిహార్‌లోని ఔరంగాబాద్, గయాజీలలో మంగళవారం వరుసగా నిర్వహించిన ఎన్నికల ర్యాలీల్లో పాల్గొని మాట్లాడారు. మోదీపై తీవ్ర విమర్శలు చేశారు. దేశ యువతను సోషల్ మీడియాకు వ్యసనంగా మారేలా ప్రోత్సహిస్తున్నారన్నారు. 'మోదీ మిమ్మల్ని రీల్స్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ తయారీకి బానిసలుగా మార్చాలనుకుంటున్నారు... ఇది 21వ శతాబ్దపు కొత్త ఎత్తు ('నాషా'). యువత దృష్టి మరల్చకుండా ఉండేలా, విద్య, ఆరోగ్యం, ఉపాధికి సంబంధించిన సమస్యల పట్ల తన ప్రభుత్వాన్ని జవాబుదారీగా కాకుండా ఉండేలా చూసుకుంటున్నారని ఆరోపించారు. మోదీ, హోంమంత్రి అమిత్ షా బిహార్‌లో 'ఓటు చోరీ' (ఓటు దొంగతనం)లో పాల్గొంటున్నారని, ఎందుకంటే ఎన్‌డిఎ అసెంబ్లీ ఎన్నికల్లో గెలవదని వారికి తెలుసునని రాహుల్ పేర్కొన్నారు. ఆర్‌జెడితో పొత్తు పెట్టుకుని, తమ పార్టీ అధికారంలోకి వస్తే జంగల్ రాజ్‌ను తిరిగి తీసుకువస్తుందని బిజెపి, ఇతర ఎన్‌డిఎ నాయకులు పదే పదే చేస్తున్న వాదనలను కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు తిప్పికొట్టారు. ఓట్ల దొంగతనానికి వీలు కల్పించే మోదీ, జంగల్ రాజ్ గురించి మాట్లాడడం హాస్యాస్పదమన్నారు.

ఓట్ల దొంగతనానికి వీలు కల్పించే మోదీ ఢిల్లీలో 'జంగల్ రాజ్'ను తీసుకువచ్చారన్నారు. మహారాష్ట్ర, హర్యానాలో కూడా ఆయన అలాగే చేశారని, ఇప్పుడు బిహార్ లోనూ అదే చేయాలనుకుంటున్నారని ఆరోపించారు. కానీ, బిహార్ ప్రజలు ఆయన కుట్రలను ఓడిస్తారని తనకు కచ్చితంగా తెలుసునన్నారు. బిహార్‌లో అధికారంలోకి వస్తే ఇండియా కూటమి అత్యంత వెనుకబడిన, సామాజికంగా అణగారిన, దళితుల ప్రభుత్వం అవుతుందన్నారు. రాష్ట్రాన్ని తయారీ కేంద్రంగా మారుస్తామని, బట్టలు, మొబైల్ ఫోన్‌లపై 'మేడ్ ఇన్ బిహార్' లేబుల్‌లను నిర్ధారిస్తామని, చైనా కూడా లేచి కూర్చుని గమనించేలా చేస్తామని ఆయన అన్నారు. ప్రతిపక్ష కూటమి అధికారంలోకి వస్తే నలందలో అత్యాధునిక విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయడం ద్వారా బిహార్ ప్రాచీన వైభవాన్ని పునరుజ్జీవింపజేస్తామని రాహుల్‌గాంధీ హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వాన్ని విమర్శిస్తూ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ బిహార్ యువతను కార్మికులుగా మార్చి, వారికి ఉన్న అన్ని ఉపాధి అవకాశాలను నాశనం చేస్తున్నారని ఆరోపించారు. న్యూఢిల్లీలో కూర్చున్న వారి ఆదేశాల మేరకు పనిచేసే నితీష్ కుమార్, నరేంద్ర మోదీ బిహార్ యువతకు నిరుద్యోగాన్ని బహుమతిగా ఇచ్చారని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు ఆరోపించారు. ప్రశ్నాపత్రాల లీకేజీలు కూడా బిహార్‌లో ఒక సాధారణ వ్యవహారం, ఆర్థికంగా ధనవంతులైన విద్యార్థులకు ప్రయోజనం చేకూరుస్తాయన్నారు.

## వరికి రూ.300, గోధుమలకు రూ.400 బోనస్: తేజస్వీ హామీ

**అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తాం**



**పాట్నా :** బిహార్‌లో ఇండియా కూటమి ముఖ్యమంత్రిఅభ్యర్థి, ఆర్‌జెడి నేత తేజస్వీ యాదవ్ రైతులకు వరాలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే కనీస మద్దతు ధర కంటే క్వింటాలు వరికి రూ.300, గోధుమలకు రూ.400 బోనస్‌గా ఇస్తామనిప్రకటించారు. మంగళవారం ఆయన పాట్నాలో విలేకరులతో మాట్లాడుతూ ప్రతిపక్ష కూటమి అధికారాన్ని దక్కించుకుంటే రాష్ట్రంలోని అన్ని ప్రాథమిక వ్యవసాయ రుణ సంఘాలు (పిఎసిఎస్), ప్రాథమిక మార్కెటింగ్ సహకార సంఘాల (వ్యాపర్ మండలాలు) అధిపతులకు కూడా ప్రజాప్రతినిధుల హోదా కల్పిస్తామని వాగ్దానం చేశారు. రాష్ట్రంలో 8,400 కంటే ఎక్కువ పిఎసిఎస్‌లు ఉన్నాయని చెప్పారు. అదే విధంగా రైతులకు నీటిపారుదల ప్రయోజనాల కోసం ఉచిత విద్యుత్ అందిస్తామని, ప్రస్తుత ప్రభుత్వం వ్యవసాయ కార్యకలాపాలలో ఉపయోగించే విద్యుత్ కోసం రైతుల నుండి యూనిట్‌కు 55 పైసలు వసూలు చేస్తుందని తేజస్వీ పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆహార సేకరణకు పిఎసిఎస్‌లు, వ్యాపార్ మండలాలు ఏజెన్సీలుగా పనిచేస్తాయి. వివిధ వ్యవసాయ, వ్యవసాయ కార్యకలాపాల కోసం రైతులకు స్వల్పకాలిక, మధ్యకాలిక వ్యవసాయ రుణాలను అందించే గ్రౌండ్‌లెవల్ కోఆపరేటివ్ క్రెడిట్ సంస్థలు పిఎసిఎస్‌లు. కాగా, తాము ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే, రాష్ట్రంలో నమోదైన 8,400 వ్యాపార్ మండలాలు, పిఎసిఎస్‌ల నిర్వాహకులకు గౌరవ వేతనం ఇవ్వాలని కూడా యోచిస్తున్నామని తేజస్వీ చెప్పారు. ''మై–బహెన్' పథకం కింద ప్రతి నెలా మహిళల బ్యాంకు ఖాతాల్లోకి ఒక్కొక్కరికి రూ. 2,500 జమ చేస్తామని తాము ఇప్పటికే హామీ ఇచ్చామని, ఇప్పుడు వచ్చే ఏడాది జనవరి 14న 'మక్కర్ సంక్రాంతి' సందర్భంగా 'మై–బహెన్ పథకం' కింద రాష్ట్రంలోని అన్ని మహిళల ఖాతాలకు రూ. 30,000 ముందుగానే (మొత్తం సంవత్సరం) జమ చేయాలని నిర్ణయించామని ఆర్‌జెడి నేత చెప్పారు.

## గ్యాంగ్‌రేప్ నిందితులపై పోలీస్ కాల్పులు

**ముగ్గురు అరెస్ట్**



**తమిళనాడు:**కోయంబత్తూరు గ్యాం గ్ రేప్ కేసులో నిందితులు అరెస్ట్ అయ్యారు. విమానాశ్రయం సమీపంలో ఆదివారం మహిళా కళాశాల విద్యార్థినిని కిడ్నాప్ చేసి లైంగికంగా దాడి చేసినందుకు ఈ ము గ్గురు వ్యక్తులను మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తెల్లవారుజామున నిందితుల జాడ కనిపెట్టిన పోలీసులు.. వారిని పట్టుకునేందుకు వెళ్లారు. పోలీసులు వస్తున్నట్లు తెలుసుకున్న నిందితులు తప్పించుకునేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో పారిపోతున్న నిం దితుల కాళ్ల మీద పోలీసులు కాల్పులు జరపాల్సి వచ్చింది. అనంతరం తవాసి, కార్తీక్, కాళీశ్వరన్‌లను అదుపులోకి తీసుకుని, అనంతరం చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కాగా, కోయంబత్తూరులోని ఒక ప్రైవేట్ కళాశాలలో చదువుతున్న బాధిత విద్యార్థిని ఎయిర్ పోర్ట్ ప్రాంతంలో తన బాయ్ ఫ్రెండతో కలిసి కారులో కూర్చుని ఉంది. అది చూసిన ముగ్గురు నిందితులు వారితో ఘర్షణకు దిగారు. బాధితురాలి స్నేహితుడ్ని తీవ్రంగా కొట్టి.. అనంతరం ఆమెను కిడ్నాప్ చేసి బలవంతంగా వేరే ప్రదేశానికి తీసుకెళ్లి లైంగికంగా వేధించారు. కొంచెం సేపటికి తేరుకున్న బాధితురాలి బాయ్ ఫ్రెండ్ పోలీసులకు ఫోన్ చేశాడు. పోలీసులు రంగంలోకి దిగి నిందితుల్ని పట్టుకున్నారు. నిందితులను వెతకడానికి ఏడు ప్రత్యేక బృందాలు గాలింపు జరిపి రెండు రోజుల్లో వారిని కటకటాలవెనక్కి నెట్టాయి.


## బిహార్‌లో కేంద్రమంత్రిపై ఎఫ్ఐఆర్

**ప్రతిపక్షనేతలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసినట్లు కేసు నమోదు**



**పాట్నా :** కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ 'లలన్'పై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పాట్నా జిల్లా యంత్రాంగం తెలిపింది. బిహార్‌లోని మొకామాలో అరెస్టయిన జెడి(యు) అభ్యర్థి అనంత్ సింగ్ తరపున ప్రచారం చేస్తున్న సమయంలో ప్రతిపక్ష నాయకులపై వివాదాస్పద ప్రకటన చేసినందుకు అధికారులు ఆయనపై చర్యలకు ఉపక్రమించారు. పోలింగ్ రోజున ప్రత్యర్థులను బెదిరించమని ఎన్‌డిఎ మద్దతుదారులను మంత్రి కోరుతున్నట్లు ఓ వీడియో బయటకు రావడంతో మంత్రి కొత్త వివాదంలో చిక్కుకున్నారు. వీడియో ఫుటేజ్‌ను పాట్నా జిల్లా యంత్రాంగం పరిశీలించిందని, దర్యాప్తు తర్వాత, బిఎన్‌ఎస్ఎస్, ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ల కింద లాలన్ సింగ్ అలియాస్ రాజీవ్ రంజన్ సింగ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పాట్నా జిల్లా అధికారులు ఎక్స్‌లో పోస్టు చేశారు. 'పోలింగ్ రోజున బయటకు వెళ్లడానికి మీరు అనుమతించకూడని కొంతమంది వ్యక్తులు ఉన్నారు. వారిని ఇళ్లలోనే బంధించండి. వారు మిమ్మల్ని బెదిరిస్తే, వారితో పాటు పోలింగ్ బూత్‌లకు వెళ్లి ఓటు వేసిన తర్వాత ఇంటికి వెళ్లేలా చూసుకోండి' అని లాలన్ పేర్కొనట్లు వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. మోకామా సీటును మరోసారి దక్కించుకోవాలని ప్రయత్నిస్తున్న వివాదాస్పద హిహార్ మాజీ ఎమ్మెల్యే అనంత్ సింగ్, అతని ఇద్దరు సహచరులు మణికాంత్ ఠాకూర్, రంజీత్ రామ్‌లను జన్ సూరాజ్ పార్టీ మద్దతుదారు దులార్ చంద్ యాదవ్ హత్య కేసులో శనివారం అర్ధరాత్రి అరెస్టు చేశారు. గత వారం మోకామా ప్రాంతంలో జన్ సూరాజ్ పార్టీ అభ్యర్థి పియూష్ ప్రియదర్శి తరపున ప్రచారం చేస్తున్నప్పుడు యాదవ్ మృతి చెందాడు. మోకామాలో జరిగిన ఒక సభలో లాలన్ సింగ్ మాట్లాడుతూ 'అనంత్ సింగ్ అరెస్టు తర్వాత, ప్రతి ఒక్కరూ అనంత్ సింగ్‌గానే ఎన్నికల్లో పోటీ చేయాలి. అనంత్ బాబు బయట ఉన్నప్పుడు, నా బాధ్యత తగ్గిందని, కానీ ఇప్పుడు అతను జైలులో ఉన్నందున, బాధ్యత మరింత పెరిగిందని అన్నారు.

## కర్నాటక, ఆంధ్రప్రదేశ్‌లలో భూ ప్రకంపనలు



**విజయపురి/అమరావతి:** కర్నాటక,ఆంధ్రప్రదేశ్‌లలో మంగళవారం స్వల్పంగా భూమి కంపించింది. కర్నాటకలో 2.9గా, ఎపిలో 3.7గా తీవ్రత నమోదైంది. మంగళవారం ఉదయం కర్నాటకలోని విజయపుర జిల్లాలో ఉదయం 7.49 గంటలకు తేలికపాటి భూకంపం వచ్చినట్లు రాష్ట్ర ప్రకృతి వైపరీత్య పర్యవేక్షణ కేంద్రం (కెఎస్‌ఎన్‌డిఎంసి) తెలిపింది. స్వల్పంగా ప్రకంపనలు రావడంతో ఎటువంటి నష్టం జరగలేదని అధికారులు తెలిపారు. విజయపుర తాలూకాలోని భుట్నాల్ తండాకు వాయువ్యంగా 3.6 కిలోమీటర్ల దూరంలో 16.91 డిగ్రీల ఉత్తర అక్షాంశం, 75.75 డిగ్రీల తూర్పు రేఖాంశం, ఐదు కిలోమీటర్ల లోతులో భూకంపం నెలకొని ఉన్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. విజయపుర జిల్లాలోని కెఎస్‌ఎన్‌డిఎంసి నెట్‌వర్క్ ద్వారా 2.9 తీవ్రతతో భూకంప కేంద్రం నమోదైందన్నారు. అదే విధంగా ఎపిలోని అల్లూరి సీతారామరాజు జిల్లాలో 3.7 తీవ్రతతో స్వల్ప భూకంపం సంభవించింది. పొరుగున ఉన్న విశాఖపట్నం జిల్లాలో కూడా ప్రకంపనలు వచ్చాయి. అయితే, ఎటువంటి ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం సంభవించలేదని అధికారులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ ప్రకారం ఉదయం 4:19 గంటలకు 10 కి.మీ లోతులో భూకంపం నమోదైందని, భూకంపం కేంద్రం 18.02 ఒఎన్ అక్షాంశం, 82.58 ఒఇ రేఖాంశం వద్ద ఉందని తెలిపారు. భూకంపం స్వల్పకాలికమని, ముందు జాగ్రత్త చర్యగా స్థానిక జిల్లా విపత్తు నిర్వహణ బృందాలను అప్రమత్తం చేసినట్లు అధికారి తెలిపారు.

## అమెరికా హైర్ బిల్లుపై కాంగ్రెస్ ఆందోళన




**న్యూఢిల్లీ:** అవుట్ సోర్సింగ్ చెల్లింపు చేస్తున్న ఏ అమెరికా వ్యక్తిపైన అయినా 25 శాతం విధించాలని ప్రతిపాదిస్తూ అమెరికా సెనేట్ ఒక బిల్లు(హైర్)ను ప్రవేశపెట్టడం వాస్తవమయితే... అది 'భారత ఆర్థిక వ్యవస్థకు ముప్పు'గా మారుతుందని కాంగ్రెస్ మం గళవారం ఆందోళన వ్యక్తం చేసింది. 'ఇది ఆలస్యమవుతుంది. ఒక విషయం స్పష్టంగా ఉంది. బ్లూకాలర్ ఉద్యోగాలు చైనాకు కోల్పోయినప్పటికీ, వైట్‌కాలర్ ఉద్యోగాలను భారతదేశానికి కోల్పోకూడదనే అమెరికాలో పెరుగుతున్న మనస్తత్వాన్ని ఈ బిల్లు ప్రతిబింబిస్తుంది' అని ప్రతిపక్ష పార్టీ పేర్కొంది. అక్టోబరు 6న ఒహియోకు చెందిన సెనేటర్ బెర్నీ మోరెనో ప్రవేశపెట్టిన హాల్టింగ్ ఇంటర్నేషనల్ రిలోకేషన్ ఆఫ్ ఎం ప్లాయ్‌మెంట్ యాక్ట్ లేదా హైర్ యాక్ట్ బిల్లును ప్రస్తావిస్తూ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్‌వ్యవహారాలఇంఛార్జ్) జైరాం రమేశ్ ఈ వ్యా ఖ్యలు చేశారు. సెనేట్ కమిటీ ఆన్ ఫైనాన్స్‌కు సూ చించినట్లు ఆయన 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ బిల్లు అవుట్‌సోర్సింగ్ చెల్లింపు చేసే ఏ అమెరికా వ్యక్తి పైన అయినా 25 శాతం పన్నును ప్రతిపాదిస్తుంది. దీనిని అమెరికాలోని వినియోగదారులకు ప్రయోజనం చేకూర్చేది. పని చేసే విదేశీ వ్యక్తికి అమెరికా కంపెనీ లేదా పన్ను చెల్లింపుదారు చెల్లించే ఏదైనా డబ్బుగా నిర్వచించారు. ఈ బిల్లు భారతదేశ ఐటీ సేవలు, బీపీవో, కన్సల్టింగ్, జీసీసీల (గ్లోబల్ కె పాబిలిటీ సెంటర్లు) పై ప్ర త్యక్ష, లోతయిన ప్రభావాన్ని చూపుతుందని ఆయన పేర్కొన్నా రు. ఐర్లాండ్, ఇ జ్రాయిల్, ఫిలిప్పీన్స్ వంటి ఇతర దేశాలు కూ డా ప్రభావితమవుతాయి. అయితే గరిష్ట ప్రభా వం గత పావు శతాబ్దం లో గణనీయమైన విజ యం సాధించిన భారతదేశ సేవల ఎగుమతులపై ఉంటుందన్నారు. ప్రస్తుత రూపంలో బిల్లు ఆమోదించబడవచ్చు లేదా ఆమోదించబడకపోవచ్చు, సవరించబడవచ్చని జైరాం రమేశ్ తెలిపారు. భారత్, అమెరికా ఆర్థిక సంబంధం చాలా దెబ్బలు తింటుందని ఒక సంవత్సరం క్రితం ఎవరూ ఊహించలేదని, వీటిలో హైర్ బిల్లు మరొక ప్రతిబింబం ఆయన పేర్కొన్నారు. 'ఎప్పుడయినా హైర్ బిల్లు వాస్తవమైతే అది భారత ఆర్థిక వ్యవస్థలో మంటను రేకెత్తిస్తుంది. ఇది అమెరికాకు సంబంధించి కొత్త సాధారణ స్థితిని ఎదుర్కోవలసి ఉంటుంది' అని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. సెనేటర్ బెర్నీ మోరెనో ప్రవేశపెట్టిన ప్రతిపాదిత 'హైర్' చట్టం ఆమోదం పొందితే, అవుట్‌సోర్సింగ్‌ను అరికట్టి, అమెరికన్ కంపెనీలు తమ దేశ వినియోగదారులకు ప్రయోజనం చేకూర్చే సేవల కోసం విదేశీ కార్మికులకు చేసే చెల్లింపులపై 25 శాతం పన్ను విధించడం ద్వారా దేశీయ ఉపాధిని ప్రోత్సహిస్తుంది.

## కారును ఢీకొన్న ట్రక్కు: ఆరుగురు మృతి

బారాబంకి: ఉత్తరప్రదేశ్‌లో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బారాబంకిలోని దేవా ఫతేపూర్ రహదారిపై ట్రక్కు కారును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆరుగురు మతి చెందారు. ఇద్దరికి గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి బారాబంకి సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అర్పిత్ విజయవర్గియ తెలిపిన వివరాల ప్రకారం... ఎనిమిది మందితో వెళుతున్న కారును దేవా పోలీస్ స్టేషన్ ప్రాంతంలో ట్రక్కు బలంగా ఢీకొంది. దీంతో ఎనిమిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో ఆరుగురు మతి చెందారు. మెరుగైన చికిత్స కోసం ఇద్దరిని ఆసుపత్రికి తరలించాము. కారు, ట్రక్కు రెండు వాహనాలు వ్యతిరేక దిశలో వస్తున్నాయి. అందువల్లే ఈ ప్రమాదం జరిగిందని ఆయన అన్నారు.

## ఆన్‌లైన్ గేమింగ్ చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై... సమగ్ర సమాధానం దాఖలుచేయాలని కేంద్రాన్ని కోరిన 'సుప్రీం'

**నవంబరు 26కు విచారణ వాయిదా**



**న్యూఢిల్లీ :** 'ఆన్‌లైన్ మనీ గేమ్స్'ను నిషేధించే, బ్యాంకింగ్ సేవలు, వాటికి సంబంధించిన ప్రకటనలను నిషేధించే ఆన్‌లైన్ గేమింగ్ చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సమగ్ర సమాధానం దాఖలు చేయాలని మంగళవారం సుప్రీంకోర్టు కేంద్రాన్ని కోరింది. పిటిషన్లలో చేసిన మధ్యంతర ప్రార్థనలపై కేంద్రంతన సమాధానం దాఖలు చేసిందనిన్యాయమూర్తులు జస్టిస్ జె.బి.పార్థివాలా, కె.వి. విశ్వనాథన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ముందు సమాచారం అందింది. 'కేంద్ర ప్రభుత్వం తరపున హాజరయ్యే అదనపు సొలిసిటర్ జనరల్ తరపున మేం సమాధానం కోరుకుంటున్నాం' అని ధర్మాసనం చెప్పింది. పిటిషనర్ల తరపున హాజరయ్యే న్యాయవాదికి ముందుగానే సమాధానం కాపీలు అందజేయాలని, ఒకవేళ వారు ఏదైనా రీజాయిండర్ దాఖలు చేయాలని అనుకుంటే వీలైనంత త్వరగా అందజేయాలని తెలియజేసింది. కాగా, దీనికి సంబంధించిన విచారణను ధర్మాసనం నవంబరు 26కు వాయిదా వేసింది. ఆన్‌లైన్ గేమింగ్, ప్రమోషన్ మరియు రెగ్యులేషన్ యాక్ట్ 2025 అనేది రియల్‌మనీ ఆన్‌లైన్ గేమ్‌ను నిషేధించే మొదటి కేంద్ర చట్టం. ఇందులో ఫాంటసీ స్పోర్ట్స్ సహా పందెం కోసం ఆడే ఇస్పోర్ట్స్ ఉన్నాయి. ఢిల్లీ, కర్ణాటక, మధ్యప్రదేశ్ హైకోర్టుల ముందు సవాళ్లను ఎదుర్కొన్నాయి. ఈ కేసులో హాజరైన సీనియర్ న్యాయవాది సి.ఎ.సుందరం మాట్లాడుతూ ఒక నెలకు పైగా వ్యాపారం పూర్తిగా మూతపడిందని ధర్మాసనానికి చెప్పారు. 'నేను (పిటిషనర్) ఒక చెస్ ఆటగాడిని. అది ఉత్సాహానికి మూలం. 'నేను కూడా ఒక యాప్‌ను ప్రారంభించబోతున్నాను' అని న్యాయవాది చెప్పారు. 'భారతదేశం ఒక వింత దేశం. మీరు ఒక ఆటగాడు. మీరు ఆట ఆడాలనుకుంటున్నారు. అది మీకు ఏకైక ఆదాయ మార్గం కాబట్టి, మీరు విచారణలో పాల్గొనాలని కోరుకుంటున్నారు' అని జస్టిస్ పార్థివాలా చెప్పారు. కంపెనీలు నిర్వహించే ఆన్‌లైన్ టోర్నమెంట్లలో పిటిషనర్ పాల్గొంటారని, ఆయన అందులో పాల్గొనేందుకు ఫీజును కూడా చెల్లిస్తున్నారని న్యాయవాది తెలిపారు. పిటిషన్‌ను పెండింగ్‌లో ఉన్న పిటిషన్‌లతో కూడా జతచేయాలని ధర్మాసనం చెప్పింది. ఆన్‌లైన్ గేమింగ్ చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన బదిలీ పిటిషన్ల బ్యాచ్‌ను అత్యున్నత న్యాయస్థానం విచారించింది. సోషల్, ఇస్పోర్ట్స్ గేమ్‌ల ముసుగులో పనిచేస్తున్నాయని ఆరోపించబడిన ఆన్‌లైన్ జూదం, బెట్టింగ్ ప్లాట్‌ఫామ్‌లను నిషేధించాలని ప్రభుత్వానికి సూచించాలని కోరుతూ దాఖలు చేసిన ప్రత్యేక పిటిషన్‌ను నవంబరు 26న విచారించనున్నట్లు ధర్మాసనం తెలిపింది.సెంటర్ ఫర్ అకౌంటబిలిటీ సిస్టమిక్ ఛేంజ్ (సిఎఎస్‌ఇ), శౌర్య తివారీ దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం అత్యున్నత న్యాయస్థానం కేంద్రం స్పందన కోరింది. న్యాయపరంగా గుర్తింపుపొందిన నైపుణ్య ఆధారిత ఆటలపై ఈ చట్టం పూర్తిగా నిషేధం విధిస్తుందని, చట్టబద్ధమైన వాణిజ్యంలో ఏదైనా వృత్తిని అభ్యసించే హక్కును హామీ ఇచ్చే రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 (1) (జి) ని ఉల్లంఘిస్తుందని పిటిషనర్లు వాదిస్తున్నారు. దీనికి సంబంధించి మరొక సంబంధిత పిటిషన్‌లో కర్ణాటక హైకోర్టు ఇటీవలే ఒక నోటీస్ జారీ చేసింది. ప్రమోషన్ మరియు రెగ్యులేషన్ ఆన్‌లైన్ గేమింగ్ యాక్ట్ 2025ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను మూడు హైకోర్టుల నుండి సుప్రీంకోర్టుకు విరుద్ధమైన తీర్పులకు బదిలీ చేయాలనే అభ్యర్థనను సెప్టెంబరు 8న అత్యున్నత న్యాయస్థానం అనుమతించింది. ఢిల్లీ, కర్ణాటక, మధ్యప్రదేశ్ హైకోర్టుల ముందు పెండింగ్‌లో ఉన్న పిటిషన్లను సుప్రీంకోర్టుకు బదిలీ చేసింది. కోర్టుల నుండి మూడు పెండింగ్ కేసులను సుప్రీంకోర్టుకు బదిలీ చేయాలని ఎలక్ట్రానిక్స్ మరియు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఎంఇఐటి వై) పిటిషన్ దాఖలు చేసింది. ఈ చట్టం రాష్ట్రపతి ఆమోదం పొందిన తర్వాత బహుళ చట్టం చెల్లుబాటును సవాల్ చేస్తూ హైకోర్టులలో చట్టం యొక్క ప్రశ్న శిక్షించడిన చర్య యొక్క లక్షణాలను సవాల్ చేస్తూ పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ చట్ట ం రాష్ట్రపతి ఆమోదం పొందిన తర్వాత, ఆ చట్టం చెల్లుబాటును సవాల్ చేస్తూ హైకోర్టులలో బహుళ పిటిషన్లు దాఖలు చేయబడ్డాయని అది పేర్కొంది. ఈ బిల్లును ఆగస్టు 20న లోక్‌సభలో ప్రవేశపెట్టబడింది.

## 'పోక్సో'నిబంధనలపై...మరింత అవగాహన కల్పించాలి

**నొక్కిచెప్పిన 'సుప్రీం'**

**డిసెంబరు 2కు 'పిల్' విచారణ వాయిదా**

**న్యూఢిల్లీ :** వివాహ విభేదాలు, కౌమార దశలో ఉన్న వారిమధ్య ఏకాభిప్రాయ సంబంధాల కేసుల్లో పోక్సో యాక్ట్ (ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ ఆఫెన్సెస్ చట్టం) దుర్వినియోగం అవుతోందని, దాని చట్టపరమైన నిబంధనల గురించి బాలురు మరియు పురుషులలో అవగాహన పెంచుకోవాల్సిన అవసరాన్ని మంగళవారం అత్యున్నత న్యాయస్థానం నొక్కిచెప్పింది. అత్యాచారానికి సంబంధించిన శిక్షా నిబంధనల ప్రజలను చైతన్యవంతం చేయడం, లైంగిక వేధింపుల నుండి పిల్లల రక్షణ (పోక్సో) చట్టం ద్వారా దేశాన్ని బాలికలు, మహిళలకు మెరుగైన ప్రదేశంగా మార్చాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్)ను న్యాయమూర్తులు జస్టిస్ బి.వి.నాగరత్న, ఆర్.మహదేవన్‌లతో కూడిన డివిజన్ బెంచ్ విచారించింది. దీనిపై స్పందించిన ధర్మాసనం 'ఒక విషయం, మేం గమనించాలని అనుకుంటున్నాం. వివాహ విభేదాలు, కౌమారదశలో ఉన్న వారి మధ్య సంబంధాల విషయంలో పోక్సో చట్టం దుర్వినియోగం చేయబడుతోంది. చట్టపరమైన నిబంధనల గురించి పురుషులలో అవగాహన పెంచాలి' అని ధర్మాసనం మౌఖికంగా వ్యాఖ్యానించింది. అత్యున్నత న్యాయస్థానం ఈ ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాన్ని డిసెంబరు 2కు వాయిదా వేసింది. ధర్మాసనం ఈ విషయమై మాట్లాడుతూ కొన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు తమ స్పందనను దాఖలు చేయడం లేదని అసంతృప్తి వ్యక్తం చేసింది. దీనిపై సీనియర్ న్యాయవాది ఆబాద్ హర్షద్ పోండా దాఖలు చేసిన పిటిషన్‌పై ఇంతకుముందు అత్యున్నత న్యాయస్థానం కేంద్రానికి, కేంద్ర విద్య, సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ పిల్మ్ సర్టిఫికేషన్ (సిబిఎఫ్‌సి)లకు నోటీసులు జారీ చేసింది. నిర్భయ కేసు అనంతరం అత్యాచారానికి సంబంధించిన చట్టాలు, వాటిలో వచ్చిన మార్పుల గురించి ప్రజలకు తెలియాల్సిన ఆవశ్యకతను పోండా నొక్కిచెప్పారు.14 సంవత్సరాలకంటే తక్కువ వయసున్న పిల్లలకు ఉచిత నిర్బంధ విద్యను అందించాలని అన్ని విద్యాసంస్థలను అడగాలని మహిళలు, పిల్లలపై జరిగే నేరాలకు సంబంధించిన శిక్షానిబంధనలను వారి విద్యలో చేర్చాలని విద్యా మంత్రికి ఆదేశాలు జారీచేసేలా పలు చర్యలను చేపట్టాలని పిటిషనర్లు ధర్మాసనాన్ని కోరారు. లైంగిక సమానత్వం గురించి అవగాహన కల్పించడంలో భాగంగా నైతిక శిక్షణ అంశాన్ని కూడా చేర్చాలని, లైంగిక సమానత్వం మహిళలు, బాలికల హక్కుల గురించి అవగాహన, గౌరవంగా జీవించే స్వేచ్ఛ అని అది చెబుతోంది.'ముఖ్యంగా ఈ దేశంలో అబ్బాయిల మనస్తత్వాలలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అందుకు పాఠశాల స్థాయి నుంచే తప్పనిసరిగా కసరత్తు చేయాలని అది పేర్కొంది.



ప్రజాపక్షం
బుధవారం, 05 నవంబరు

# మహిళా క్రికెట్‌కు మంచి రోజులు

మహిళల క్రికెట్ ప్రపంచ కప్ ఎట్టకేలకు మన నట్టింటికొచ్చింది. 50 ఏళ్ల ప్రయాణంలో తొలిసారి సొంతగడ్డపై, దేశవ్యాప్తంగా కోట్లాది క్రీడాభిమానుల కేరింతల మధ్య, కిక్కిరిసిన నవీ ముంబయిలోని డివై పాటిల్ స్టేడియం ఆదివారం అర్ధరాత్రి కొత్త కాంతులీనింది. ఎంతో ఉత్కంఠభరితంగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా జట్టును 52 పరుగుల తేడాతో ఓడించి ఈ ఘనతను సాధించిన హర్మన్ ప్రీత్ కౌర్ జట్టుకు జేజేలు. ఫైనల్స్‌కు భారత జట్టు ప్రయాణమే ఒడిదొడుకులతో, ఆశ–నిరాశలతో సాగింది. క్రీడాభిమానులు కూడా అంతే భావోద్వేగాలతో లైవ్ టెలికాస్ట్‌లను వీక్షించారు. ఏమైనా సరే, ఈసారి కప్ గెలవాలన్న పట్టుదల, పోరాటపటిమను జట్టులో కలిసికట్టుగా ఎలా ప్రదర్శితమైందో అభిమానుల్లోనూ అంతే ఉద్విగ్నం. గువహతిలో ప్రారంభమై ఇండోర్, విశాఖపట్నం, కొలంబో మీదుగా నవీ ముంబయికి సాగిన ప్రయాణం– మధ్యలో మ్యాచ్‌ల వర్షార్పణాలు మూడు మ్యాచ్‌ల వరుస ఓటములతో ఎక్కడైనా ఆగిపోయి ఉండవచ్చు. కానీ మన క్రీడామణులు చావో–రేవో అని సంకల్పం పూని ఉంటారు. చివరి రెండు మ్యాచ్‌లు అద్భుతం. బంగ్లాదేశ్‌తో ఆఖరి లీగ్ మ్యాచ్ వర్షం అడ్డుపడినా రన్ రేట్‌తో భారత్ సెమీఫైనల్ బెర్త్ ఖాయం చేసుకుంది. అయితే ఆస్ట్రేలియాతో సెమీఫైనల్ నెగ్గటం కొండను ఢీకొనడమే! ఆస్ట్రేలియా 7సార్లు ఛాంపియన్, 1 టోర్నీ ఫేవరెట్. సమయం రానే వచ్చింది. ఆస్ట్రేలియా 338 పరుగులు చేసింది. మహా కష్టసాధ్యమైన చేజింగ్. జెమీమా, స్మృతి మంధన భాగస్వామ్యం ప్రాణం పోసింది. భారత్ ఆస్ట్రేలియాకు పెద్ద షాక్ ఇచ్చింది. రెండో సెమీఫైనల్‌లో ఇంగ్లాండ్‌ను ఓడించి దక్షిణాఫ్రికా భారత్‌తో పోటీ ఖాయం చేసుకుంది. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ చేజారుతుందేమోనని సంకోశం తలెత్తిన సమయంలో మ్యాచ్‌ను షఫాలీ వర్మ, దీప్తి శర్మ బ్యాట్, బంతి రెండింటితో రాణించి త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించారు. టోర్నీ ప్రారంభంలో 20 లక్షల అభిమానులతో ప్రారంభమైన భారత్ మ్యాచ్‌ల వీక్షణం ఫైనల్‌కు 30 కోట్లు మించింది. అంటే పురుషుల క్రికెట్ మ్యాచ్‌కు ఏమాత్రం తీసిపోని ఆదరణ ఇది. పురుష క్రికెట్ స్టార్లను దేవుళ్ళుగా ఆరాధించే దేశంలో ఇప్పుడు కొందరు మహిళా క్రికెటర్లు కూడా స్టార్ట్ స్టేటస్ పొందారు. ఇది మహిళ క్రికెట్‌కు మహర్దశ. 2005, 2017లలో మిథాలీరాజ్ టీం గట్టిగా పోరాడినా గమ్యం చేరలేకపోయింది.

1983లో 'కపిల్ డెవిల్స్' అనూహ్యంగా వెస్టిండీస్ హ్యాట్రిక్ కలను కల్లలు చేసి తొలి ప్రపంచకప్‌ను సాధించిన తదుపరి పురుషుల క్రికెట్ సంస్థాగతంగా, క్రీడాపరంగా, అభిమానులపరంగా ఎంతో ప్రోత్సాహం పొందింది. ఆర్థికంగా క్రీడాకారులకు ప్రోత్సాహం పెరగడంతో పాటు రెండు దశాబ్దాలుగా ఇండియన్ ప్రీమియర్ లీగ్ అతిపెద్ద వినోద క్రీడగా అభివృద్ధి చెందింది. మహిళా క్రికెట్ నిరాదరణకు లోనై క్రీడాకారిణుల ఆసక్తితోనే బ్రతుకుతూ వచ్చింది. బిసిసిఐ చాలా ఆలస్యంగానైనా మేల్కొని కొద్ది సంవత్సరాల క్రితం మహిళ క్రికెటర్ల పారితోషకాన్ని పురుషులతో సమానంగా పెంచింది. మహిళల ప్రీమియర్ లీగ్ ప్రారంభించింది. పురుషుల పోటీల వలె వయస్సు పరిమితి పోటీలు, రంజీ, దిలీప్ ట్రోఫీ లాంటి పోటీలు ప్రారంభిస్తే మట్టిలో మాణిక్యాలు వెలుగులోకి వస్తారు. ప్రస్తుత వరల్డ్ కప్ టీంలో మన కడప అమ్మాయి శ్రీచరణి స్పిన్ బౌలర్‌గా పరిపక్వత ప్రదర్శించారు. 1983 అనంతరం వలే ఇప్పుడు మహిళ క్రికెట్‌లో ఎన్నో మార్పులు ఆశిస్తున్నామని, బిసిసిఐ కార్యదర్శి దేవజిత్ సైకియా చెప్పడం స్వాగతించదగింది.

అయితే మహిళా క్రికెటర్లు రాణించేందుకు పురుష క్రికెటర్ల అనుభవం, సహకారం అవసరమే. కానీ అన్ని రాష్ట్ర క్రికెట్ కమిటీల్లో విధిగా మహిళ క్రికెటర్లు ఉండడం తప్పనిసరి అవసరం. నిబంధనావళి సవరించి రిజర్వేషన్ పద్ధతినైనా ప్రవేశపెట్టాలి. మహిళల సమస్యలను మహిళా అడ్మినిస్ట్రేటర్లే అర్థం చేసుకోగలుగుతారు. వివిధ స్థాయి టోర్నమెంట్లకు ప్రైజ్‌మనీ కూడా పురుష ఈవెంట్‌లతో సమం చేసినప్పుడే వివక్ష అంతమవుతుంది. బాలికలు కూడా విరివిగా క్రికెట్ క్రీడ వైపు ఆకర్షితులవుతారు. అయితే క్రీడాభిమానులు, స్పాన్సర్లు, అడ్వర్టైజర్లు పురుష క్రీడపైనే డబ్బు కుమ్మరిస్తున్నందున, ధనరాశులతో మూలుగుతున్న బిసిసిఐ తమ ఆదాయంలో కనీసం 20శాతం ఇతర క్రీడలపై విధిగా వెచ్చించేటట్లు ప్రభుత్వం నిబంధనపూర్వకంగా ఏర్పాటు చేస్తే అన్ని రకాల క్రీడల్లో – అంతర్జాతీయంగా త్రివర్ణ పతాకం రెపరెపలాడే అవకాశం కలుగుతుంది.

# వేతనాలు–కనీస వేతనాలు–ఒక పరిశీలన



వి.యస్.బోస్
ఎఐటియుసి రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి
9391356527

భారతదేశంలోని కార్మికులు అనేక పోరాటాలు ద్వారా సాధించుకున్న అనేక చట్టాలలో కనీస వేతనాల చట్టం 1948 ఒకటి. కార్మికునికి ఉత్తమ జీవన ప్రమాణాలు కల్పించదగిన ''ఉపాధి'' ఇవ్వటం రాజ్యాంగం నిర్దేశించింది. కార్మికులకు శ్రమతో పాటు విరామం, వినోదం, సామాజిక జీవనం కల్పించటం కూడా ఈ చట్టం యొక్క ముఖ్య ఉద్దేశం. శ్రమజీవులను సంపన్నులైన పారిశ్రామిక వర్గాలు తమ ఆర్థిక ప్రయోజనాల కొరకు అన్యాయం చేయకుండా నిరోధించటం ఈ చట్టం యొక్క ముఖ్య అంశం. షెడ్యూల్‌లో చేర్చిన పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు నిర్ణయించి అమలు చేయవల్సిన బాధ్యత ప్రభుత్వాలది. షెడ్యూల్ పరిశ్రమలంటే ప్రభుత్వాలు గుర్తించిన పరిశ్రమలు. కానీ కొత్తగా వచ్చిన ఐ.టి, సర్వీస్ రంగంలోని అనేక పరిశ్రమలు షెడ్యూల్ పరిశ్రమలను నేటి వరకు ప్రకటించలేదు. చట్ట ప్రకారం గతంలో ప్రతి 3 సంవత్సరాలకు ఒకసారి తర్వాత కాలంలో ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి కనీస వేతనాలు సవరించి అమలు చేయటం ఆనవాయితీగా ఉన్నది. కానీ నేడు అనేక రాష్ట్రాలలో 15 సంవత్సరాలు దాటిపోయిన కనీస వేతనాలు సవరణ జరగలేదు. దీనితో కనీస వేతనాల రంగంలో పనిచేసే కార్మికులంతా తీవ్ర అన్యాయానికి గురవుతున్నారు. కనీస వేతనాలు అమలు చేసే షెడ్యూల్ పరిశ్రమలలో కొన్నింటిలో డి.ఏ (కరువు భత్యం) అమలు చేయటం మిగిలిన వాటిలో డి.ఏ అమలు చేయకపోవటంతో కార్మికులు వివక్షకు, జీతాల వ్యత్యాసాలకు గురవుతున్నారు. అంటే డి.ఏ అమల్లోలేని పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులు గత 15 సంవత్సరాల నుంచి ఒకేరకమైన జీతాలు పొందుతున్నారన్నది వాస్తవిక సత్యం. ఈ 15 సంవత్సరాలలో మార్కెట్‌లో పెరిగిన ధరలకు కార్మికులు పొందుతున్న జీతాలకు ఎలాంటి పొందిక లేక కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారు.

అనేక సంస్థలలో, పరిశ్రమలలో కార్మికులను కాంట్రాక్ట్ విధానంలో, ఔట్‌సోర్సింగ్ విధానంలో, తదితర విధానాలతో పనిలోకి తీసుకుంటున్నారు. వీరు పొందే జీతాలకు ఒక విధానం లేకుండా యాజమాన్యాల లేక దళారుల (కాంట్రాక్టర్లు) దయా దాక్షిణ్యాలపై వీరి ఉపాధి, జీతాలు ఆధారపడటం శోచనీయమైన పరిస్థితి. ఇలాంటి పరిస్థితిని నియంత్రించి న్యాయం చేసే వ్యవస్థ లేదు. వీరందరు సమక్యమై యూనియన్ పెట్టుకునే హక్కును కార్మిక చట్టాల మార్పు ద్వారా ప్రస్తుతం కేంద్రంలోని మోదీ ప్రభుత్వం హరించి వేయటం జరిగింది. కాంట్రాక్ట్ కార్మికులు, ఏజెన్సీ కార్మికులు, డైలీ వేజ్ కార్మికులు అనే వివిధ రకాల పేర్లతో వారిని సంఘటితం కాకుండా చేయటమే పారిశ్రామికవేత్తల ఉద్దేశం. పారిశ్రామిక వేత్తల ఉద్దేశానికి ప్రభుత్వం వంతపాడుతూ చట్టాలను వారికి అనుకూలంగా మార్చటం నేటి పరిస్థితి.

దేశంలోని ఒకే ప్రాంతంలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులు పొందే వేతనంలో రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం చెల్లించే వేతనంలో వ్యత్యాసం ఉండటం న్యాయసమ్మతం కాదు. ఈ విధానం దేశంలోని అన్యాయమైన పరిస్థితులకు అద్దం పడుతుంది. ఈ పరిస్థితులు చూస్తే ఒకే దేశం ఒకే విధానం అని పదే పదే వల్లించే మోదీ ప్రభుత్వానికి నీతి లేదనేది అర్థమవుతుంది. మన రాజ్యాంగంలో నిర్వచించినట్లు మన సమాజాన్ని సంక్షేమ రాజ్యంగా నడిపించాలి. కానీ దానికి విరుద్ధంగా కార్పొరేట్ వర్గాలకు ఊడిగం చేయటం మోదీ ప్రభుత్వం కార్యక్రమంగా ఉన్నది.



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేరు వేరుగా తమ ఉద్యోగుల వేతనాలు సవరించటానికి వేతన కమిషన్లు ఏర్పాటు చేస్తున్నాయి. వారి సిఫారసుల ఆధారంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారి ఉద్యోగుల జీతభత్యాలను సవరించి అమలు చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వేతన కమీషన్ల సిఫార్సులను పరిశీలిస్తే ఇద్దరి సిఫార్సుల్లో వ్యత్యాసం ఉన్నట్లు అర్థమవుతుంది. ఒకే ప్రాంతంలో నివసించే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల జీవనవ్యయం ఆ ప్రాంత ధరలు, ఇతర అంశాలు ఒకేరకంగా ఉంటాయన్నది అందరికి తెలిసిన విషయమే. అలాంటప్పుడు ఒకే కమిషన్ అది కూడా కేంద్ర వేతన కమీషన్ సిఫార్సులను తీసుకొని దేశమంతా అమలు చేయటమే సరైన విధానం. ఇదే క్రమంలో సంస్థలలో, పరిశ్రమలలో పనిచేసే కార్మికులకు/ఉద్యోగస్తులకు కేంద్ర వేతన కమిషన్ సిఫార్సు చేసిన వేతనాలనే అమలు చేస్తే సరిపోతుంది. ఇదే సూత్రాన్ని కాంట్రాక్ట్, ఇతర కార్మికులకు కూడా వర్తింపచేయాలి. దీని మూలంగా అనేక కమిషన్లు, కాలయాపన, వ్యత్యాసాలు, అన్యాయాలను తొలగించటానికి అవకాశం ఏర్పడుతుంది.

కేంద్ర ప్రభుత్వం వివిధ రాష్ట్రాల నుండి ఎన్నికైన ఎంపీలకు, రాజ్యసభ సభ్యులకు, ఇతరులకు ఒకేరకమైన జీతాలు చెల్లిస్తున్నప్పుడు ఒకే కమిషన్ సిఫార్సులను కేంద్ర/రాష్ట్ర ఉద్యోగస్తులకు అమలు చేయటంలో భిన్నాభిప్రాయం ఉండవల్సిన అవసరం లేదు. ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా నాయకులకు ఎలాంటి వేతన కమిషన్ లేకుండా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల స్థితిగతులను పరిగణలోకి తీసుకోకుండా వారి జీతాలను వారే పెంచుకోవటం ప్రజాస్వామ్యం విరుద్ధమైన చర్యే గదా?

కార్మికులకు/ఉద్యోగస్తులకు జీతాలు పెంచమని అడిగితే మీనమేషాలు లెక్కపెడుతూ కాలయాపన కొరకు కమీషన్లు ఏర్పాటు చేసే ప్రభుత్వాలు, కార్పొరేట్ సంస్థలకు ట్యాక్సులు తగ్గించాలన్న, బ్యాంక్ రుణాలు మాఫీ చేయాలన్నా ఆగమేఘాల మీద నిర్ణయాలు చేయటం మూలంగా మన ప్రభుత్వాలు కార్పొరేట్ ప్రభుత్వాలుగా గుర్తింపు పొందుతున్నాయి. వేతనాల పెంపులో సమాజానికి జరిగే లాభాన్ని ప్రభుత్వాలు గుర్తించకపోవటం లేక గుర్తించినా కావాలని మరుగునపర్చటం నేటి రాజకీయ నాటకంలో భాగంగా ఉన్నది. కార్పొరేట్/పారిశ్రామికవేత్తల ఆదాయం పెరిగితే అది సమాజంలో నల్లధనం సృష్టికి మార్గంగా ఉంటుంది. అదే కార్మికులు/ఉద్యోగస్తుల జీతాలు పెరిగితే మార్కెట్‌లో కొనుగోలు శక్తి పెరిగి మార్కెట్ వ్యవస్థ గట్టిపడుతుంది. వీరు నల్లధనాన్ని సృష్టించే అవకాశం లేకపోగా కొత్త మార్కెట్లను సృష్టిస్తారు. అదీకాక తమ ఇళ్ళను తామే నిర్మించుకొని, తమ పిల్లలను తామే చదువించుకొని ప్రభుత్వాలపై ఉన్న సామాజిక భాధ్యతను కొంతవరకు వారు కూడా పంచుకుంటారు. ప్రతిసారి నల్లధనానికి వ్యతిరేకంగా ప్రగల్భాలు పలికే మోదీ ప్రభుత్వం నల్లధనం సృష్టికర్తలకు సహాయపడటం ఎలాంటి నీతి అనేది మనం అర్థం చేసుకోవాలి. ఒకేదేశం ఒకే విధానం అని నినదించే మోదీకి నిజాయితీ ఉంటే దేశంలోని ఉద్యోగస్తులకు/కార్మికులకు ఒకే వేతనం అమలు చేస్తేనే ఆ నినాదంలో వాస్తవం ఉంటుంది. లేకపోతే ఆ నినాదం మోసపూరితమవుతుంది.

ఒకేరకమైన పరిశ్రమలో పనిచేస్తున్న ప్రభుత్వరంగ కార్మికులకు, ప్రైవేటురంగ కార్మికులకు ఒకేరకమైన వేతనం చెల్లించకపోవటం సరైన విధానం కాదు. అంటే ఉదా॥ డిఫెన్స్ రంగ పరిశ్రమలో పనిచేస్తున్న ప్రైవేటురంగ కార్మికులకు అదే రకమైన డిఫెన్స్ పరిశ్రమలో పనిచేస్తున్న ప్రభుత్వ రంగ కార్మికులకన్నా అతి తక్కువ వేతనం చెల్లించటం దుర్మార్గం. దీని మూలంగా తక్కువ ధరలతో ఉత్పత్తులు చేసి ప్రభుత్వరంగ సంస్థలకు సవాలుగా నిలబడి ఆ సంస్థలు ఖాయిలాపడటానికి కారణం అవుతున్నాయి. ప్రభుత్వరంగ సంస్థగానీ ప్రైవేటు రంగ సంస్థగానీ ఆర్డర్లు పొందేది ప్రభుత్వాల నుండే వాటి కోసం డబ్బులు చెల్లించేది ప్రభుత్వాలే. వాటిని ఉపయోగించేది కూడా ప్రభుత్వాలే అయినప్పుడు ప్రైవేటు, ప్రభుత్వరంగ కార్మికులు, వేతనాల్లో వ్యత్యాసాలను ప్రభుత్వం ఎందుకు తొలగించటం లేదు. అలాంటి వ్యత్యాసాలను తొలగించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది.

కేంద్ర ప్రభుత్వంపై కార్పొరేట్ శక్తుల ప్రభావం లేనప్పుడు వారి జీతాలపై నియంత్రణ చేస్తూ చట్టాలు ఉండేవి. క్రమంగా కార్పొరేట్ శక్తుల ప్రభావం ప్రభుత్వాలపై పెరిగటంతో వారికి అనుకూలంగా చట్టాలు మార్చటంతో వారి జీతాలపై నియంత్రణ తొలగి కోట్లలో జీతాలు పొందటం జరుగుతుంది. దేశంలోని ప్రథమ పౌరుడైన అధ్యక్షుల వారికన్న ఈ కార్పొరేట్ అధికారులు జీతాలు అనేకరేట్లు ఎక్కువ పొందటంతో మన దేశంలో అధ్యక్షులకు ఇస్తున్న గౌరవ స్థానం ఏమిటో ప్రభుత్వానికే తెలియాలి. అలాగే ఒకప్పుడు మంత్రుల జీతాలు కూడా ఐఎఎస్/ఐపిఎస్ ఆఫీసర్లకన్నా తక్కువ ఉండేది. మంత్రులు ఈ పరిస్థితిని అవమానంగా భావించి వారి జీతాలను ఐఎఎస్ ఆఫీసర్ల కన్నా ఎక్కువగా తమంత తామే పెంచుకున్నారు. ఇది మనదేశంలోని ప్రజాస్వామ్యం. ఎంపిలు, ఎమ్మెల్యేలుగా ఎన్నిక కావటానికి ఎలాంటి విద్యార్హతలు లేవు. కానీ ఐఎఎస్/ఐపిఎస్ లాంటి ఉద్యోగాలు పొందాలంటే అత్యుత్తమైన విద్యార్హతలు అవసరం. అయినా మంత్రుల జీతాలు ఎక్కువగా తీసుకోవటానికే మొగ్గుచూపారు. అదే విధంగా ప్రజా ప్రతినిధులు ప్రమాణం చేసిన తర్వాత ఒక్కరోజు ఆ పదవిలో ఉన్నా జీవితకాలం వారి జీతంలో సగం పెన్షన్‌గా పొందుతున్నారు. ఇలాంటి సౌకర్యం మన దేశంలో ఉద్యోగస్తులకు గానీ, కార్మికులకు గానీ లేకపోవటం రాజకీయ నాయకుల స్వార్థాన్ని బహిర్గతం చేస్తున్నది.

ఒకేరకమైన పనికి ఒకేరకమైన జీతాలు చెల్లించాలని మన దేశంలోని అత్యున్నత న్యాయస్థానాలు పదేపదే చెపుతున్నప్పటికీ ప్రభుత్వాలు పట్టించుకోవటం లేదు. 1970 కాంట్రాక్ట్ చట్టంలో, న్యాయస్థానాల తీర్పులో సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని చెప్పినప్పటికీ అమలు చేయకపోవటం కార్మికులపై ప్రభుత్వం చూపుతున్న సవతి తల్లి ప్రేమ అర్థమవుతుంది. మన దేశంలో నడుస్తున్నది ప్రజాస్వామ్య ప్రభుత్వమా! లేక కార్పొరేట్ స్వామ్య ప్రభుత్వమా! శ్రమజీవులు అర్థం చేసుకోవాలి. కార్మికుల అనుకూలమైనటువంటి తీర్పులను చట్టాలను అమలు చేయకుండా, కార్పొరేట్ / పారిశ్రామిక వేత్తలు కోరుకున్న విధంగా కార్మిక చట్టాలను, విధానాలను మార్చి అమలు చేస్తున్న ప్రభుత్వాలను అర్థం చేసుకోవటానికి ఎలాంటి పరిశోధనలు అవసరం లేదు. ప్రజాస్వామ్య హక్కులను హరించటం నియంతృత్వానికి తొలిమెట్టు. అలాంటి నియంతృత్వాన్ని ఆదిలోనే తొలగించటం సమాజానికి శ్రేయస్కరం. నియంతృత్వాన్ని తొలగించాల్సిన అవసరాన్ని శ్రమజీవులు అర్థం చేసుకొని సమైఖ్యంగా పోరాడాలని విజ్ఞప్తి చేస్తున్నాము.

# 'ధన్ ధాన్య కృషి యోజన'తో వికసిత్ భారత్ సాధ్యమా?



వ్యవసాయం దాని అనుబంధ రంగాల్లో దేశంలో వెనుకబడిన 100 జిల్లాల్లో పంటల ఉత్పత్తిని పెంచడం, పంటల వైవిధ్యాన్ని ప్రోత్సాహించడం, సాగునీరు సదుపాయం, పంటల నిల్వ సామర్థ్యం మెరుగుపరచడం, రైతులకు రుణాలు ఇవ్వడం ప్రధాన లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన (పిఎండిడికెవై), తృణధాన్యాల మిషన్‌కి శ్రీకారం చుట్టింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అక్టోబర్ 11 భారత వ్యవసాయ పరిశోధనా సంస్థ (ఐఏఆర్‌ఐ) పూస క్యాంపస్‌లో ప్రారంభించారు. అన్నదాతలకు అభయం అంటూ దిగుమతులు తగ్గించుకోవాలి. ఎగుమతులు పెంచుకోవాలి అంటూ వికసిత్ భారత సాధనలో రైతన్నలదే కీలక పాత్ర, ప్రజలకు ప్రోటీన్ భద్రత కోసం తృణ ధాన్యాల సాగు పెంచాలి అని ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునిచ్చారు. 35440 కోట్ల రూపాయలు 100 జిల్లాల్లో ఖర్చు చేస్తామని కోట్లాదిమంది రైతులకు లబ్ది చేకూరుతుందని వారి జీవితాల్లో మార్పులు వస్తాయని 2014 నుంచి తన నాయకత్వంలో ఉన్న కేంద్ర ప్రభుత్వం విత్తనం నుంచి మార్కెట్ వరకు అనేక సంస్కరణలు తెచ్చింది అని అన్నారు.

ఈ సంస్కరణలు రైతులకు ఏ మేరకు లబ్ది చేకూర్చాయి అనేది ప్రశ్న. ఈ రెండు పథకాలను రాబోయే రబీ సీజన్ నుంచి 2030–31 దాకా ఆరు సంవత్సరాలు అమలు చేస్తారు. ధన్ ధాన్య కృషి యోజన (పిఎండిడికెవై) కేంద్ర బడ్జెట్ లోనే ప్రస్తావించినా కార్యరూపంలోకి ఇప్పుడు తెచ్చారు. ఇది కొత్త సీసాలో పాత సారా పోసి ఊరించేది లా ఉంది, కేంద్రంలోని 11 మంత్రిత్వ శాఖ పరిధిలోని 36 పథకాలను సమ్మిళితం చేసి పీఎండీడీకేవైని అమలు చేస్తున్నారు. ప్రధాన మంత్రి కృషి సించాయా యోజన (pmksy), రాష్ట్రీయ కృషి వికాస్ యోజన రాఫ్తార్ (rkvy), సాయిల్ హెల్త్ కార్డ్ పథకం 2015, జాతీయ సుస్థిర వ్యవసాయ మిషన్ ప్రధానమంత్రి కిసాన్ మాన్ ధన్ యోజన (pmkmy) లాంటి వివిధ పథకాల కోసం కేంద్ర ప్రభుత్వం ఖర్చు చేసే నిధులు సమ్మిళితం చేసి పిఎండిడికెవై క్రింద 100 జిల్లాల్లో వినియోగిస్తారు. తెలంగాణ రాష్ట్రంలో నాగర్ కర్నూల్, నారాయణపేట, జోగులాంబ గద్వాల, జనగాం నాలుగు జిల్లాలకి చోటు కల్పించారు. ఈ జిల్లాల్లో 8.75లక్షల మంది రైతులు, 17.73 లక్షల ఎకరాల సాగు భూములు ఉన్నాయి.

కేంద్ర పథకాలతోపాటు రాష్ట్ర ప్రభుత్వం పథకాలను అనుసంధానం చేసి ప్రైవెట్ రంగాల భాగస్వామ్యంలో నిర్వహిస్తారు. పిఎండిడికెవై పర్యవేక్షణకు కేంద్రం ఎంపిక చేసిన జిల్లాలకు ఐఏఎస్ ఆఫీసర్లను నోడల్ అధికారులుగా నియమించింది. జిల్లా, రాష్ట్ర, కేంద్రస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేస్తారు. జిల్లా స్థాయిలో కలెక్టర్, రాష్ట్ర స్థాయిలో ముఖ్యకార్యదర్శి పథకం అమలు పర్యవేక్షిస్తారు.

నేల నీటి సంరక్షణ సహజ సేంద్రియ సాగు విస్తీర్ణతో పాటు మొత్తంగా వ్యవసాయం దాని అనుబంధ రంగాల్లో స్వయం సమృద్ధికి తగిన చర్యలు చేపడుతారు, పండ్ల తోటలు, మత్స్య సం పద, తేనెటీగల పెంపకం, పశుపోషణంతో పాటు వాటి మార్కెట్‌పై దృష్టి సాధించటం పథకం ఉద్దేశం. వీటితోపాటు సాగుకు మౌలిక వసతులు, తక్కువ ఉత్పాదకత, నీటి కొరత విచ్ఛిన్నమైన భూమి కమతాలు, పంట కోత తర్వాత నష్టాలు మరియు మార్కెట్ అసమర్థతలు, కౌలు రైతులు వంటి నిర్మాణాత్మక సవాళ్లను పరిష్కరించటంపై ప్రభుత్వం దృష్టి సారించాలి. అలాకాకుండా ప్రైవేటు సెక్టార్ వందల కోట్ల రూపాయల సబ్సిడీ పొంది వ్యవసాయ ఉత్పత్తుల నిల్వలపై ఆధిపత్యం సాధించి లాభాలు పొందుతున్నారు. దేశీయ అవసరాలు, ఎగుమతుల అవకాశాలు అనుగుణంగా పంటల ప్రణాళికలను శాస్త్రీయంగా రూపొందించాలి. రైతులను ఆదిశగా నడిపించే వ్యవస్థ లేకుండా చేటు చేస్తుంది. 2023–24లో దేశవ్యాప్తంగా 3323 లక్షల టన్నుల ఆహార ధాన్యాలు ఉత్పత్తి అయితే నూనె గింజల దిగుబడులు 397 లక్షల టన్నులు, ఇక అపరాలైతే 242.46 లక్షల టన్నులకి పరిమితం. ఈ నేపథ్యంలో దేశీ అవసరాల కోసం 2024–25లో రూ.48 వేలకోట్ల విలువైన 73 లక్షల టన్నుల పప్పు ధాన్యాలను భారత్ విదేశాల నుంచి దిగుమతి చేసుకుంది. అంతకు ముందు ఏడాదితో పోలిస్తే దిగుమతులు 54% అధికమయ్యాయి. తెలంగాణ రాష్ట్రంలో పప్పు ధాన్యాల సాగు గత సంవత్సరం 8,25,237 ఎకరాలు ఈ సీజన్‌లో 5,83,736 ఎకరాలు గతం కంటే 27.5 శాతం తక్కువ. దేశవ్యాప్తంగా ఇదే పరిస్థితి. తెగుళ్ళు వైరస్‌లు సాగు కష్టాలు, ధరలు తగ్గుదల, నిల్వ వసతులు లేకపోవడం, మద్దతు ధరలు పొందలేకపోవటం, కోతులు సమస్య, పంట కోత సమయంలో వర్షాలు మూలంగా కంది, పెసలు, మినుములు, ఉలవలు, అలసందలు లాంటి పంటల సాగు తగ్గింది. 2030 నాటికి దేశంలో 35 లక్షల హెక్టార్లలో తృణధాన్యాలు సాగు లక్ష్యంతో తృణధాన్యాలు మిషన్ ప్రకటించారు. ఈ లక్ష్యం చేరాలంటే మద్దతు ధరలను రైతు పొందే లాగా ప్రభుత్వం భాధ్యత వహించాలి. ఉదాహరణకు: కందికి క్వింటాల్‌కు రూ.8000, పెసలు క్వింటాల్‌కు రూ.8768, మినుములు క్వింటాల్‌కు రూ. 7400 మద్దతు ధరలను కేంద్రం ప్రకటించిన దాదాపు 80 శాతం మందికి దక్కడం లేదు. కొన్ని సందర్భాల్లో మద్దతు ధరలో సగం ధర కూడా రైతులు పొందలేకపోతున్నారు. వరి, గోధుమ, పత్తి సాగు విస్తీర్ణం పెరిగిన వాతావరణ మార్పులు, బీటీ విత్తనాలు మూలంగా ఉత్పాదకత గణనీయంగా తగ్గుతుంది. ప్రపంచ సగటు ఎకరాకు 360 కిలోలతో పోలిస్తే ఇండియాలో అపరాల ఉత్పాదకత ఎకరాకు 264 కిలోలు హెక్టర్‌కు 600 కిలోలు దీనిని 1130 కిలోలు ఉత్పాదక సామర్థ్యం పెంపుదలకు తృణధాన్యాలు మిషన్ లక్ష్యం. అన్ని పంటల్లో దాదాపు ఇదే పరిస్థితి. దేశంలో పత్తి సాగు విస్తీర్ణం పెరిగిన ఉత్పత్తి 390 మిలియన్ బేల్ (బేల్ అంటే 175కిలోలు) నుంచి 290 మిలియన్ బేల్‌కు తగ్గింది. అమెరికా నుంచి 40 లక్షల బేల్ పత్తి దిగుమతి సుంకం లేకుండా చేస్తుంది. అమెరికా తర్వాత అత్యధికంగా 40 కోట్ల ఎకరాల సాగు యోగ్య భూములకు నెలవు భారతావని. మనతో పోలిస్తే తక్కువ విస్తీర్ణంలో పంట నేలలు ఉన్న చైనా తన ఆహార అవసరాల్లో 95 శాతాన్ని సొంతంగానే తీర్చుకుంటుంది. దీనికి భిన్నంగా వంట నూనెలు, పప్పుధాన్యాల దిగుమతులు కోసమే ఇండియా నిరుడు రెండు లక్షల కోట్ల రూపాయలకుపైగా వెచ్చించింది. అంతర్జాతీయ మార్కెట్లు తలుపులు తట్టాలని విదేశాల్లోని డిమాండ్‌ను తీర్చే పంటలు పండిస్తే మనకు లాభదాయకమని ప్రధానమంత్రి పేర్కొన్నారు. దేశీ అవసరాలను ప్రథమ ప్రాధాన్యత ఇవ్వకుండా లాభాల పేరుతో అంతర్జాతీయ మార్కెట్ ఎండమావులు వెంట రైతులు పరిగెడితే ఆహార భద్రత సమస్యలతోపాటు ఆత్మహత్యలు పెరుగుతాయి. వ్యవసాయం మరియు అనుబంధ రంగాలు భారతదేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్నాయి. ఇవి దేశ జనాభాలో 52 శాతం మందికి జీవనోపాధికి ప్రాథమిక వనరుగా పనిచేస్తున్నాయి. మరియు అధిక జిడిపికి దోహదం చేస్తున్నాయి. ఆహార భద్రతను అందించడంలో ఉపాధి కల్పించడంలో మరియు గ్రామీణ అభివృద్ధిని పెంపొందించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. ముఖ్యంగా భారతదేశ వ్యవసాయ సమాజంలో ఎక్కువమంది ఉన్న చిన్న సేద్య రంగంలో, సన్నకారు రైతులలో ఈ రంగం యొక్క వ్యూహాత్మక ప్రాముఖ్యతను గుర్తించి భారత ప్రభుత్వం వ్యవసాయ పద్ధతులను ఆధునికరించటం ఉత్పాదన మెరుగుపరచడం స్థిరత్వాన్ని నిర్ధారించటం, రైతు ఆదాయాన్ని పెంచడం లక్ష్యంగా ప్రణాళికలు అమలు ఉండాలి. వ్యవసాయ రంగంలో క్షీణత వ్యవసాయానికి సంబంధించింది కాదు. ఇది పెద్ద సామాజిక, ఆర్థిక సంక్షోభాన్ని ప్రతిబింబిస్తుంది. ఒకప్పుడు గౌరవానికి, స్వావలంబనకు ప్రతీకగా నిలిచిన రైతు ఇప్పుడు మనగడ కోసం కష్టపడుతున్నాడు. భారతీయ వ్యవసాయాన్ని కార్పొరేట్ ఐజాక్ చేయడం వల్ల వ్యవసాయ సంక్షోభం తలెత్తింది. పెద్ద సంస్థలు వ్యవసాయ వనరులు తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. చిన్న రైతులను శక్తి లేకుండా చేశాయి. ఇది అసమానతలకు దారి తీసింది. ఈ సంక్షోభం కేవలం ఆర్థికపరమైనది కాదు అది మానవజాతికి తీరని నష్టం. రైతు ఆత్మహత్యల సంక్షోభం కాదు అత్యంత దారుణంగా వ్యవస్థల విఫలమైతే ఎదురైన ఫలితం.

సేద్య రంగంలో నిజమైన ఆత్మ నిర్భరత సాధించాలంటే అధిక దిగుబడి నిచ్చే వంగడాలు ,ఆధునిక సేద్య పద్ధతులపై పరిశోధనలకు ప్రభుత్వాలు తగినంత ప్రోత్సాహం అందించాలి. చిన్న, సన్నకారు రైతులకు తక్కువ ధరకు యాంత్రీకరణ అందుబాటులో ఉంచాలి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందించాలి. 100 జిల్లాలతోపాటు దేశంలో ఉన్న 806 జిల్లాల్లో వ్యవసాయ ఉత్పాదకత పెంపుదలకు ప్రణాళికలు అమలు చేయాలి. కేంద్ర ప్రభు త్వం ప్రకటిస్తున్న 22 రకాల వ్యవసాయ ఉత్పత్తులకే కాకుండా అన్ని రకాల పంటలకు మద్దతు ధరలు నిర్ణయం చేయాలి. అది కూడా వాస్తవ సాగు ఖర్చులు మొత్తం పరిగణనలోకి తీసుకొని స్వామినాథన్ కమిషన్ నివేదిక చెప్పినట్లు సమగ్ర ఉత్పత్తి ఖర్చుకి అదనంగా 50% శాతం కలిపి మద్దతు ధరలకు చట్టబద్దత కల్పించినప్పుడు సాగు రంగంలో వికసిత్ భారత్ సాధ్యం.

– బొంతు రాంబాబు
9490098205

# సునామీ విపత్తులు– మానవ భద్రత



సునామీ అనేది సముద్రంలో జరిగే అత్యంత శక్తివంతమైన సహజ విపత్తు. ఇది సాధారణ అలలతో పోలిస్తే వేరు. దీని మూలం సముద్రం కింద జరిగే భూకంపాలు, అగ్నిపర్వత విస్ఫోటాలు. సునామీ అనే పదం జపనీస్ భాషలో త్సు (తీరప్రాంతం), నామి (అల) అనే పదాల కలయిక. ఒక సముద్ర భూ ఖండం మరొక భూ ఖండం కిందకి జారినప్పుడు నీటి నిలువు భాగం కదిలి, సముద్ర జలాన్ని అకస్మాత్తుగా ఎత్తి లేపుతుంది. ఆ కదలికే సునామీకి కారణమవుతుంది. ఈ ప్రక్రియలో విడుదలయ్యే శక్తి అణుబాంబులకు సమానంగా ఉంటుంది. 2004లో ఇండియన్ ఓషన్లో సంభవించిన సునామీ శక్తి యొక్క ఘోర రూపంలో 14 దేశాల్లో 2 లక్షల ప్రాణనష్టం, వేల కోట్ల ఆస్తినష్టం జరిగింది.

## విధ్వంస తీవ్రత

సునామీ అలల తీవ్రత వాటి వేగం, అలల దైర్ఘ్యం , నీటి పరిమాణంపై ఆధారపడి ఉంటుంది. సముద్ర మధ్యలో అలల ఎత్తు కేవలం ఒక మీటర్ వరకు ఉండవచ్చు, కానీ అవి గంటకు 800–900 కి.మీ. వేగంతో ప్రయాణిస్తాయి. నీటి లోతు తగ్గే కొద్దీ అల వేగం తగ్గి, ఎత్తు పెరుగుతుంది. ఈ ప్రక్రియను షోలింగ్ అంటారు. తీరానికి చేరుకునే సమయానికి అలల ఎత్తు 10 నుండి 30 మీటర్ల వరకు పెరిగి విపరీత విధ్వంసం సృష్టిస్తుంది. సునామీ సమయంలో మొదట సముద్రం వెనక్కి లాగబడినట్లు కనిపించడం అత్యంత ప్రమాద సంకేతం. ఈ శాస్త్రీయ సాంకేతికత మనకు చెప్పే ఒక ముఖ్యమైన పాఠం ఏమిటంటే సముద్రం ప్రశాంతంగా ఉన్నప్పటికీ, దాని గర్భంలో విపరీతమైన శక్తి దాగి ఉంటుంది.

## మానవ -పర్యావరణంపై ప్రభావం

సునామీ ప్రభావం కేవలం నీటి ప్రవాహం కాదు, అది జీవనశైలిని మారుస్తుంది. తీరప్రాంత గ్రామాలు పూర్తిగా మునిగిపోవడం, మౌలిక సదుపాయాల ధ్వంసం, తాగునీటి వనరుల కలుషితం, పర్యావరణ విధ్వంసం వంటి పరిణామాలు సంభవిస్తాయి. 2011లో జపాన్‌లో సంభవించిన టోహోకు సునామీ అణు ప్లాంట్ ప్రమాదానికి దారితీసింది. ఈ ఘటనలు మనకు ప్రకృతి పట్ల జాగ్రత్తగా ఉండాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తాయి. మ్యాంగ్రోవ్ అడవులు, పల్లపు ప్రాంతాలు, ఇసుక గుట్టలు సహజ రక్షణగా పనిచేస్తాయి. పర్యావరణ పరిరక్షణ, ప్రజల అవగాహన కలిస్తేనే సునామీ వంటి విపత్తులను బలంగా ఎదుర్కొనగలుగుతాము.

## హెచ్చరిక వ్యవస్థలు

సునామీ ముందు హెచ్చరిక వ్యవస్థలు ప్రపంచ వ్యాప్తంగా మానవ భద్రతలో విప్లవాత్మక మార్పు తెచ్చాయి. జపాన్‌లోని JAlert వ్యవస్థ భూకంపం సంభవించిన సెకన్లలోనే ప్రజల మొబైల్ ఫోన్లకు మరియు టెలివిజన్లకు హెచ్చరికలు పంపుతుంది. అమెరికాలోని పసిఫిక్ సునామీ వార్నింగ్ సెంటర్ (PTWC) పసిఫిక్, ఇండియన్, అట్లాంటిక్ మహాసముద్రాలను పర్యవేక్షిస్తుంది. ఇండోనేషియాలోని INATEWS వైర్‌లెస్ సిగ్నల్ ఆధారంగా గ్రామాల వరకూ అలారంలు పంపుతుంది. భారతదేశంలోని INCOIS (హైదరాబాద్) ఇండియన్ ఓషన్ దేశాలన్నింటికి రియల్ టైమ్ హెచ్చరికలు అందిస్తుంది. ఈ వ్యవస్థల్లో ఉపగ్రహ డేటా, సీస్మిక్ సెన్సర్లు సమన్వయంగా పనిచేస్తూ, అలలు తీరానికి చేరుకునే ముందే హెచ్చరికలు పంపిస్తాయి. విజ్ఞానం, సాంకేతికత, అంతర్జాతీయ సహకారం కలిసి మానవ ప్రాణాలను రక్షిస్తున్నాయి.

## భవిష్యత్ ప్రణాళికలు

పాఠశాల స్థాయి నుండే సునామీ అవగాహన కార్యక్రమాలు, తీరప్రాంత డ్రిల్స్, మరియు ప్రజల్లో ముందస్తు చర్యల శిక్షణ చాలా అవసరం. ప్రభుత్వాలు కొత్త సాంకేతికతలను అభివృద్ధి చేస్తున్నప్పటికీ, ప్రజలు సహకరించకపోతే అవి ఫలించవు. భారతదేశం ప్రస్తుతం సముద్రంలో స్మార్ట్ అండర్వాటర్ కేబుల్ సెన్సర్లు ఏర్పాటు చేస్తున్నది. ఇవి సునామీని గుర్తించి 30 సెకన్లలో అలారం పంపగలవు. ప్రపంచ సునామీ దినోత్సవం మనకు ఇచ్చే స్పష్టమైన సందేశం. ప్రకృతిని గౌరవించండి, విజ్ఞానాన్ని ఉపయోగించండి. సముద్రం యొక్క శక్తి పట్ల మనం అవగాహన, అప్రమత్తతతోనే ఆస్తి, ప్రాణ, పర్యావరణ నష్టాన్ని నివారించి మానవ జాతి భద్రతను బలోపేతం చేసుకోగలము.

– వెంకటరమణ

## బిసి రిజర్వేషన్ బిల్లు అమలు చేయాలి

**ప్రజాపక్షం/షాబాద్:** బిసి రిజర్వేషన్ బిల్లును వెంటనే అమలు చేయాలని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు అన్నారు. మంగళవారం షాబాద్ మండల కేంద్రంలో బిసి సంఘాల సభ్యులు చేస్తున్న రిలే నిరహార దీక్షకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బిసిలు గత 70 సంవత్సరాలుగా రాజకీయంగా వెనుకబడిందన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడం న్యాయం అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే తగిన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. బిసిలకు అన్యాయం జరిగితే పోరాటాలతో సాధిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బిసి సంఘాల నాయకులు తమ్మళి రవీందర్, జడల రాజెందర్ గౌడ్, చెందిప్ప జంగయ్య, రాపోల్ నర్సింలు, సత్యనారాయణ తదతరులు ఉన్నారు.



## విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తా

### కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

**ప్రజాపక్షం/మియాపూర్:** విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు కాలనీలో పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్నామని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తెలిపారు. విద్యుత్ శాఖ వినియోగదారుల దినోత్సవంలో భాగంగా మంగళవారం మియాపూర్ డివిజన్ లోని స్టాలిన్ నగర్ కాలనీలో టీజిఎస్‌పీడీసీఎల్ అధికారులు ఎస్ఈ రవికుమార్,ఏడీఈ హరి కృష్ణ,సంబంధిత విద్యుత్ అధికారులతో కలిసి కలిసి కార్పొరేటర్ ఉప్పలపాటి పర్యటించారు..కాలనీలో నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా ట్రాన్స్‌ఫార్మర్ల సంఖ్యను కూడా పెంచాలని, అవసరమైన చోట ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ ఉప్పలపాటి అధికారులను కోరారు. విద్యుత్ విషయంలో ప్రజలకు సహకరించాలన్నారు. టీజిఎస్‌పీడీసీఎల్ సంబంధిత అధికారులు ఏఈ శ్రీనివాస్ రెడ్డి, లైన్ ఇన్స్పెక్టర్ రమేష్,లైన్మెన్ పవన్,ప్రసాద్, సిబ్బంది,స్టాలిన్ నగర్ కాలనీ వాసులు రాణి, వెంకటేష్, శ్యామల, నరేష్, రాములు, వేణు, శ్రీను, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బెట్టింగ్‌లు ప్రమాదకరం : సజ్జనార్



**ప్రజాపక్షం / హైదరాబాద్:** సంగారెడ్డి పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న కొఠారి సందీప్ కుమార్ అనే కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. సందీప్ ఆన్లైన్ గేమ్స్, బెట్టింగ్‌లకు అలవాటుపడి అప్పులపాలు అవ్వడంతో ఆత్మహత్య చేసున్నట్టు తెలుస్తోంది. కాగా ఈ ఘటనపై హైదరాబాద్ పోలీసు కమిషనర్ విసి సజ్జనార్ స్పందించారు. ఆన్ లైన్ బెట్టింగ్ మహమ్మారి అనర్థాలను నలుగురికి అవగాహన కల్పించాల్సిన కానిస్టేబులే.. దానికే వ్యసనపరుడై బలవన్మరణం చేసుకోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. బెట్టింగ్ అనేది ఎంతటి ప్రమాదకారో ఈ ఘటన మనకు స్పష్టం చేస్తోందన్నారు. జీవితంలో ఒడిదొడుకులు సహజమని, సమస్యకు ఆత్మహత్య ఒక్కటే పరిష్కారం కాదని పేర్కొన్నారు. కష్ట సమయాలను ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగలే తప్ప.. చనిపోవాలనే ఆలోచనను మదిలో రానివొద్దని సూచించారు. ఇదిలా ఉంటే సందీప్ తన సోదరితో కలిసి సంగారెడ్డి పట్టణంలో నివాసం ఉంటున్నట్టు తెలుస్తోంది. ఏడాది క్రితం ఉద్యోగంలో చేరగా సందీప్ వయసు కేవలం 23ఏళ్లే. చిన్నవయసులోనే ఉద్యోగం సాధించినప్పటికీ ఆన్లైన్ గేమ్స్ కారణంగా ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

## రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

### రాజేంద్రనగర్ వరి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పద్మజ



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** రైతులకు ఆర్థికంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతోనే నాణ్యమైన విత్తనాలను ప్రభుత్వం అందిస్తుందని రాజేంద్రనగర్ వరి రీసెర్చ్ స్టేషన్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పద్మజ వివరించారు. మంగళవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కొండన్నగూడ గ్రామంలో మనసాని వెంకట్‌రెడ్డి పోలంలో సాగుచేసిన కెఎన్ఎం1638 విత్తన రకం వరిపంటను వ్యవసాయ శాఖ అధికారులతోపాటు శాస్త్రవేత్తలు క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పద్మజ మాట్లాడుతూ ప్రభుత్వం నుండి నాణ్యమైన ఫౌండేషన్ వరి కెఎన్ఎం1638 రకం విత్తన వంగడాన్ని ప్రతి గ్రామంలో ముగ్గురు ఆదర్శ రైతులకు ఇవ్వడం జరిగిందని వివరించారు. ఈ విత్తనాలు వినియోగించి అన్నదాతలు అధిక దిగుబడి పొందడమే కాకుండా మళ్ళీ దాన్ని తోటి రైతులకు విత్తనంగా వాడుకోవచ్చునని వివరించారు. విత్తనం విత్తిన నాటి నుండి కోతకు వచ్చే వరకు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, సలహాలు తీసుకోవడమే కాకుండా ఎరువులు, క్రిమి సంహారక మందుల వినియోగంపై తెలుసుకోవాలని పేర్కొన్నారు. కురుస్తున్న అకాల వర్షాలకు సైతం దెబ్బతినకుండా ఉంటుందని, క్రాపు ఎక్కువగా వచ్చేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి నిశాంత్‌కుమార్ మాట్లాడుతూ వర్షాకాలనికి సంబంధించి ప్రతి రెవిన్యూ గ్రామంలో ముగ్గురు చొప్పున 108 వరి కెఎన్ఎం 1638రకం మినీ కిట్లను ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి గోవర్ధన్, తేజ్‌కుమార్‌తోపాటు రైతులు పాల్గొన్నారు.

## ఫీజురీయింబర్స్‌మెంట్ చెల్లించాలి : ఆకాష్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** విద్యార్థులకు స్కాలర్‌షిఫ్, ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులు తక్షణమే చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి ఆకాష్‌నాయక్ డిమాండ్ చేశారు. విద్యార్థులపై ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరీ అవలంభించడంతోనే స్కాలర్‌షిఫ్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ రావడం లేదని, సుమారు రూ.8500కోట్ల నిధులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. విద్యార్థులు తమ చదువులు కొనసాగించలేక, ఫీజులు కట్టలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్యార్థుల జీవితాలతో అడుకుంటున్న ప్రభుత్వం తక్షణమే స్పంధించి పెండింగ్ స్కాలర్‌షిఫ్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను చెల్లించాలని డిమాండ్ చేశారు. బుధవారం జరగనున్న విద్యాసంస్థలను బంద్ చేసేందుకు ప్రతి ఒక్కరు సహోకరించాలని, విద్యారంగ సమస్యలపై ఏఐఎస్ఎఫ్ నిరంతరం పోరాటం చేస్తుందని పేర్కొన్నారు.

## నేటి విద్యార్థులే భావిభారత నిర్మాతలు

### తెలంగాణ అర్బన్ ఫైనాన్స్,ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ చల్లా నరసింహారెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** నేటి విద్యార్థులే రేపటి భావిభారత నిర్మాతని తెలంగాణ అర్బన్ ఫైనాన్స్,ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ చల్లా నరసింహారెడ్డి అన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం జిల్లెలుగూడలో సుదీర్ఘకాలం సర్పంచ్ గా సేవలందించిన చల్లా లింగారెడ్డి జ్ఞాపకార్థం నిర్మించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన రాజకీయ వారసుడు రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్,ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ చల్లా నరసింహా రెడ్డి సందర్శించారు.ఈ సందర్భంగా విద్యార్థులతో వారికీ కావల్సిన మౌలిక వసతులను గూర్చి అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా చల్లా నరసింహారెడ్డి మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి భావి భారత నిర్మాతలని,విద్యార్థులు తమ చదువును కష్టపడుతు చదవకుండా ఇష్టంతో చదువుతే భవిష్యత్తు బంగారు మయం అవుతుందన్నారు.ప్రభుత్వ స్కూల్లో చదువుకున్న అనేకమంది ఐఏఎస్,ఐపిఎస్,డాక్టర్లు,ఇంజనీర్లు,శాస్త్రవేత్తలు,రాజకీయ నాయకులు గా ఉన్నత స్థాయిలో ఉన్నారన్నారు.నేటి ఆధునిక సమాజంలో టెక్నాలజీ రోజురోజుకు అభివృద్ధి చెందుతుందని,దీంతో నేటి విద్యార్థులు రాబోయే తరానికి దిక్సూచి కావాలని ఆయన విద్యార్థులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సిద్దాల దశరథ్,మురళి గౌడ్,స్థానిక ఎంఇఒ కృష్ణయ్య పాల్గొన్నారు.

## లక్ష్మీకాంత్‌రెడ్డి సేవలు అపూర్వం

**ప్రజాపక్షం/శంకర్ పల్లి:** శంకర్ పల్లి గ్రామ మాజీ వార్డు సభ్యుడు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లక్ష్మీకాంత్ రెడ్డి సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు.చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య మంగళవారం చిన్న శంకర్ పల్లి లోని అతని గృహము లో లక్ష్మీకాంత్ రెడ్డి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

# కలుషిత నీటి సమస్యలపై తక్షణం స్పందించాలి

### జలమండలి ఎండి అశోక్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కలుషిత నీరు, సీవరేజి ఓవర్ ఫ్లో, మిస్సింగ్ మ్యాన్ హోళ్లపై వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యమివ్వాలని జలమండలి ఎం.డి. అశోక్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఖైరతాబాద్ జలమండలి ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఈడి మయాంక్ మిట్టల్‌లతో కలిసి ఎం.డి. ఓ అండ్ ఎం, రెవెన్యూ, ఎంసిసి, సింగిల్ విండో, ఏఎంఎస్ తదితర అంశాలపైన సిజిఎంలు, జిఎం, డిజిఎం, మేనేజర్‌లతో సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎంసిసికి వచ్చే ఫిర్యాదులను వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా ఆఫ్‌లైన్ ఫిర్యాదులను సైతం ఎంసిసి పరిధిలో నమోదు చేసి పరిష్కరించాలన్నారు. దానివాళ్ళ మొత్తం ఫిర్యాదులను అధ్యయనం చేసే వీలుకలుతుందని చెప్పారు. అలాగే కొత్త కనెక్షన్‌ల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే మంజూరు చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కొత్త కనెక్షన్ మంజూరులో అలసత్వం ప్రదర్శిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని ఎండి హెచ్చరించారు. మంచినీటి సరఫరాలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారుల దృష్టి సారించాలని సూచించారు. జలమండలి పరిధిలో త్వరలో వాటర్ ఆడిట్‌ను ప్రారంభిస్తామని తెలిపారు. ప్రతి రిజర్వాయర్ నుంచి సరఫరా చేస్తున్న ప్రతి చుక్కనూ లెక్క కట్టేలాగా ఫ్లో మీటర్‌ను పెట్టి, చివరి వినియోగదారుని వద్ద కూడా మీటర్ రీడింగ్ సరిపోయేలా లెక్క కడితే ట్రాన్స్ మిషన్ లాస్ తేలుస్తామన్నారు. దాని ద్వారా వృథాగా పోతున్న నీటిని గుర్తించి దాన్ని అరికట్టడానికి చర్యలు తీసుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. వీటితోపాటు ఎయిర్ టెక్, సిల్ట్ కార్టింగ్ వాహనాల వినియోగంపై సమీక్షించారు. ఈ సమావేశంలో జలమండలి ఆపరేషన్ డైరెక్టర్లు టి.వి. శ్రీధర్, వినోద్ భార్గవ, సిజిఎంలు, జిఎంలు, డిజిఎంలు, మేనేజర్లు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నియంత్రణలో ప్రభుత్వం విఫలం

### ఓవర్‌లోడ్ రవాణాపై అధికారుల చర్యలేవి?

### బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** రోడ్డు ప్రమాదాలను నియంత్రించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే నిత్య ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం షాద్‌నగర్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఓవర్‌లోడ్‌లో రవాణా చేస్తున్న వాహనాలపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రవాణా శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే రహదారులపై నిత్య ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వివరించారు. ఎన్నో ఎళ్లుగా వాహనాలతో రద్దీగా ఉండే ఆ రహదారిని ఎందుకు విస్తరించడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడంతోనే పెద్ద ఎత్తున ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వివరించారు. ప్రభుత్వం ఉచిత బస్సు ఏర్పాటు చేయడంతోనే మహిళలు ఎక్కువ శాతం బస్సుల్లో ప్రయాణిస్తున్నారని, అందుకు అనుగుణంగా బస్సులకు ఫిట్నెస్ లేకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. సోమవారం ఉదయం చేవెళ్ల మండలం మీర్జాగూడ వద్ద చోటు చేసుకున్న టిప్పర్, బస్సు ప్రమాదంలో మరణించిన కుటుంబాలన్న ప్రభుత్వమే పూర్తి స్థాయిలో అదుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరిచి రోడ్డు ప్రమాదాలను నియంత్రించడంతోపాటు అదిక లోడ్‌తో వెళ్తున్న వాహనాలపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బిజెపి సీనియర్ నేత మోహన్‌సింగ్, నరసింహా యాదవ్, సుధాకర్ అప్ప, కొందుర్గు మండల అధ్యక్షుడు చిట్టెం లక్ష్మీ కాంత్‌రెడ్డి, కొత్తూరు మండల అధ్యక్షుడు అత్తాపూర్ మహేందర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

## క్రమశిక్షణతో విద్య అభ్యసిస్తే బంగారు భవిత

### రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు గందె సురేష్ గుప్తా



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** విద్యార్థులు క్రమ శిక్షణతోవిద్యనుఅభ్యసిస్తేభవిష్యత్ బంగారుమయంగా ఉంటుందని రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు గందె సురేష్ గుప్తా అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మొగిలిగిద్ద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. సురేష్ గుప్తా మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో 25వేల నోట్ పుస్తకాలను పంపిణీ చేసేందుకుచర్యలు తీసుకుంటున్నామని వివరించారు. నేడు మొగిలిగిద్ద ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలను అంధించినట్లు తెలిపారు. విద్యార్థులు క్రమ శిక్షణతో విద్యను అభ్యసిస్తే బంగారు భవిష్యత్ లభిస్తుందని వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు దాతలు ముందుకు వచ్చి సహాయ సహకారాలు అంధించడం అభినందనీయమని పేర్కొన్నారు. పుస్తక కమిటి చైర్మెన్, ఫరూఖ్‌నగర్ మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఎల్కుర్తి నారాయణ గుప్తా, మాజీ అధ్యక్షుడు హన్మారి మురళి గుప్తా, పాఠశాల అభివృద్ధి కమిటి చైర్మెన్ శ్యాంసుందర్,మల్లేష్,వ్యాపారవేత్తలు పి.పాండు రంగ గుప్తా, సామాజిక కార్యకర్త నీల రవీందర మాజీ కౌన్సిలన్ మాధవి నందకిశోర్, గడ్డం ఆంజనేయులు పాల్గొన్నారు.

## గచ్చిబౌలిలో డ్రగ్స్, గంజాయి స్వాధీనం

## 11 మంది నిందితుల అరెస్ట్



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి:** గచ్చిబౌలిలోని ఒక లగ్జరి గెస్ట్ హౌస్‌లో డ్రగ్స్ గంజాయి సేవిస్తున్నారని పక్కా సమాచారం అందడంతో మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు, గచ్చిబౌలి పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి 32గ్రాములడ్రగ్స్, 4.67 గ్రాముల గంజాయి, 6 మొబైల్ ఫోన్లతో పాటు 10,000 రూపాయల నగదు 11 మంది నిందుతులను అరెస్ట్ చేశామని మాదాపూర్ జోన్ అడిషినల్ డిసిపి ఉదయ్ రెడ్డి తెలిపారు. మంగళవారం గచ్చిబౌలిలోని డిసిపి కార్యలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాదాపూర్ జోన్ అడిషినల్ డిసిపి ఉదయ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం గచ్చిబౌలి, టీఎన్‌జిఓస్ కాలనీ లోని ఎస్‌యం లగ్జరీ గెస్ట్ రూమ్ కో లివింగ్, పిజి హస్టల్‌లో డ్రగ్స్, గంజాయి విక్రయదారులతో పాటు యువకులు మత్తు పదార్థలు సేవిస్తున్నారని పక్కా సమాచారం అందడంతో మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు, గచ్చిబౌలి పోలీసులు ఏంతో చాకచక్యంగా వ్యవహరించి డ్రగ్స్ అమ్ముతూ, సేవిస్తున్న 11 మంది నిందుతులను అరెస్ట్ చేశామని 8 మంది నిందుతులు పరారైనారని తెలిపారు. 11 మంది నిందుతులలో వారిలో సరఫరాదారులు, వినియోగదారులు ఉన్నారని, వీరందరు హైద్రాబాద్‌తో పాటు తెలంగాణకు చేందిన వారని డ్రగ్స్, గంజాయి ఇతర రాష్ట్రాల నుండి అక్రమ మార్గాలలో తెప్పించి యువతకు విక్రయిస్తున్నారని, డ్రగ్స్ సరాఫరా దారుల మత్తులో పడి యువత డ్రగ్స్‌కు బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. యువత డ్రగ్స్ బారి నుండి బయట పడి తమ బంగారు భవిష్యత్తును కాపాడుకొవాలని సూచించారు. అరెస్ట్ అయిన వారిలో 1. గుత్తా తేజా కృష్ణ,2. షాజీర్ మోటుంగారా, 3. వెన్నెల రవికిరణ్, 4. పాకనాటి లోకేష్ రెడ్డి, 5.పెద్ద మంటూరు హర్షవర్ధన్ రెడ్డి, 6. మన్నె వెంకట ప్రశాంత్, 7. పృధ్వి విష్ణవర్ధన్, 8. కార్లపూడి ప్రస్లీ సుజిత్, 9. మేకల గౌతమ్, 10. గుండెబోయిన నాగార్జున, 11. గుంటుక సతీష్ రెడ్డి లను అరెస్ట్ చేయగా వినయ్, లక్ష్మ ణ్, రిజ్వాన్, కార్తిక్, వంశీ, హర్ష, ఇంక ఇద్దరు నైజీరియన్లు తప్పించుకున్నారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని నిందితులను రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

## 200 మంది మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు



**ప్రజాపక్షం/మియాపూర్:** ఇందిరమ్మ మహిళా శక్తి"పథకం క్రింద,తెలంగాణ రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా మైనారిటీ మహిళలకు ఎమ్మెల్యే గాంధీ, మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, చందానగర్ డివిజన్ కార్పొరేటర్ మంజుల రఘునాథ్ రెడ్డి,జిల్లా మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ నవీన్ కుమార్ రెడ్డిలతో కలిసి మంగళవారం మియాపూర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 200 మంది మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు అందజేశారు.అనంతరం ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు.మహిళలు తమ స్వంత కాళ్ళ పై నిలబడి కుటుంబ పోషణ కు చేదోడు వాదోడుగా ఉండేందుకు ఎంతగానో ఉపయోగపడతాయి అని,ఆర్థికంగా ఎదగాలని మనసారా కోరుకుంటున్నానన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మహిళా పక్షపాతి అని ,గొప్ప మనసున్న నేత అని, మహిళల సంక్షేమం కొరకు అనేక పథకాలు ప్రవేశపెట్టింది ఒక తెలంగాణ ప్రభుత్వమే అన్నారు. జిల్లా మైనారిటీ వెల్ఫేర్ రీజినల్ ఆఫీసర్ కులకర్ణి, ఎజిఎం పాసరి, షాజియా బేగం, నజియా బేగం మాజీ కౌన్సిలర్లు, మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మంచినీటి సరఫరా, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి



**ప్రజాపక్షం/కేశంపేట:** రానున్న వేసవి కాలం దృష్టిలో పెట్టుకొని మంచినీటి సరఫరా, పారిశుద్ధ్యంపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించేందుకు కృషి చేయాలని ఎంపిడివో రవిచంద్రకుమార్‌రెడ్డి సూచించారు. మంగళవారం కేశంపేట మండల కేంద్రంలోని ఎంపిడివో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతోపాటు వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపిడివో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల ప్రగతి, ఎంజిఎన్ఆర్ఇజిఎస్, మంచినీటి సరఫరా, పారిశుద్ధ్యం, జల సంచాయి జన భాగదారి 2.0 కింద పనులు చేపట్టేందుకు పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని సూచించారు. 2026–2027కు గాను ఉపాధి హామీలో పనులు గుర్తించి ప్రణాళికలు సిద్ధం చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించి తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని సూచించారు. జల సంచాయి జన బాగదారి 2.0కింద వ్యక్తిగత లబ్దిదారులకు మ్యాజిక్ సోకుపిట్‌లు, బోర్వెల్ రీచార్జీ స్ట్రక్చర్, వాలు కట్టలు మొదలైన పనులను గుర్తించుటకు లబ్దిదారులకు ఎంపిక చేసి పనులు మంజూరు చేయాలని పేర్కొన్నారు. ఏపివో అజీజ్, టిఎలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# భర్తను కిడ్నాప్ చేసిన మొదటి భార్య..

### రూ.1.50 కోట్లు డిమాండ్–10 మంది అరెస్టు

### వివరాలు వెల్లడించిన డిసిపి బాలస్వామి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** అంబర్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలోని డిడి కాలనీలో అక్టోబర్ 29న కిడ్నాప్ కు గురైన రియల్టర్ మంత్రి శ్యామ్ కేసును ఈస్ట్‌జోన్ పోలీసులు చేధించారు. ఈ కేసులో మంగళవారం 10 మంది నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు మీడియా ముందు ప్రవేశపెట్టారు. శ్యామ్‌ను తన మొదటి భార్య మాధవిలతే కిడ్నాప్ చేయించిందని చెప్పారు. శ్యామ్ మరో మహిళను పెళ్లి చేసుకోవడంతో ఆస్తి పంపకాల్లో విభేదాలు రావడంతో మాధవిలత కిడ్నాప్ చేయించిందని ఈస్ట్ జోన్ డిసిపి బాలస్వామి తెలిపారు. అంబర్పేట్ డిడి కాలనీలో అక్టోబర్ 29వ మంత్రి శ్యామ్ అనే వ్యక్తిని కిడ్నాప్ చేసి రూ.కోటి50లక్షలు డిమాండ్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుల దగ్గర నుంచి మూడు కార్లు, రెండు ద్విచక్ర వాహనాలు, ఎనిమిది మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సిసిటాఇవి ఫుటేజ్ ఆధారంగా ఆరుగురు నిందితులు శ్యామ్‌ను అపహరించారని పోలీసులు గుర్తించారు. వారు అద్దె కార్లలో ఈ నేరానికి పాల్పడినట్లు విచారణలో తేలింది. ప్రధాన నిందితురాలు మాధవీలత అమెరికాలో మంత్రి శ్యామ్తో వివాహం చేసుకొని మూడు సంవత్సరాల వ్యవధిలోనే విడాకులు తీసుకున్నారు.. గత మూడు సంవత్సరాలుగా ఆమె భర్తకు దూరంగా ఉంది. బాధితుడు శ్యామ్ తన పేరును అలిగా మార్చుకొని ఫాతిమా అనే మహిళను రెండో వివాహం చేసుకున్నాడు. శ్యామ్ తండ్రి నుంచి వచ్చిన రూ.20 కోట్ల విలువైన ఆస్తిని విక్రయించినట్లు సమాచారం.ఈ గ్యాంగ్ ప్రధాన సూత్రధారి సాయి అనే వ్యక్తి రామనగర్ ప్రాంతానికి చెందినవాడని పోలీసులు తెలిపారు. మరో నిందితురాలు జీ.ప్రీతి లేడీ బౌన్సర్గా పనిచేస్తుండగా, ఎల్.సరిత అనే మరో మహిళ బాధితుడు ఉన్న అపార్ట్మెంట్లోనే ఘటనకు రెండు రోజుల ముందు నివసించి, అతని కదలికలపై నిఘా పెట్టినట్లు పోలీసులు చెప్పారు. బాధితుడిని చెర్లపల్లి ప్రాంతానికి తీసుకెళ్లి రెండు ప్రదేశాల్లో తిప్పుతూ రూ.30 లక్షలు డిమాండ్ చేసినట్లు విచారణలో తేలింది. బాధితుడు డబ్బులు సర్దుబాటు చేసుకోవడానికి తన స్నేహితుడికి ఫోన్ చేయగా, ఆ స్నేహితుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. శ్యామ్ తెలివిగా తప్పించుకుని పోలీసులకు వివరాలు తెలియజేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు 10 మందిని అరెస్ట్ చేశారు. కేసులో మిగిలిన నలుగురిని త్వరలో పట్టుకుంటామని డిసిపి బాలస్వామి తెలిపారు.ఈ సమావేశంలో అదనపు డిసిపి జె.నర్సయ్య,ఎసిపి హరీష్‌కుమార్, ఇన్స్పెక్టర్ టి.కిరణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

## ఘనంగా లక్ష దీపోత్సవం




**ప్రజాపక్షం/ఉప్పల్ :** ఉప్పల్ భగాయత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో లక్ష దీపోత్సవం కార్యక్రమం ఆద్యంతం భక్తిశ్రద్ధలతో నిర్వహించబడింది. శ్రీ పార్వతీ పరమేశ్వరుల కళ్యాణం అంగరంగ వైభవంగా సాగింది. అనంతరం శ్రీశ్రీశ్రీ త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి అనుగ్రహ భాషణం, ప్రవచనా సూక్తులతో పాటు కార్తీక మాస దీపోత్సవ గొప్పతనం గురించి భక్తులకు వివరించారు. అర్చకులచే రుద్రాభిషేకం, మహా మంగళహారతులు భక్తులను మైమరిపించా యి. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు, భగాయత్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల విద్యార్థులకు వాటర్ ప్లాంట్



**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** గురుకుల్ కళాశాలలో పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో రాజ్యసభ సభ్యులు కోవ లక్ష్మ ణ్ సహకారంతో ఒఎన్‌జిసి సౌజన్యంతో విద్యార్థులకు మంచినీటి వాటర్ ప్లాంట్‌ను మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్ రెడ్డి, తన సొంత నిధులతోమరమతులు చేసి బండారి శ్రీనివాస్ గౌడ్, జెఎసి కన్వీనర్ మారాం లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచ్ వేముల సంజీవ గౌడ్‌లు కలిసి వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు బొక్క మహిపాల్ రెడ్డి, బచ్చు నగేష్ గుప్తా, మాజీ కౌన్సిర్ బేతల నర్సింగ్ రావు, కళాశాల ప్రిన్సిపాల్ నారాయణ రెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## హైడ్రా అధికారులు అక్రమ కట్టడాల కూల్చివేత

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** తూంకుంట మున్సిపాలిటి దేవరయాంజాల్‌లో మహాలక్ష్మి కాలనీలో హైడ్రా అధికారులు మంగళవారం కూల్చివేతలు చేశారు. దేవరయాంజాల్‌లోని ఓ గోదాములో అక్రమంగా నిర్మించిన ఓ ప్రహారీగోడను హైడ్రా అధికారులు జెసిబిలతో కూల్చివేశారు. హైడ్రా ఇన్స్‌పెక్టర్ మల్లేశం, తూంకుంట మున్సిపల్ సిబ్బంది ఆధ్వర్యంలో హైడ్రాకు వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా నాలాలపై అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను కూల్చివేశారు. హైడ్రా సిబ్బంది మూడు జెసిబిలతో గోదాంలోని ప్రహరీని కూల్చివేయగా సుమారు ఆరు ఫీట్ల లోతు నుంచి నీళ్లు వెళ్లుటకు కాలువను తీస్తున్నారు. గతంలో ఇదే కాలువలో నీటి పైప్‌లైన్ ఉండగా అది సరిపోవడం లేకనే నీళ్లు వెళ్లడానికి ఇబ్బందిగా మారి రోడ్డుపైకి వస్తున్నాయని గ్రహించిన హైడ్రా అధికారులు పెద్ద ఎత్తున కాలువను ఏర్పాటు చేయుటకు చర్యలు చేపట్టారు. ఇటీవల కాలంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ దేవరయాంజాల్ రెవెన్యూ పరిధిలో పర్యటించారు. ఆక్రమణకు గురైన నాలాలను మున్సిపల్ అధికారులతో కలిసి సందర్శించి పరిశీలించారు. ఆక్రమణకు గురైన నాలలను గుర్తించిన మున్సిపల్, ఇర్రిగేషన్ అధికారులు హైడ్రాకు నివేదికలను పంపించారు. ప్రతిఏటా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మహాలక్ష్మి కాలనీ ముంపుకు గురై మోకాళ్ల లోతు నుంచి నీళ్లు వెళ్తుండేవి. ప్రధాన రోడ్డుపైకి నీరుచేరి వాహనాలు, ప్రజలు రాకపోకలు సాగించకుండా నీటి ప్రవాహం అడ్డుకునేది. దీంతో దేవరయాంజాల్ గ్రామ ప్రజలు హైడ్రాను ఆశ్రయించి ఆక్రమణకు గురైన నాలాలను వెంటనే తీసివేయాలని ఫిర్యాదుల రూపంలో హైడ్రా కమిషనర్‌కు వినతులు సమర్పించారు. ఇంకా ఉమ్మడి శామీర్‌పేట మండలంలో అక్రమణకు గురైన నాలలను గుర్తించి కూల్చివేయాలని అధికారులను కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో తూంకుంట మున్సిపల్ సిబ్బంది, హైడ్రా సిబ్బంది, ఇర్రిగేషన్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


## అతివేగంగా దూసుకొచ్చిన కారు: మహిళ మృతి

**ప్రజాపక్షం/వికారాబాద్ :** వికారాబాద్ పట్టణంలోని ఎస్‌పి కళాశాల వద్ద మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అతివేగంగా దుసుకొచ్చిన కారు స్కూటీని ఢీ కొనడంతో ప్రమాదంలో వికారాబాద్ మున్సిపల్‌కు చెందిన భారతి 57సంల మహిళ మృతి చెందగా ఆమె భర్త తులసిరామ్ తీవ్రంగా గాయపడ్డారు. నలుగురు గాయపడ్డారు. గాయపడినవారు కర్నూల్ జిల్లాకు చెందిన లక్ష్మ ణ్, శ్రీను, చిన్నగా పోలీసులు గుర్తించారు. ఈ ప్రమాదంలో నాలుగు బైకులు ధ్వసం అయినట్లు గుర్తించారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## క్రీడోత్సవాలకు ముస్తాబవుతున్న పాఠశాల

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలంలోని మహాత్మా జ్యోతి బా పూలే బాలుర పాఠశాలలో హైదరాబాద్ జిల్లా స్థాయి క్రీడోత్సవాలను నిర్వహిస్తున్నామని పాఠశాల ప్రిన్సిపల్ రవికుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 6 వ తేది నుంచి 13 వ తేదీ వరకు హైదరాబాద్ జిల్లాలో ఉన్నటువంటి అండర్ 14, అండర్ 17, అండర్ 19 విభాగాల కబడ్డి, వాలీబాల్, ఖోఖో, టెన్నికైట్, చెస్, అథ్లెటిక్స్ ఆటలను నిర్వహించడం జరుగుతుందన్నారు. హైదరాబాద్ జిల్లా నుంచి 16 పాఠశాలలకు గాను సుమారుగా 1200 మంది క్రీడాకారులు పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిసి వెల్ఫేర్ కార్యదర్శి సైదులు, జిల్లా విద్యాధికారి విజయకుమారి, బిసి జిల్లా అధికారి ఝాన్సి రాణి ఠాకుర్, హైద్రాబాద్ ఆర్‌సిఒ గౌతమ్‌కుమార్, తూంకుంట మున్సిపల్ కమిషనర్ జ్యోతి, తహశీల్దార్ సంయుక్త, ఇన్స్‌పెక్టర్ శ్రీనాధ్ విచ్చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరక్టర్ వెంకట్‌రెడ్డి,సాయికుమార్, సాయిబాబా, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.





## మాజీ మంత్రి హరీష్ రావును పరామర్శించిన నాయకులు

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** మాజీ మంత్రి హరీష్ రావు తండ్రి సత్యనారాయణ రావు పరమపదించిన నేపథ్యంలో హరీష్ రావు స్వగ్రూహంలో కీర్తిశేషులు సత్యనారాయణ రావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన పోచారం సంస్కృతి టౌన్షిప్ అసోసియేషన్ అధ్యక్షులు హరిప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ రెడ్యాక్ నాయక్. అనంతరం హరీష్ రావును పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దు



**ప్రజాపక్షం/వికారాబాద్ :** పత్తి విక్రయించడానికి వచ్చే రైతులను మిల్లుల యాజమన్యం, సిసిఐ అధికారులు ఎలాంటి ఇబ్బందులకు గురి చేయొద్దని, అకాలవర్షం కారణంగా ప్రస్తుత తేమ 8శాతం నుండి 14శాతం వరకు వెసులుబాటు కల్పించాలని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. మంగళవారం అయ్యప్ప కాటన్ మిల్లులో పత్తి కొనుగోలు కేంద్రం, మార్కెట్ యార్డులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని నాణ్యత పేరిట తిరస్కరించకుండా కొనుగోలు చేయాలని ఆదేశించారు. పత్తి రైతులకు ఇబ్బందులు కలుగకుండా తగు చర్యలు తీసుకోవాలని జిన్నింగ్ మిల్లుల యాజమన్యాన్ని, మార్కెట్ వ్యవసాయశాఖ, సిసిఐ అధికారులకు తెలిపారు. 2025–26 సంవత్సరానికి పత్తి కనీస మద్దతు రూ.8110 నిర్ణయించడంతో జరిగినదని జిల్లా వ్యాప్తంగా మొత్తం 2,46,131 ఎకరాలలో పత్తి దిగుబడి అంచనా వేయడం జరిగిందన్నారు. జిల్లావ్యాప్తంగా 50వేల మంది రైతులు పత్తిని సాగు చేస్తున్నారని వికారాబాద్ జిల్లాలో మొత్తం 14 పత్తి మిల్లులు ద్వారా సిసిఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు. తేమ శాతం 8శాతం నుండి 12శాతం ఉంటే మద్దతు ధర రూ. 8110 నుండి 7785 వరకు లభిస్తుంది. ఈ స్లాట్ బుకింగ్ విధానంలో ప్రస్తుతం ఎకరానికి 11క్వింటాళ్ల పత్తిని విక్రయించే వెసులుబాటు ఉండేది, కానీ కేంద్ర ప్రభుత్వం 7క్వింటాళ్ల పత్తిని విక్రయించడానికి మాత్రమే నిర్ణయమే తీసుకున్నదని తెలిపారు. పాత పద్ధతి ప్రకారం కొనుగోలు చేయాలని తేమ శాతం 14ఉన్న కొనుగోలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రికి స్పీకర్ గా లేఖరాయడం జరుగుతుంది అని తెలిపారు. ఇప్పటివరకు 566 రైతుల నుండి 1055.55 యంటిఎస్ పత్తిని కొనుగోలు చేశామని తెలిపారు. అనంతరం వికారాబాద్ మున్సిపల్‌కి సంబంధించిన కళ్యాణలక్ష్మి , షాదీముబారక్ సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్‌డిఓ వాసుచంద్ర, మార్కెటింగ్ అధికారి సారంగపాణి, వ్యవసాయ అధికారి రాజారత్నం, తహసీల్దార్ లక్ష్మి నారాయణ, పట్టణ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి ప్రసన్నలక్ష్మి , తదితరులు పాల్గొన్నారు.

**కేంద్ర ప్రభుత్వం 11క్వింటాళ్లు కొనుగోలు చేయాలి**

స్పీకర్ ప్రసాద్ కుమార్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న పత్తి కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం మధ్యవర్తిగా మాత్రమే ఉంటుంది, రైతులకు మేలు చేయాలన్నదే రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశం అన్నారు. గత ఏడాది వరకు ఎకరానికి 11క్వింటాళ్ల వరకు పత్తిని కొనుగోలు చేశారు. ఈ ఏడాది దానిని 4క్వింటాళ్లకు తగ్గించారు. ఈ నిర్ణయం వలన పత్తి పండించే రైతులకు నష్టం జరుగుతుంది కాబట్టి కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, ఎకరానికి 13క్వింటళ్ల వరకు కొనుగోలు చేయాలని మేము డిమాండ్ చేస్తున్నాం, అదేవిధంగా, ఎల్1, ఎల్2, ఎల్3 అనే సిస్టం తీసివేసి రైతులు ఏ మిల్లుకు అయినా తీసుకుని వెళ్లి అమ్ముకునే వెసులుబాటు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నాం అని తెలిపారు. ఈ ఏడాది వర్షాలు ఎక్కువగా కురవడంతో పత్తిలో తేమ శాతం పెరిగింది. సిసిఐ నిబంధనలలో ప్రస్తుతం ఉన్న తేమశాతం నింబంధన 8నుండి 12 ను తీసువేసి 16వాతం వరకు తేమ ఉన్న రైతుల నుండి పత్తి కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నామని అన్నారు. తెలంగాణ రాష్టం నుండి 8మంది ఎంపిలు ఉన్నారు ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నారు .తెలంగాణ పత్తి రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ,మా విజ్ఞాప్తిని కూడా పరిగణలోకి తీసుకోని మీరందరూ ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పత్తి రైతులను కాపాడాలని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇట్టిన మాట ప్రకారం వికారాబాద్ కు పెద్ద



ఎత్తున నిధులు మంజురు అవుతున్నాయి అన్నారు. కానీ కొంత అలస్యం అవుతున్నది నిజం ఇందుకు కారణం రాష్ట ఆర్థిక పరిస్థితి గతప్రభుత్వం ఎనిమిది లక్షల కోట్ల రూపాయల అప్పులను తీర్చడంలో పాటుగా మిత్తిని చెల్లిస్తున్నారు. వీటితో పాటుగా అభివృద్ధి సంక్షే మ కార్యక్రమాలకు నిధులను ఇస్తున్నారు ఈ విషయం ప్రజలకు తెలుసు అని అన్నారు.

ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు సుదాకర్‌రెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

**బస్సు ప్రమాదంలో మరణించిన వారికి 7లక్షల రూపాయల నష్టపరిహారం అందజేసిన స్పీకర్**

నిన్న చేవెళ్ల మండలం మీర్జాగూడ వద్ద జరిగిన బస్సు ప్రమదంలో మరణించిన వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ధన్నారం తాండాకు చెందిన తారాబాయికి రాష్ట ప్రభుత్వం తరుపున ప్రకటించిన ఏడులక్షల రూపాయల నష్టపరిహారంతో పాటు స్పీకర్ లక్ష రూపాయలను వారి కుటుంబసభ్యులకు కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో కలిసి స్పీకర్ ప్రసాద్‌కుమార్ అందచేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ చనిపోయిన మనషిని తీసుకురాలేము కానీ ఆపదలో ఉన్న ఆ కుటుంబానికి అండగా ఉండాలని రాష్ట ప్రభుత్వం 7లక్షల రూపాయలు నష్ట పరిహారం ప్రకటించిదని తెలిపారు. దానికి సంబంధించిన చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, పట్టణ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి , స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

### వరుస ప్రమాదాలతోనైనా
## ప్రభుత్వం కళ్లు తెరవాలి
### సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్



**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్:** వరుస ప్రమాదాలతోనైనా ప్రభుత్వం కళ్లు తెరవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ అన్నారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల పరిధిలోని మీర్జాగూడ గేటు వద్ద జరిగిన బస్సు ప్రమాదంలో మృతి చెందిన వారిని మంగళవారం సిపిఐ కుత్బుల్లాపూర్ మండల సమితి తరపున గాంధీనగర్ ఎఐటియుసి కార్యాలయం వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొద్ది రోజుల్లోనే రెండు బస్సు ప్రమాదాలు జరగడం అందులో మృతుల సంఖ్య ఎక్కువగా ఉండడం సమాజాన్ని కలిచివేస్తుందని, ప్రమాదం జరిగిన సమయంలో అధికారులు హడావుడి చేయడమేగానీ ఆ తర్వాత రెగ్యులర్ చెకప్‌లు లేకపోవడం వల్ల ఇలాంటి ప్రమాదాలు తరచుగా జరుగుతున్నాయని ఇది ముమ్మాటికి అధికారుల నిర్లక్ష్యం వల్లనే జరిగిన సంఘటనగా కనిపిస్తుందని అన్నారు. ఒకవేళ అక్కడ భారీ గుంత లేకుండా ఉండి ఉంటే ఇలాంటి సంఘటన జరగకపోయేదని అన్నారు. ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియాల పేరుతో డబ్బులు ఇచ్చి చేతులు దులుపుకోకుండా రోడ్డు ప్రమాదాలకు కారణమైనటువంటి అధికారులను సస్పెండ్ చేసి రవాణాశాఖ అధికారులు నిత్యం చెకప్‌లు చేసుకుంటూ ఉంటే భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగవని అన్నారు. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన వాళ్లు చనిపోవడం, అనేకమంది తమ కుటుంబ సభ్యులను కోల్పోవడం వారి ఆవేదనలు, ఆక్రందనలు తీర్చలేమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కె. స్వామి, సహాయ కార్యదర్శి హరినాథ్ రావు, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, సిపిఐ నాయకులు హరీష్‌రెడ్డి, మల్లారెడ్డి, గౌస్, ఎల్లయ్య, వెంకటేష్, జంబు, తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదం పాలకుల నిర్లక్ష్యమే
### సిపిఐ వికారాబాద్ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్

**ప్రజాపక్షం/తాండూరు:** చేవెళ్ళ రోడ్డు ప్రమాదం పాలకుల నిర్లక్ష్యమే కారణమని, ప్రభుత్వాలు ఎన్ని మారిన ఈ ప్రాంతంలోని రోడ్ల పరిస్థితి మారడం లేదని సిపిఐ వికారాబాద్ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్ అన్నారు. సేవ్ తాండూరు డెవలప్‌మెంట్ ఫోరం, సకల జనుల ఆధ్వర్యాన మంగళవారం తాండూరు పట్టణంలో చేపట్టిన నిరసన కార్యక్రమానికి సిపిఐ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి పండిత్ మాట్లాడుతూ తాండూరుహైదరాబాద్‌కు తక్షణే నాలుగు లైన్లతో రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. తాండూరు ప్రాంత ప్రజల మంచితనమే వారిపాలిట శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాండూరు మున్సిపాలిటి ఏర్పడి 70సంవత్సరాలు దాటినా అభివృద్ధి మాత్రం అంతంత మాత్రమేనని అన్నారు. జిల్లాలోనే తాండూరు ప్రాంతం నుండి ప్రభుత్వానికి రూ.100కోట్ల రెవెన్యూ ఆదాయం అందిస్తుందని, అట్టి నిధుల పంపకాలలో ప్రభుత్వం వ్యత్యాసం చూపుతుందని ఆరోపించారు. ఇప్పటికైన ప్రభుత్వం మేల్కొని ఈ ప్రాంతంలో రోడ్లను విస్తరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంధ సంఘాల ప్రతినిధులు, అఖిల పక్షపార్టీల నేతలు, తదితరులు ఉన్నారు.

**తాండూరులో మరో రోడ్డు ప్రమాదం**

**కర్నాటక ఆర్టీసి బస్సును ఢీ కొట్టిన లారీ.. ప్రయాణికులు సేఫ్**

చేవెళ్ళ ఘోర రోడ్డు ప్రమాద ఘటన మరుకముందే వికారాబాద్ జిల్లా తాండూరులో మరో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. తాండూరు మండల పరిధి కరణ్‌కోట్ సమీపంలో మంగళవారం కర్నాటక చెందిన ఆర్టీసి బస్సును లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగక పోవడంతో అధికారులు, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. గుల్బర్గ నుండి తాండూరుకు వస్తున్న కర్నాటక ఆర్టీసి బస్సు(కెఎ 26,4176)ను తాండూరు మండల పరిధి కరణ్‌కోట్ సమీపంలోని సాగర్ సిమెంట్ ఫ్యాక్టరి వద్ద ఎదురుగా వస్తున్న సిమెంట్ లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్ తలకు స్వల్ప గాయాలు, మరో ప్రయాణికుడు తూకరాంకు స్వల్ప గాయాలు కావడంతో వారికి సాగర్ ఫ్యాక్టరి వద్దనే ఫస్ట్ ఎయిడ్ చికిత్సలు చేయించారు. అయితే బస్సును ఢీకొట్టిన లారీ డ్రైవర్ మాత్రం పరారైనట్లు తెలిపారు. ఈ మేరకు తాండూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



## ఆగని అక్రమ నిర్మాణం... పట్టించుకోని అధికారులు

**ప్రజాపక్షం/నాగారం:** నాగారం మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 133 ప్రధాన రహదారి పక్కన జనావాసాల మధ్య మద్యం దుకాణం కోసం నిర్మిస్తున్న అక్రమ నిర్మాణంపై మున్సిపల్,హెచ్ఎండి అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో స్థానిక కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ నిర్మాణాన్ని ఆపవలసిన అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తూ...వారికి మద్దతు పలుకుతున్నట్లు స్థానికులు అంటున్నారు. ఈ నిర్మాణంపై అధికార పక్షం నాయకులు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇకనైన సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులను అక్రమ నిర్మాణంపై వివరణ కోరగా వారికి నోటీసులు ఇచ్చామని చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు.

**ప్రొహిబిషన్, ఎక్సైజ్ జాయింట్ కమిషనర్‌కు వినతి....**

400 కుటుంబాలు నివాసం ఉంటున్న కాలనీలో అక్రమంగా వైన్స్‌ను నిర్మిస్తుండడతో స్థానికులు గత మూడు రోజులుగా నిరసన కార్యక్రమం చేపడుతూ మున్సిపల్ కమిషనర్, హెచ్ఎండిఎ, కలెక్టర్‌కు వినతులను సమర్పించినా నిర్మాణం మాత్రం ఆగడంలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ మంగళవారం ప్రొహిబిషన్, ఎక్సైజ్ జాయింట్ కమిషనర్‌కు కాలనీ అసోసియేషన్ సభ్యులు, మహిళలు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, నాయకులు నాగరాజు, రెడ్యా నాయక్, మహిళలు పాల్గొన్నారు.



## చేవెళ్ల నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యం
### ఎమ్మెల్యే కాలే యాదయ్య

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** చేవెళ్ళ నియోజకవర్గం అభివృద్దే ధ్యేయంగా అనునిత్యం నియోజకవర్గ ప్రజల కోసం, ప్రజల సమస్యల పరిష్కారం,నూతన ఆవిష్కరణలు,అభివృద్ధి కార్యక్రమాలపై ముందుకు వెళ్తామని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. మంగళవారం నవాబుపేట్ మండలంలో పలు గ్రామాలలో అభివృద్ధి పనులకు 1.90కోట్లతో శంకుస్థాపన చేశారు. చించల్ పేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల కొరకు 46లక్షలు, మూలమాడ గ్రామ పంచాయతీ భవనం కొరకు 20లక్షలు, కుమ్మరిగూడ గ్రామపంచాయతీ భవనానికి 20లక్షలు, మాదారం గ్రామపంచాయతీ భవనానికి 20 లక్షలు, తిమ్మారెడ్డిపల్లిలో ఎస్సి కమ్యూనిటీ భవనానికి 10 లక్షలు, నవాబుపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల కొరకు 54లక్షలు, మాదిరెడ్డి పల్లి గ్రామ పంచాయతీలో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్ర భవనం కొరకు 20లక్షలతో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ, మండల అభివృద్ధి కోసం నిధులను సమర్థవంతంగా వినియోగిస్తూ, ప్రజలకు నాణ్యమైన మౌలిక సదుపాయాలు అందించేందుకు కృషి చేయాలి అని అన్నారు. ఈ భవన నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్మించి, త్వరితగతిన పూర్తిచేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ పోలీస్ రాం రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాథోడ్ గీత సింగ్, ఎంపిడిఒ అనురాధ, ఎంపిఒ విజయ్ కుమార్, డిప్యూటీ తహసిల్దార్ శ్రీలత, మండల వైద్యాధికారి డాక్టర్ రోహిత్, ఎఎంసి డైరెక్టర్లు నరసింహారెడ్డి, ఖదీర్, రాజశేఖర్ రెడ్డి, సీనియర్ నాయకులు, పంచాయతీ కార్యదర్శులు, మాజీ ప్రజాప్రతినిధులు,అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



## హోంగార్డ్ కుటుంబానికి అండగా ఉంటాం : ఎస్‌పి


**ప్రజాపక్షం/వికారాబాద్:** హోంగార్డ్ శ్రీనివాస్ కుటంబానికి అండగా ఉంటాం అని జిల్లా ఎస్‌పి నారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎంటి సెక్షన్‌లో విధులు నిర్వహిస్తు అకాలమరణం చెందిన హోంగార్డ్ శ్రీనివాస కుటుంబ సభ్యులను జిల్లా ఎస్‌పి పరామర్శించి అండగా ఉంటామని పూర్తి భరోసా కల్పించారు. శ్రీనివాస్ హఠాత్ మరణం తమను తీవ్రంగా కలచివేసిందని ఇది పోలీస్‌శాఖకు కూడా తీరనిలోటు అని ఎస్‌పి అన్నారు. మృతుని మరణానికి సంబంధించిన ఉన్న అనుమానాలు ఆందోళనలను దృష్టిలో ఉంచుకుని, విధులు నిర్వహిస్తున్న ప్రాంతంలో కరెంట్ షాక్‌కు గురై మరణించారా లేదా మరేదైనా ఇతర కారణంతో మృతి చెందారా అనే విషయంపై దర్యాప్తు జరుగుతుంది అని ఎస్‌పి అన్నారు. ఈ కేసులో వాస్తవాలు తెలుకోవడానికి శాస్త్రీయ పద్ధతి అయిన పోస్టుమార్టం తుది నివేదిక వచ్చే వరకు ఎలాంటి ముందస్తు నిర్ధారణకు రావద్దని ఎస్‌పి తెలిపారు. మీ కుటుంబానికి పోలీసు శాఖ తరపున అండగా ఉంటామని కేసు దర్యాప్తు విషయంలో, శాఖపరమైన సాధ్యమైన అన్ని విధాలా సహాయం అందించడానికి తాము అందుబాటులో ఉంటామని ఎస్‌పి వ్యక్తిగతంగా హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పి రాములు నాయక్, డిఎస్‌పి శ్రీనివాస్ రెడ్డి, సిఐ భీంకుమార్ ఉన్నారు. అనంతరం శ్రీనివాస్ భౌతికకాయానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులుకు అప్పగించారు.

# రేషన్ దుకాణాల డీలర్ల నియామకాలు



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** మేడ్చల్ జిల్లాలోని కీసర రెవెన్యూ డివిజన్ పరిధిలో రిజర్వ్ అయి ఖాళీగా ఉన్న 15 దుకాణాల డీలర్లను నియామకాలు చేపడుతున్నామని కీసర ఆర్‌డివో పేర్కొన్నారు. ఆసక్తితో పాటు అర్హత కలిగిన అభ్యర్థులు తమ కుల, ప్రాంతీయ, విద్యార్హత ధృవీకరణ పత్రాలను అటెస్టెడ్ చేయించుకొని ధరఖాస్తు ఫారాలతో జతపరచి ఈ నెల 15 సాయంత్రం 5 గంటల నుండి తమ కార్యాలయంలో సమర్పించాలన్నారు. మేడ్చల్ మండలంలోని పూడూర్, శ్రీరంగవరం, సుతారిగూడ, కీసర మండలంలోని దమ్మాయిగూడ ఓల్డ్ విలేజి, జర్నలిస్టు కాలనీ, విఆర్‌ఆర్ కాలనీ, భాగ్యనగర్ కాలనీ, వాయుశక్తి కాలనీ, రాజ్‌సుఖ్‌నగర్, అహ్మద్‌గూడ, రాంపల్లి, ఘట్‌కేసర్ మండలంలోని ఘట్‌కేసర్ 1, ప్రతాపసింగారం, మేడిపల్లి మండలంలోని మారుతీనగర్ కాలనీ, అంబేద్కర్ నగర్ కాలనీ, కాప్రా మండలంలోని 2 బిహెచ్‌కె కాలనీ, శామీర్‌పేట మండలంలోని తూంకుంట ప్రాంతాల్లోని రేషన్ దుకాణాల నియామకాలు జరుగుతున్నాయన్నారు. ఐదేళ్ల కాలపరిమితికి గాను రేషన్ దుకాణాలు నడిపించేందుకు కేటాయించిన సరుకుల సరఫరా చేసేందుకు ఆర్థిక స్థోమత, ఎలాంటి క్రిమినల్ కేసులు లేకపోవటం, సంపూర్ణ ఆరోగ్య వంతుడై స్వయంగా రేషన్ దుకాణాన్ని నడిపించగలిగే సామర్థ్యత కలిగి ఉండటం, కనీస పదో తరగతి ఉత్తీర్ణత సాధించి ఉడటం, దుకాణ పరిధి ప్రాంత నివాసి అయి ఉండ టం, 18 నుండి 40 ఏళ్ల వయస్సు ఉండటం, మరే ఇతర వ్యాపారాలతో ప్రత్యక్ష సంబంధాలు లేకపోవటం, ఎలాంటి ప్రజా ప్రతినిధిగా ఉండకపోవటం అర్హతలుగా ఉంటాయన్నారు.

## తహసీల్దార్‌ను సన్మానించిన మాజీ సర్పంచ్



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మూడు చింతలపల్లి మండల రెవెన్యూ తహశీల్దార్‌ను మాజి సర్పంచ్ జాం రవి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా విచ్చేసిన తహశీల్దార్ సుచరితను మాజీ సర్పంచ్ జాం రవి, మాజీ ఎంపిటిసి పారుపల్లి నాగరాజులు శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతుల సమస్యలను పరిష్కరించుటకు కృషి చేయాలని తహశీల్దార్‌ను కోరామని చెప్పారు. మూడుచింతలపల్లిలోని సర్వే నెంబర్‌లు 22, 30లలో రైతుల భూములను ఆన్‌లైన్‌లో నమోదుచేసి పట్టాదార్ పాసుపుస్తకాలు ఇవ్వాలని అన్నారు. స్పందించిన తహసీల్దార్ రైతుల సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకట నర్సింహారెడ్డి, మురళీగౌడ్, గిరి, మాజి వార్డు సభ్యులు వేణుగోపాల్‌రావు, బురుగు యాదగిరి, గ్రామస్థులు సదాశివరెడ్డి, గంగిశెట్టి గణేష్‌బాబు, శ్రీశైలం, నర్సింలు, సర్వన్, బాబు, బాలమల్లేష్, రాంపల్లి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ

## తొలి కప్ వేటలో లక్నో.. ఆసీస్ లెజెండ్‌కు కీలక బాధ్యతలు

తొలి కప్ వేటలో లక్నో.. ఆసీస్ లెజెండ్‌కు కీలక బాధ్యతలు..! ఐపిఎల్ పంతొమ్మిదో సీజన్ కోసం ఆటగాళ్లను అట్టిపెట్టుకునే గడువు సమీపిస్తున్న వేళ లక్నో సూపర్ జెయింట్స్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇటీవలే న్యూజిలాండ్ దిగ్గజం కేన్ విలియమ్సన్‌ను వ్యూహాత్మక సలహాదారుగా తీసుకున్న లక్నో.. ఈసారి ఆస్ట్రేలియా దిగ్గజానికి పెద్ద బాధ్యతలు అప్పగించింది. పొట్టి ఫార్మాట్‌లో, ఐపిఎల్‌లో కోచ్‌గా సుదీర్ఘ అనుభవం కలిగిన టామ్ మూడీని తమ గ్లోబల్ డైరెక్టర్ ఆఫ్ క్రికెట్‌గా నియమించింది లక్నో. ఈ విషయాన్ని మంగళవారం ఫ్రాంచైజీ అధికారికంగా ఎక్స్ వేదికగా వెల్లడించింది. ఈ హింటిచ్చినట్లుగానే టామ్ మూడీని తమ గ్లోబల్ డైరెక్టర్ ఆఫ్ క్రికెట్‌గా నియమించుకుంది లక్నో ఫ్రాంచైజీ. 'ఐపిఎల్‌లో సుదీర్ఘ అనుభవం, దూరదృష్టి, సమర్థ నాయకత్వం .. ఈ లక్షణాలన్నీ కలగలిసిన టామ్ మూడీకి లక్నో సూపర్ జెయింట్స్ ప్రపంచంలోకి స్వాగతం. ఇకపై అతడు వ్యూహాత్మక నిర్ణయాలు, ఆటగాళ్ల వేలం, గ్లోబల్ టాలెంట్ స్కౌటింగ్, ప్రతిభావంతులను వెలికితీయడం వంటి కీలక బాధ్యతల్ని చూసుకోనున్నాడు' అని పోస్ట్‌లో పేర్కొంది. 19వ సీజన్ కోసం క్రికెటర్లను అట్టిపెట్టుకునేందుకు నవంబర్ 15 చివరి తేదీ. సో.. ఇప్పుడు మూడీ ముందున్న పెద్ద టాస్క్.. ఎవరిని వదిలేయాలి? డిసెంబర్‌లో జరుగబోయే వేలంలో ఎవరిని కొనాలి? అనే విషయాలపై కసరత్తు చేయడమే.

**ఒకేరకమైన క్రికెట్ ఫిలాసఫీ**

తనకు లక్నో ఫ్రాంచైజీ పెద్ద బాధ్యతలు అప్పగించడం పట్ల మూడీ సంతోషం వ్యక్తం చేశాడు. 'లక్నో సూపర్ జెయింట్స్ గ్లోబల్ డైరెక్టర్ ఆఫ్ క్రికెట్ పదవిని గొప్ప గౌరవంగా భావిస్తున్నా. సంజీవ్ గోయెంకాతో సానుకూల చర్చలు ముగిసిన అనంతరం ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని అనుకుంటున్నా. ఫ్రాంచైజీ జట్లకు ఒకేరకమైన క్రికెట్ ఫిలాసఫీని అలవాటు చేయాలనుకుంటున్నా. ఆటగాళ్ల గొప్ప ప్రదర్శన చేసేలా చూడడంతో పాటు విజయపరంపరను కొనసాగించేలా ప్రణాళికలు వేస్తాను. కెప్టెన్, కోచ్‌లు, మేనేజ్‌మెంట్‌తో కలిసి పనిచేసేందుకు ఆతృతగా ఉన్నాను' అని మూడీ తెలిపాడు.

## తండ్రి స్ఫూర్తితో ఒక్కో అడుగు..

### అండర్-19 వన్డే ఛాలెంజర్ ట్రోఫీలో ద్రవిడ్ చిన్నబ్బాయి



భారత క్రికెట్ దిగ్గజం రాహుల్ ద్రవిడ్ వారసులు క్రికెట్‌లో దూసుకొస్తున్నారు. పెద్దబ్బాయి సమిత్ ద్రవిడ్ ఇప్పటికే జూనియర్ స్థాయిలో సత్తా చాటుతుండగా.. చిన్న కుమారుడు అన్వయ్ ద్రవిడ్ సైతం నిలకడగా రాణిస్తూ సెలెక్టర్ల దృష్టిలో పడ్డాడు. టాపార్డర్ బ్యాటర్, వికెట్ కీపర్ అయిన అతడు అండర్-19 వన్డే ఛాలెంజర్ ట్రోఫీ స్క్వాడ్‌కు ఎంపికయ్యాడు. ఈ ట్రోఫీలో అన్వయ్ టీమ్ సీకి ప్రాతినిధ్యం వహించనున్నాడు. బుధవారం హైదరాబాద్ వేదికగా 'గ్లోబల్ ఛాలెంజర్ ట్రోఫీ' ప్రారంభం కానుంది. ఈ ట్రోఫీలో గనుక అన్వయ్ చెలరేగి ఆడితే అండర్ 19 జట్టులోకి రావడం ఖాయం. 'హైదరాబాద్ వేదికగా ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ పురుషుల అండర్-19 వన్డే ఛాలెంజర్ ట్రోఫీ జరుగనుంది. ఈ ట్రోఫీ కోసం జూనియర్ సెలెక్టర్లు నాలుగు జట్లకు ప్రతిభావంతులను ఎంపిక చేశారు. నవంబర్ 5 నుంచి టోర్నీ ప్రారంభం కానుంది. ఏడురోజుల పాటు సాగే ఈ ట్రోఫీ నవంబర్ 11న ముగియనుంది' అని బిసిసిఐ ఒక ప్రకటనలో తెలిపింది.

**ఆరు మ్యాచుల్లో 91.80 సగటు**

'ది వాల్', 'మిస్టర్ డిపెండబుల్'గా భారత క్రికెట్‌కు విశేష సేవలందించిన రాహుల్ ద్రవిడ్ లక్షణాలను పుణికిపుచ్చుకున్నారు అతడి కుమారులు. తండ్రి స్ఫూర్తితో క్రికెట్‌ను కెరీర్‌గా ఎంచుకున్న సమిత్ , అన్వయ్ ఆ దిశగా ఒక్కో అడుగు వేస్తున్నారు. కర్నాటక క్రికెట్‌లో సంచలనంగా ప్రశంసలు అందుకుంటున్న తన్వయ్.. విజయ్ మర్చంట్ ట్రోఫీలో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఈ ట్రోఫీలో అతడు ఆరు మ్యాచుల్లో 91.80 సగటుతో మూడు సెంచరీలతో కలిపి 459 పరుగులు సాధించాడు. అంతేకాదు అండర్ 19 వన్డే టోర్నమెంట్‌లో కర్నాటకకు అన్వయ్ సారథ్యం వహించాడు కూడా. అతడి సోదరుడు సమిత్ ఈమధ్యే ముగిసిన మహారాజా టీ20 ట్రోఫీలో మెరిశాడు.

**టీమ్ సీ స్క్వాడ్ :** అరోన్ జార్జ్(కెప్టెన్), ఆర్యన్ యాదవ్(వైస్ కెప్టెన్), అంకిత్ ఛటర్జీ, మనికాంత్ శివానంద్, రాహుల్ కుమార్, యశ్ కస్వంకర్, అన్వయ్ ద్రవిడ్(వికెట్ కీపర్), యువ్‌రాజ్ గోహిల్(వికెట్ కీపర్), ఖిలాన్ పటేల్, కనిష్క్ చౌహన్, ఆయుష్ శుక్లా, హెనిల్ పటేల్, లక్ష్మణ్ ప్రుథి, రోహిత్ కుమార్ దాస్, మోహిత్ ఉల్వా.

## మైదానంలో విషాదం..

### మ్యాచ్ జరుగుతుండగానే ప్రాణాలు విడిచిన కోచ్


Zizovic Died after collapsing during match

ఫుట్‌బాల్ మైదానంలో విషాదం నెలకొంది. సెర్బియా దేశానికి చెందిన ఫుట్‌బాల్ కోచ్ మ్లాదెన్ జిజోవిక్ మ్యాచ్ సమయంలో మరణించాడు. సూపర్ లిగా మ్యాచ్ జరుగుతుండగా.. జిజోవిక్ ఉన్నచోటనే కుప్పకూలాడు. వెంటనే సిబ్బంది అతడిని ఆస్పత్రికి తరలించినా అప్పటికే చనిపోయాడని వైద్యులు తెలిపారు. దాంతో.. అప్పటివరకూ తమతో మాట్లాడుతూ.. ఉత్సాహపరుస్తూ సందడి చేసిన కోచ్ ఇక లేరనే వార్తను ఆటగాళ్లు జీర్ణించుకోలేకపోతున్నారు. సెర్బియాలోని రడ్నిక్ 1923 అనే క్లబ్ జట్టుకు కోచ్‌గా పనిచేస్తున్నాడు మ్లాడెన్ జిజోవిక్. సోమవారం సెర్బియా సూపర్ లిగాలో మ్లాడొస్ట్ లుకానితో మ్యాచ్ జరుగుతోంది. ఆట మొదలైన 22వ నిమిషంలో జిజోవిక్ ఉన్నట్టుండి మైదానంలో కుప్పకూలాడు. అతడలా కిందపడిపోవడం గమనించిన సహచరులు మైదానంలోనే చికిత్స అందించారు. ఆ తర్వాత అతడిని సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. జజోవిక్‌ను హాస్పిటల్ తీసకెళ్లిన తర్వాత మ్యాచ్‌ను యథావిధిగా కొనసాగించారు. అయితే.. అతడు మరణించిన వార్త తెలియగానే షాక్‌కు గురైన ఇరుజట్ల ఆటగాళ్లు మ్యాచ్ రద్దు చేసుకున్నారు. జజోవిక్ మరణవార్తను ఎక్స్ వేదికగా పంచుకుంది క్లబ్. అందులో.. 'మనసు నిండా బాధాతో అభిమానులు, క్రీడాకారులకు హెడ్‌కోచ్ మ్లాడెన్ జజోవిక్ చనిపోయారనే వార్తను తెలియజేస్తున్నాం. ఆయన సోమవారం రాత్రి మ్యాచ్ జరుగుతుండగా మరణించారు. మా క్లబ్ గొప్ప కోచ్‌ను కోల్పోయింది. అంతకంటే ముఖ్యంగా మంచి మనిషి, స్నేహితుడు, క్రీడల్ని ప్రేమించే వ్యక్తి మనకు దూరమయ్యాడు. ఆయన తన నైపుణ్యం, విలువలతో మా అందరి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు' అని రాడ్నిక్ 1923 క్లబ్ తమ పోస్ట్‌లో పేర్కొంది. 44 ఏళ్లున్న జజోవిక్ అకస్మిక మృతికి గుండెపోటు కారణమని తెలుస్తోంది.

# మహిళ


## ఫోకస్

## దెబ్బతింటున్న హార్మోన్ల సమతుల్యత



ఇటీవల కాలంలో హార్మోన్ల సమతుల్యం దెబ్బతింటున్నది. ఈ కారణంగా మహిళలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. మన శరీరంలో హార్మోన్లు అనే రసాయన పదార్థాలు ఉంటాయి. ఇవి మెదడు, థైరాయిడ్, అడ్రినల్, ప్యాంక్రియాస్, అండాశయాలు వంటి గ్రంథుల ద్వారా ఉత్పత్తి అవుతాయి. ఈ హార్మోన్లు శరీరంలోని పీరియడ్స్, బరువు నియంత్రణ, నిద్ర, భావోద్వేగాలు, చర్మ ఆరోగ్యం, జుట్టు బలంగా ఉండడం, శక్తి స్థాయి వంటి అనేక పనులను నియంత్రిస్తాయి. ఈ హార్మోన్లు సమతుల్యంగా లేదా సమపాళ్లలో ఉంటే ఆరోగ్యం బాగా ఉంటుంది. ఒకవేళ ఇవి సంతులనం కోల్పోతే, ఆ పరిస్థితిని హార్మోన్ల అసమతుల్యతగా పేర్కొంటారు. హార్మోన్లు సమతుల్యతను కోల్పోవడానికి అనేక కారణాలు ఉన్నాయి. వీటిలో ఒత్తిడి ప్రధానం. దీర్ఘకాలిక ఒత్తిడి హార్మోన్ ఉత్పత్తిని ప్రభావితం చేస్తుంది. తగినంత నిద్ర లేకపోవడం, అధిక చక్కెర, ఫాస్ట్ ఫుడ్, కేఫైన్ వంటి అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, వ్యాయామం లేకపోవడం లేదాఅతిగా వ్యాయామం చేయడం, పర్యావరణ కాలుష్యం, రసాయనాల ప్రభావం, థైరాయిడ్ సమస్యలు, పోలిసైస్టిక్ ఓవరీ సిండ్రోమ్ (పిసిఓఎస్), మెనోపాజ్ వంటి పలు అంశాలు మహిళల్లో హార్మోన్ల సమతుల్యతను దెబ్బతీస్తాయి. శరీరంలో కనిపించే పలు లక్షణాలతో హార్మోన్ల సమతుల్యం దెబ్బతిన్నదని గుర్తించవచ్చు. పీరియడ్స్ అసమయంగా రావడం లేదా ఆగిపోవడం, అధికంగా మొటిమలు, ముఖం లేదా శరీరంపై అనవసరమైన రోమాలు పెరగడం, హఠాత్తుగా బరువు పెరగడం లేదా తగ్గడం, అలసట, నిద్రలేమి, క్షణక్షణానికీ మూడ్ మారిపోవడం (దీనినే మూడ్ స్వింగ్ అంటారు), ఆందోళన, డిప్రెషన్, జుట్టు రాలడం లేదా చర్మం పొడిగా మారడం, గర్భధారణలో సమస్యలు రావడం వంటి లక్షణాలు కనిపిస్తే హార్మోన్లు సరైన మోతాదుల్లో లేవని అర్థం చేసుకోవాలి. ఈ సమస్య ఎదురైనప్పుడు తప్పనిసరిగా నివారణ చర్యలు తీసుకోవాలి. పండ్లు, కూరగాయలు, ప్రోటీన్స్ ఉన్న సమతుల ఆహారం తీసుకోవాలి. ప్రతిరోజూ వ్యాయామం తప్పనిసరి. యోగా, నడక లేదా తేలికపాటి వ్యాయామం చేయాలి. తగినంత నిద్ర కూడా అవసరమే. గంటకు 7 నుంచి 8 గంటలు నిద్రపోవాలి. ధ్యానం, శ్వాసాభ్యాసం వంటి పద్ధతుతో ఒత్తిడిని తగ్గించుకోవాలి. జంక్ ఫుడ్, అధిక చక్కెర, సోడా పానీయాలు పూర్తిగా మానివేస్తే మంచిది. కనీసం వాటి వాడకాన్ని గణనీయంగా తగ్గించాలి. అన్నిటికంటే ముఖ్యంగా ఎప్పటికప్పుడు, థైరాయిడ్, పిసిఓఎస్, హార్మోన్ టెస్టులు చేయించుకోవాలి. సొంత వైద్యం అసలు పనికిరాదు. వైద్య నిపుణుల సూచనలు పాటించాలి. వారు సూచించిన మందులు లేదా హార్మోన్ సప్లిమెంట్స్‌ను మాత్రమే వాడాలి. మార్కెట్లో లభిస్తున్నాయి కదా అని ఇష్టానుసారంగా సప్లిమెంట్లను వాడడం మంచిది కాదు. అందరి శరీర తత్వం ఒకటిగా ఉండదు. అందరికీ ఒకే విధానం సరిపడదు. ఏ రకంగా చూసినా, హార్మోన్ల అసమతుల్యతను నిర్లక్ష్యం చేయకూడదు. ఇది ప్రారంభ దశలో గుర్తిస్తే సులభంగా నియంత్రించవచ్చు. ఆరోగ్యకరమైన జీవనశైలి, సమతుల ఆహారం, మానసిక ప్రశాంతత అనేవి ప్రధాన పరిష్కారాలు. వైద్య పరీక్షలు, నిపుణుల సూచనలు శిరోధార్యాలు.

## మార్గదర్శకురాలు బ్యూవోయిర్



ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో దేశాల్లో మహిళల విద్యకు ప్రాధాన్యం ఇస్తున్నారంటే, అందుకు సైమోన్ డి బ్యూవోయిర్ వంటి ప్రతిభావంతులే కారణం. ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో 1908 జనవరి 9న జన్మించిన బ్యూవోయిర్ 1928లో, కేవలం 20 సంవత్సరాల వయసులోనే తత్వశాస్త్రంలో పట్టా తీసుకోవడం అప్పట్లో సంచలనం రేపింది. ఆ రోజుల్లో మహిళలు అత్యధికంగా వివాహ సంబంధాలకు పరిమితం కావాల్సి వచ్చేది. కానీ, బ్యూవోయిర్ నాటి సంప్రదాయాలను ఎదిరించింది. మహిళలు వంటింటికే అంకితం కావాలనే భావనలను ధిక్కరించింది. తన కలలు నెరవేర్చుకోవాలంటే, చదువుకోవడమే సరైన మార్గమని నమ్మించింది. అసాధారణ ప్రతిభ, అంతకు మించిన అస్తిత్వవాద భావన ఆమె సొంతం. తన జీవిత భాగస్వామి, ప్రఖ్యాత తత్వవేత్త, రచయిత జీన్‌పాల్ సార్త్రేతో కలిసి అనేక చర్చావేదికలపై కనిపించింది. వాదనల్లో పాల్గొంది. 1949లో ప్రచురితమైన 'ది సెకండ్ సెక్స్' పుస్తకం ప్రకంపనలు సృష్టించింది. 'స్త్రీగా జన్మించరు.. అస్త్రీగా మారుతారు' అనే అత్యంత ప్రసిద్ధమైన కొటేషన్‌తో తన అస్తిత్వాన్ని చాటి చెప్పింది. సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలకు, వారి దుస్థితికి, అత్యంత హీనమైన స్థానానికి సమాజమే కారణమన్నది ఆమె భావన. ఈ అభిప్రాయాన్ని ఆమె విస్తృతంగా ప్రచారం చేసింది. పుట్టినప్పుడు స్త్రీపురుషులకు తేడాలేదని, అయితే, మహిళల దుస్థితిని సమాజమే శాసిస్తున్నదని ఆమె చేసిన వాదన ఇప్పటికీ నిత్యనూతనమే. ఆమె సిద్ధాంతం ఆధునిక స్త్రీవాదానికి పునాదిని వేసింది. ఆమె స్వేచ్ఛ కోసం, ఇతర మహిళల స్వేచ్ఛ కోసం నిరంతరం పోరాడింది. ఆమె తత్వవేత్త మాత్రమే కాదు. వ్యాసకర్త... రచయిత్రి.. ఉపన్యాసకురాలు. ప్రతి ఒక్కరూ తమతమ జీవితాలను సొంతంగానే నిర్మించుకోవాలని ఆమె కోరుకుంది. మహిళలు సంప్రదాయబద్ధతను దాటి, నిజాయితీగా బతికే ఉద్యమాన్ని ఆమె తన రచనల ద్వారా ప్రేరేపించింది. అంతేగాక, ప్రత్యక్షంగానే ఉద్యమాలను నడిపించింది. 'సమాజం ఏ జీవితం అప్పగిస్తుందో దాన్ని ఒప్పుకోకండి, సొంత మార్గాన్ని ఎంచుకోండి. జీవితాన్ని స్ఫూర్తిమంతంగా తీర్చిదిద్దుకోండి. సవాళ్లను అధిగమించండి' అని 1986 ఆగస్టు 14వ తేదీన తుదిశ్వాస విడిచే కొద్ది రోజుల ముందు ఆమె చేసిన ప్రకటన ఇప్పటికీ ప్రపంచమంతా మారుమోగుతునే ఉంది. సామాజిక కట్టుబాట్లు, మత విశ్వాసాలకు కట్టుబడి, జీవితాలను నాశనం చేసుకుంటున్న లక్షలాది మంది మహిళలకు ఆమె సిద్ధాంతం ప్రేరణ కావాలి.

## ఎకరాకు ఏడు క్వింటాళ్ల పత్తి పరిమితిని ఎత్తేయాలి : నెల్లికంటి సత్యం




**ప్రజాపక్షం/నల్లగొండ :** మొంథా తుఫాన్ ప్రభావంతో పత్తి,వరి పంటలు తీవ్రంగా నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం ప్రభుత్వాలను కోరారు. సిపిఐ జిల్లా కార్యాలయం మగ్దూమ్ భవన్ లో మంగళవారం జరిగిన నల్లగొండ నియోజకవర్గ మండల కార్యవర్గ సభ్యుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. తడిసినటువంటి వరిధాన్యం,పత్తిని షరతులు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతోనే కొనుగోలు చేయాలని అధికారులను కోరారు. వ్యవసాయ అధికారులు దెబ్బతిన్న పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వారికి ఎకరాకు రూ.40వేలు పత్తికి ఎకరాకు రూ. 60 వేలు చొప్పున పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.కపాస్ కిసాన్ యాప్‌లో ఎకరాకు ఏడు క్వింటాల పరిమితిని ఎత్తివేసి యధావిధిగా12 క్వింటాలు పత్తిని దిగుమతి చేసుకునేలా సడలింపు చేయాలని కేంద్ర ప్ర భుత్వానికి సూచించారు. డిసెంబర్ 26న ఖమ్మం పట్టణంలో నిర్వహించే భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)శాతాబ్ది ఉత్సవ ముగింపు బహిరంగ సభకు వేలాదిగా తరలిరవాలని పిలుపునిచ్చారు. బహిరంగ సభ ప్రచారజాత ఈ నెల 17న నల్లగొండ జిల్లా డిండి మండల కేంద్రంలో చేరుకొని జిల్లాలో దేవరకొండ,మునుగోడు,నకిరేకల్,నల్లగొండ,మిర్యాలగూడ,నియోజకవర్గాల మీదుగా సాగుతుందని, జాతాను జయప్రదం చేయాలని కోరారు. సమావేశానికి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బొల్గూరి నరసింహ అధ్యక్షత వహించగా జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి,నల్లగొండ పట్టణ కార్యదర్శి కెవిఎస్ రెడ్డి,సహాయ కార్యదర్శి వి.లెనిన్,కనగల్ మండల కార్యదర్శి గంట సత్యనారాయణ,సహాయ కార్యదర్శి దొటి పండరి,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.రామ్ కోటి,నాయకులు జిల్లా యాదగిరి,జోగు సురేందర్,కట్ట వెంకన్న,కట్ట యాదయ్య,ముండ్ల ముత్యాలు, యూసుఫ్, మదర్, కౌసల్య, విజయ, నాగమ్మ, లక్ష్మి, నందన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## పత్తి కొనుగోళ్లపై ఆంక్షలొద్దు

### సిపిఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంత్‌రావు



**ప్రజాపక్షం/ఏన్కూరు :** తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సిపిఐ జాతీయ సమితి సభ్యు లు భాగం హేమంతరావు కోరారు. మంగళవారం ఏన్కూర్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాలతో పత్తి పంటలకు పూర్తిగా నష్టం జరిగిందని, మార్కెట్లో రైతులు అమ్మే పత్తి విషయంలో అనేక ఆంక్షలు విధిస్తున్నారని, 11 క్వింటళ్ల నుండి 7 క్వింటళ్ల పత్తి వరకే అమ్మాలనే నిబంధనను ఎత్తివేయాలన్నారు. భారత కమ్యూనిస్ట్ పార్టీ 100 సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంగా డిసెంబర్‌లో ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, మండల కార్యదర్శి జాగర్లమూడి రంజిత్ కుమార్, జిల్లా సమితి సబ్యులు అమారనేని వీరభద్రం, మండల సహాయ కార్యదర్శి బాణోత్ రాంబాబు, మదినేని వెంకన్న, బొగినబోయిన నాగేశ్వరావు పాల్గొన్నారు.

## రాజకీయ ముఖచిత్రాన్ని మార్చనున్న బిహార్ ఎన్నికలు

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

### సిపిఐ శతాబ్ధి ఉత్సవాలను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సిపిఐ శతాబ్ధి ఉత్సవాలను జయప్రదంచేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చాడా వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం సిపిఐ పెద్దపల్లి జిల్లా కౌన్సిల్ సమావేశం కామ్రేడ్ కే కనకరాజు అధ్యక్షతన స్థానిక భాస్కరరావు భవన్లో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా చాడ వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ మాట్లాడారు. పేద ప్రజల కోసం స్వాతంత్ర సాధన కోసం పోరాడిన భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) అని,ఈ సంవత్సరం డిసెంబర్ 26న శత వసంతాలు నిండుతున్న సందర్భంగా ఖమ్మంలో ఐదు లక్షల మందితో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయబోతున్నామన్నారు. శతాబ్ది ఉత్సవాల జీపూ జాత ఆదిలాబాద్ జోడేఘాట్ నుండి ప్రారంభమై రాష్ట్రమంతా నిర్వహిస్తామని, నవంబర్ 16న గోదావరిఖని, పెద్దపల్లి, సుల్తానాబాద్‌లకు చేరుకుంటుందన్నారు.ప్రజాసంఘాల నాయకులు,పార్టీసానుభూతిపరులు, కార్మికులు జాతాను విజయవంతం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకుఊడిగం చేస్తున్న మండిపడ్డారు. ప్రభుత్వరంగ సంస్థల్లో నిధులను అదానీ , అంబానీలకు ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ల జేబు సంస్థలుగా మారుస్తున్న కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. బీహార్ ఎన్నికలు దేశరాజకీయచిత్రాన్నిమారుస్తాయని అభిప్రాయపడ్డారు. కరీంనగర్, పెద్దపల్లి సిపిఐ జిల్లా కార్యదర్శులు తాంద్ర సదానందం,పంజాలశ్రీనివాస్,రాష్ట్ర సమితి సభ్యులు గౌతమ్ గోవర్ధన్, గోష్కమోహన్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కడారి సునీల్, తాళ్లపల్లి మల్లయ్య, మద్దె ఎల్లయ్య, మార్కపురి సూర్య, తాళ్లపల్లి లక్ష్మణ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు వైవి రావు, మాటేటి శంకర్, రామచందర్,జిగురు రవీందర్ , ఆరెపల్లి మానస్ కుమార్, బాలసాని లెనిన్, రేణికుంట్ల ప్రీతం, కల్లెపల్లి నవీన్,చంద్రశేఖర్, రంగు శ్రీనివాస్, తౌడుపునూరి రమేష్ కుమార్ పాల్గొన్నారు.

## రెండు రోజుల్లో ఫీజు బకాయి విడుదల

### ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి డిమాండ్




**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం విద్యార్థుల ఫీజు రీయంబర్స్‌మెంట్‌ను విడుదల చేయకుండా ప్రభుత్వం చెప్పే మాటలకి, చేతలకి పొంతనలేదనిప్రజాపాలన అంటే కళాశాలలు బంద్ అనా? విద్యార్థులు ఇంటి వద్ద ఉండడమా? ఫీజు బకాయిలు విడుదల చేయకపోతే సిఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలని, ప్రభుత్వం రెండు రోజుల్లో ఫీజు బకాయిలు విడుదల చేయకపోతేమంత్రులు, ఎమ్మెల్యేల ఇండ్లు ముట్టడిస్తామని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి అన్నారు. మంగళవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా 14వ మహాసభను సుబోధ్ అధ్యక్షతన జిల్లా కేంద్రంలోని ప్రెస్ భవన్‌లో నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ పతాకాన్ని కసిరెడ్డి మణికంఠ రెడ్డిఎగురవేశారు.ఆయనమాట్లాడుతూకాంగ్రెస్ ప్రభుత్వం 23 నెలల పాలనలో అందాల పోటీలకు ఇచ్చిన నిధులు విద్యార్థుల చదువులకై ఫీజు బకాయిలు ఎందుకు విడుదల చేయడం లేదని ప్రశ్నించారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయి 8 వేల కోట్లు విడుదలకు నిధులులేవు కానీ హెలికాప్టర్లలో మంత్రులు దుబారాగా తిరగడానికి, అందాల పోటీలకు నిదులు వస్తున్నాయని ప్రశ్నించారు. రాష్ట్రంలోవిద్యారంగానికిప్రత్యేక మంత్రి లేకపోవడం ద్వారా నే సమస్యలు పేరుకుపోయాయని, ప్రభుత్వానికి మద్యం ద్వారా వచ్చే ఆదాయంపై ఉన్న శ్రద్ధ వి ద్యార్థుల సంక్షేమంపై, ప్రత్యేక మంత్రి నియామకంపై లేదన్నారు.రెండురోజుల్లో విద్యార్థుల ఫీజు బకాయిలు విడుదల చేయకపోతే మిలిటెంట్ ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి సుదాకర్, ఏఐఎస్ఎఫ్ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి రఘురాం, జిల్లా నాయకులు భరత్, కార్తీక్, కుషాల్, చోటు, అబ్దుల్, శశికాంత్, నవీన్, కృష్ణ పాల్గొన్నారు.



## చరిత్ర సృష్టించిన సిపిఐ : కలవేన శంకర్

**ప్రజాపక్షం / రెబ్బెన/ ఆసిఫాబాద్ :** భారత గడ్డపై వందేళ్లు పూర్తి చేసుకుంటున్న భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) చరిత్రలో అనేక పోరాటాలకు, త్యాగాలకు నెలవు అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ ఉద్ఘాటించారు. దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని తొలుత గర్జించిన ఏకైక పార్టీ సిపిఐ అని ఆయన స్పష్టం చేశారు. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సమితి సమావేశం గోలేటి టౌన్ లోని కామ్రేడ్ మహేంద్ర భవన్ లో మంగళవారం జరిగింది. ఎఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి ఎస్ తిరుపతి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగాకలవేన శంకర్ మాట్లాడారు. దేశ రాజకీయ చరిత్రలో సిపిఐ తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందన్నారు. సిపిఐ సీనియర్ నాయకుడు కామ్రేడ్ బద్రి సత్యనారాయణ, మంచిర్యాల జిల్లా కార్యదర్శి కామ్రేడ్ రామడుగు లక్ష్మన్, సిపిఐ జిల్లా కార్యదర్శి బద్రి సాయి కుమార్, జిల్లా సమితి సభ్యులు ఆత్మకూరి చిరంజీవి, భోగే ఉపేందర్, రాయిల్లా నర్సయ్య, ఆత్రం సీతారాం, గోగుల మల్లికార్జున్, తుంరం అంబా రావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల పట్ల ప్రభుత్వం వివక్ష



### ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి కార్యాలయం ముట్టడి



**ప్రజాపక్షం/ ఖమ్మంఅర్బన్ :** ప్రభుత్వం విద్యార్థుల బోధన రుసుములు, ఉపకార వేతనాలను తక్షణమే మంజూరు చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఏఐఎస్ఎఫ్ ఖమ్మంజిల్లాసమితిఆధ్వర్యంలోపెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని ఖమ్మంలో ప్రదర్శన నిర్వహించి ఉప ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయ ముట్టడికి యత్నించారు. ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఆర్ కళాశాల నుంచి వేలాది మంది విద్యార్థులు ఉప ముఖ్యమంత్రి కార్యాలయ ముట్టడికి వెళ్తుండగా పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అక్కడేవిద్యార్థులు బైఠాయించి ఆందోళన నిర్వహించారు. ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ గత ఐదేండ్లుగా ఫీజు రీయంబర్స్‌మెంట్, ఉపకార వేతనాలను ప్రభుత్వం ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం మారినా పాలన మాత్రం మారలేదని, విద్యార్థుల పట్ల వివక్ష చూపిస్తున్నారన్నారు. ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు ఎనిమిది వేల కోట్ల రూపాయలకు పైగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఖమ్మం జిల్లా కేంద్రంగా విశ్వ విద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఫీజులు విడుదల చేయకపోవడంతో కళాశాల యాజమాన్యలు బంద్‌లు పాటిస్తున్నాయని దీనితో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. బకాయిలను విడుదల చేయాలని లేని పక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామన్నారు. జిల్లా అధ్యక్షులు మదుపల్లి లక్ష్మణ్, రాష్ట్ర సమితి సభ్యులు లోకేష్, జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ నాగులమీరా, మధు, శివ, వంశీ, మనోజ్, జిల్లా నాయకులు ఉస్మాన్, ఉపేందర్, గోపి, వెంకట్, నవీన్, చైతన్య పాల్గొన్నారు.

## అందని ద్రాక్షగా డబుల్‌బెడ్రూం ఇళ్లు

### సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** సిపిఐ శత జయంతి ఉత్సవాల సందర్భంగా నాయకుడు పంప్ జంక్షన్ గణపతి నగర్‌లో ఖిలా వరంగల్ మండల సమితి సమావేశం తాళ్లపల్లి జాన్‌పాల్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా మాట్లాడుతూ తెలంగాణ వచ్చినప్పటి నుండి పేద ప్రజలకు డబుల్ బెడ్రూం ఇండ్లు అందని ద్రాక్ష లాగా ఉన్నాయన్నారు. డబుల్ బెడ్రూం ఇండ్లను పంచకుంటే ఉద్యమం చేసి పేద ప్రజలకు పంచుతామని హెచ్చరించారు. సిపిఐ వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శులు పనాస ప్రసాద్, దండు లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు గన్నారపు రమేష్,సంగీ ఏలేందర్,మండలసహాయకార్యదర్శిఓర్సు రాజు, మండల కార్యవర్గ సభ్యులు ఎండి అక్బర్ పాషా, సుంకరి భవాని, యాకాంబ్ర చారి, నల్లతీగలకుమార్, జన్ను రాజు, గజవెల్లి చిరంజీవి, యాకూబ్, ఉప్పుల రవి, రాచర్ల రాజేందర్,వనం సౌందర్య, జెట్టి విజయలక్ష్మి , పద్మ కుమార్ పాల్గొన్నారు.



# స్థానికం REGIONAL NEWS

నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## పాల బిల్లులు చెల్లించాలని రైతుల ధర్నా

**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** పాల బిల్లులు ఇవ్వాలని రైతులు ధర్నా చేసిన సంఘటన మంగళవారం జిల్లా కేంద్రం శాంతినగర్ మదర్ డెయిరీలో చోటుచేసుకుంది. ఆత్మకూర్(ఎస్) మండల తుమ్మలపెన్‌పహాడ్‌కు చెందిన పది మంది రైతులు గత నాలుగు నెలలుగా పాల బిల్లులు ఇవ్వడం లేదని ఆరోపించారు. పదిహేను రోజులకు ఒకసారి ఇవ్వాల్సిన బిల్లులు నాలుగు నెలలైనా ఇవ్వడంలేదన్నారు. గ్రామంలో 42 మంది రైతులు గత ఇరవై సంవత్సరాలుగా పాలు పోస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే పాల బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ చైర్మన్ పడిమర్తి గంగయ్య, డైరెక్టర్లు సూరయ్య, బజారు, మాధవరెడ్డి, అంజయ్య, తిరుమలయ్య, చినరాములు, ఉప్పలయ్య, శ్రీను, ఉపేందర్ పాల్గొన్నారు.





## నిబంధనలను పాటించని స్కూల్ బస్సు డ్రైవర్లపై చర్యలు : డిఎస్‌పి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రోడ్డు భద్రత నియమాలను పాటించని ప్రైవేట్ స్కూల్ బస్సు డ్రైవర్లపై, యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ రాజశేఖర్‌రాజు హెచ్చరించారు. మంగళవారం డీఎస్పీ కార్యాలయంలో స్కూల్ బస్సు, ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్ విద్యార్థుల ప్రాణాల మీదకు తెచ్చేలా బస్సులను నడిపితే సహించబోమన్నారు. స్కూల్ బస్సులు ఫిట్నెస్ లేకపోతే యాజమాన్యాలపై చర్యలు ఉంటాయన్నారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణీకులను ఎక్కించినట్లయితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. డ్రైవర్లు సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపినా, డ్రంక్ అండ్ డ్రైవ్ చేసినా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. కార్యక్రమంలో సీఐలు నర్సయ్య, నాగభూషణరావు, పీఎన్‌డీ.ప్రసాద్, ఎస్ఐ రాంబాబు, పోలీస్ సిబ్బంది, స్కూల్ బస్సు, ఆటో డ్రైవర్లు ఉన్నారు.

## 4నెలలుగా వేతనాల్లేక విధులు నిర్వహిస్తున్నాం

### హాస్పిటల్ కార్మికుల పెండింగ్ జీతాలు ఇప్పించాలని ఎఐటియుసి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ సత్యంకు మెమోరండం

### కలెక్టర్‌తో ఫోన్లో మాట్లాడిన నెల్లికంటి సత్యం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** నల్లగొండ జిల్లా కేంద్ర ప్రభుత్వ హాస్పిటల్‌లో పనిచేస్తున్న శానిటేషన్ పేషెంట్ కేర్,సెక్యూరిటీ గార్డ్‌కార్మికులకు గత నాలుగు నెలల నుంచి వేతనాలు రావడంలేదని పెండింగ్ జీతాలు ఇప్పించాలని కోరుతూ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యంను ఎఐటియుసి ఆధ్వర్యంలోనల్లగొండలో మెమోరాండం అందజేశారు. వెంటనే స్పందించిన ఎంఎల్‌సి సత్యం కలెక్టర్‌తో ఫోన్లో మాట్లాడి వెంటనే జీతాలు ఇచ్చే ఏర్పాటు చేయమని కోరారు. హాస్పిటల్‌లో పనిచేసే వాళ్ళంతా నిరుపేద కుటుంబాల చెందిన పేద కార్మికులనీ నాలుగు నెలలుగా వేతనాలు రాకపోతే వాళ్ళ కుటుంబం ఏ విధంగా గడుస్తుందని వారు అన్నారు. అధికారులు వెంటనే కార్మికుల వేతనాలు చెల్లించాలని కోరారు.నాలుగు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని మంగళవారం కార్మికుల విధులు బహిష్కరించి హాస్పిటల్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ నాలుగు నెలలుగా కార్మికుల వేతనాలు లేకున్నా విధులు నిర్వహిస్తున్నారని ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదని కాంట్రాక్టర్ జీతాలు ఆపడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతున్న కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకుని ఏజెన్సీని బ్లాక్ లిస్టులో పెట్టాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.గత ఆరు నెలలుగా కార్మికులకు కాంట్రాక్టర్ పిఎఫ్ కూడా కట్టడం లేదని నేటికీ అకౌంట్ నెంబర్లు కూడా కార్మికులకు ఇవ్వలేదని ఆరోపించారు. శుక్రవారం వరకు జీతాలు చెల్లించకపోతే ఆందోళన మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో హాస్పిటల్ కాంటాక్ట్ వర్కర్స్ రవివర్మ, నాగబాబు, శివ,ప్రకాశ్,అనిత, ధనమ్మ, వంశీ, స్వాతి, రేణుక,రవళి,శశికల,అజీమా,శోభ,అరుణ,శైలజ,శ్రీకాంత్ పాల్గొన్నారు.



## జాతీయ రహదారికి మరమ్మతులు



ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం/హాలియా:** జాతీయ రహదారులా... మజాకా.. అనే కథనానికి స్పందించిన జాతీయ రహదారుల అధికారులు భారీ వర్షాలకు దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేపడుతున్నారు. గత నెల 28న 'ప్రజాపక్షం' దినపత్రికలో "జాతీయ రహదారులా.. మజాకా" అనే కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన జాతీయ రహదారులకు మరమ్మతులు చేపట్టే అధికారులు ఎట్టకేలకు స్పందించారు. నిత్యం వందల వాహనాలు జాతీయ రహదారిపై రాకపోకలు సాగిస్తున్న సంగతి తెలిసిందే. వాహనాల రాపిడికి పలు ప్రాంతాలలో జాతీయ రహదారులు దెబ్బతిన్నాయి. ఇందులో నిడమనూరు మండలం బొక్కమంతలపాడు, నిడమనూరు,అలీనగర్, హాలియా తదితర ప్రాంతాలలో ప్రధాన రహదారి దెబ్బతిన్నది. వీటిపై ప్రయాణం చేస్తున్న ద్విచక్ర వాహనదారులు పలు ప్రమాదాలకు గురవుతున్నారు అనే విషయాన్ని 'ప్రజాపక్షం' దినపత్రికలో కళ్ళకు కట్టినట్లుగా వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. దెబ్బతిన్న ఈ ప్రాంతాలలో ముమ్మరంగా మరమతులు చేపడుతున్నారు. దీంతో ప్రయాణికులు హమ్మయ్య ఈ దారికి మరమ్మతులు చేస్తున్నారంటూ ఊపిరి పీల్చుకున్నారు.

## బకాయిలు ఇవ్వకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం :ఎఐఎస్‌ఎఫ్



**ప్రజాపక్షం/దేవరకొండ:** పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ప్రైవేట్ కళాశాలలు చేస్తున్న బంద్‌కు మద్దతుగా, ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి నిరసిస్తూ ఎఐఎస్‌ఎఫ్ దేవరకొండ డివిజన్ సమితి ఆధ్వర్యంలో మంగళవారం కళాశాల తరగతులు బహిష్కరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ డివిజన్ కార్యదర్శి వట్టేపు శివకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో 8వేల కోట్లకు పైగా పెండింగ్‌లో ఉన్న రియంబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ బకాయిలను విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని అన్నారు. బకాయిలు వెంటనే విడుదల చేయాలని లేనిపక్షంలో ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యమిస్తూ మంత్రులను, ఎంఎల్‌ఏలను ఎక్కడికక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ దేవరకొండ డివిజన్ నాయకులు సతీష్, భాను, రాంచరణ్, శివ, స్టాలిన్, మధు, నగేష్, సన్నీ, మాధవి, అనూష, అంజలి, ప్రభావతి, లక్ష్మీ, గాయత్రి, వినయ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ శతజయంతోత్సవాలు జయప్రదం చేయండి



### జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి పిలుపు

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) శతజయంతోత్సవాలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పిలుపునిచ్చారు. యాదగిరిగుట్టలో మంగళవారం మండల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా వచ్చిన జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ నేను జాంగిర్ వచ్చేనెల డిసెంబర్ 26న ఖమ్మంలో జరగనున్న శతజయంతోత్సవాల సందర్భంగా సీపీఐ నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు. 1925 డిసెంబర్ 26న కన్పూర్‌లో ఆవిర్భావించిన భారత కమ్యూనిస్టు పార్టీ ఎన్నో నిర్బంధాలను ఎదుర్కొని స్వాతంత్ర ఉద్యమంలో అగ్ర భాగాన నిలబడి నిస్వార్ధంగా ప్రజల కోసం పోరాడిందన్నారు. భూమి కోసం, భుక్తి కోసం వెట్టి చాకిరి నుండి విముక్తి కోసం పోరాటాలు నిర్వహించిన ఘన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీదన్నారు. 4 వేల మంది కమ్యూనిస్టుల బలిదానంతో 10 లక్షల ఎకరాల భూమిని పేద ప్రజలకు పంచిన చరిత్ర కూడా ఉందన్నారు. వందేళ్ల శతజయంతి ఉత్సవాల ముగింపు బహిరంగ సభకు జిల్లా నుండి పార్టీ సభ్యులు, సానుభూతి పరులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గోదా శ్రీరాములు, జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు కల్లెం కృష్ణ, బండి జంగమ్మ, పేరబోయిన మహేందర్, కొల్లూరు రాజయ్య, ఎండి ఇమ్రాన్, మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్, మున్సిపల్ కార్యదర్శి బబ్బూరి శ్రీధర్, మున్సిపల్ సహాయ కార్యదర్శి పేరబోయిన బంగారి, గోరేటి రాములు, మహిళా సమాఖ్య మండల కార్యదర్శి ఆరే పుష్ప, గీత, గుండు వెంకటేష్, మద్దూరు భాగ్యమ్మ, నాదగానికి కిష్టమ్మ, నేరట లక్ష్మి, గడ్డం యాదమ్మ, బోదాస్ స్వామి, చందు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : లక్ష్మణ్

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని తెలంగాణ బార్ కౌన్సిల్ ఎన్నికల్లో అభ్యర్థిగా పోటీ చేస్తున్న న్యాయవాది జక్కల లక్ష్మణ్ అన్నారు. మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మిర్యాలగూడ బార్ అసోసియేషన్‌లో ఆయన మాట్లాడుతూ న్యాయవాదుల హెల్త్‌కార్డు లిమిట్ రూ.10లక్షలకు పెంచాలని, 41ఏ సీఆర్‌పీసీ 35 బీఎన్ఎస్‌పై కేంద్ర ప్రభుత్వం సవరించాలని, అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను వెంటనే కల్పించాలని,అడ్వకేట్ యాక్ట్1961 సవరించి ప్రతి జిల్లా నుంచి ఒక బార్ కౌన్సిల్ మెంబర్ ప్రాతినిధ్యం ఉండాలన్నారు. తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి బార్ కౌన్సిల్ అభ్యర్థిగా గెలిపించినట్లయితే సమస్యలపై పోరాడి సాధిస్తానని అన్నారు. కార్యక్రమంలో మిర్యాలగూడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేతి సత్యనారాయణ, జనరల్ సెక్రటరీ అలుగుబెల్లి భూపతిరెడ్డి, న్యాయవాదులు సుండి శ్రీనివాస్, గొడ్డాటి సాయికుమార్‌యాదవ్, చిరుమర్రి రఘురామారావు, తాజుద్దిన్, ధూపాటి మట్టయ్య, ఎల్లన్న, రాయారపు భాస్కర్‌నాయుడు, మేక కుమార్‌రెడ్డి, చిలిమెల పద్మయ్య, కందిబండ శ్రీనివాస్, ఎండి.ఇబ్రహీం, రెడ్డిపల్లి సైదులు, పరమేష్, మోదాల మల్లేష్, పగిడి ఆంజనేయులు, మంద సైదులు, బాలు పాల్గొన్నారు.



## బిసిల రాజ్యాధికారమే టిఆర్‌పి లక్ష్యం

### ఎంఎల్‌సి తీన్మార్ మల్లన్న



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** తెలంగాణ రాజ్యాధికారి పార్టీ కిందిస్థాయిలో ఉన్న ప్రజలకు రాజ్యాధికారం కల్పించడమే తమ లక్ష్యమని ఆ పార్టీ అధినేత మల్లన్న వెల్లడించారు. మంగళవారం పట్టణంలోని బోయవాడలో గల ఎస్‌బిఆర్ గార్డెన్స్‌లో ఓపెన్ టాక్ విత్ మల్లన్న ప్రశ్న మీది సమాధానం మాది అనే కార్యక్రమానికి తీన్మార్ మల్లన్న ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటలెక్చువల్ ఫోరం మేధావి వర్గం వేసిన పలు ప్రశ్నలకు మల్లన్న తమదైన శైలిలో సమాధానాలు చెప్పారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందరికి సామాజిక న్యాయం టిఆర్‌పి పార్టీతోనే సాధ్యమని చెప్పారు. అలాగే ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెంటనే ప్రతి సంవత్సరం విద్య, వైద్యం కోసం బడ్జెట్లో 20 కేటాయిస్తాం అని ప్రతి సామజిక వర్గం వారిని అసెంబ్లీకి తీసుకువెళ్లి అసలైన బహుజన రాజ్యాధికారం తెచ్చి చూపిస్తాం అని తెలిపారు.అలాగే కాంగ్రెస్,భారస, బీజేపీ పార్టీలవి బీసీ లపై కపట ప్రేమని నటిస్తూ ఇంకా మనల్ని మోసం చేసి రాజ్యాధికారానికి దూరం చేసే కుట్రలు చేస్తూన్నారు అని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇంచార్జి వట్టే జానయ్య యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సుధాగాని హరి శంకర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి సంగెం సూర్యారావు,జర్నలిస్ట్ దేగల జనార్ధన్,శివర్చక విజయ్ కుమార్,రిటైర్డ్ ఐఏఎస్ చోళ్ళేటి ప్రభాకర్ పాల్గొన్నారు.

## అకాడమిక్ విద్యతో పాటు సృజనాత్మకత

### నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజా పక్షం/నల్లగొండ:** విద్యార్థులు జీవితంలో మంచి స్థానాన్ని పొందేందుకు పెద్ద లక్ష్యాన్ని నిర్దేశించుకుని లక్ష్య సాధనకు కృషి చేయాలని విద్యార్థులకు అకాడమిక్ విద్యతో పాటు, ఒకేషనల్ కోర్సులు, సృజనాత్మకత అవసరమని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాలలు ,9 ,10 తరగతి చదువుతున్న విద్యార్థులకు ఒకేషనల్ కోర్సులలో శిక్షణ ఇవ్వడంలో భాగంగా ముందుగా వాటిపై అవగాహన కల్పించి అనంతరం సెట్విన్ ఆధ్వర్యంలో స్వల్పకాలిక వృత్తులపై శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. మంగళవారం ఆమె జిల్లా కేంద్రం సమీపంలోని రాంనగర్‌లో ఉన్న అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలో ఒకేషనల్ ట్రైనింగ్ పై విద్యార్థినిలకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇన్చార్జి డిఆర్‌ఓ వై.అశోక్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్,జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి విజయేందర్ రెడ్డి,జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రమేష్, డీఈఓ బిక్షపతి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారి దత్రునాయక్ ఉన్నారు.

**పునరావాస కాలనీల పనులను వేగవంతం**

వివిధ ప్రాజెక్టుల కింద మిగిలిపోయిన భూసేకరణ పనులు, పునరావాస కాలనీల పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఇంజనీరింగ్ ,రెవిన్యూ అధికారులను ఆదేశించారు.మంగళవారం ఆమె తన చాంబర్లో జిల్లాలోని వివిధ ప్రాజెక్టుల కింద బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు, ఎత్తిపోత పథకాల కింద భూసేకరణ, పునరావస పనులపై సమీక్ష నిర్వహించారు.ఎత్తిపోతల పథకాల కింద భూసేకరణ, అవార్డుల జారీ, అటవీ భూములకు సంబంధించిన సమస్యల పరిష్కారం, చెల్లింపులు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, దేవరకొండ ఆర్‌డిఓ రమణారెడ్డి, ఇంజనీరింగ్ అధికారులు హాజరయ్యారు.



## మెడ్ఎక్స్ ద్వారా విద్యార్థులకు వైద్యవిద్యపై శ్రద్ధ

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** మెడ్ఎక్స్ 2025 ఎగ్జిబిషన్ ద్వారా విద్యార్థులకు వైద్యవిద్యపై ఆసక్తి, ఆరోగ్యంపై శ్రద్ధ పెంచిందని సూర్యాపేట మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ జయలత అన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో గత రెండు రోజులు జరిగిన ఎగ్జిబిషన్‌కు పట్టణంలోని వివిధ పాఠశాలలు, ఫార్మసి, నర్సింగ్ కళాశాలల విద్యార్థులు సుమారు 6వేల మంది సందర్శించినట్లు ఆమె తెలిపారు. ఎగ్జిబిషన్ ముగింపు సందర్భంగా మంగళవారం వివిధ రకాల మెడికల్ ఎగ్జిబిషన్‌ను పరిశీలించి ఆమె మాట్లాడారు. ప్రదర్శనలో వైద్యరంగంపట్ల, ఆరోగ్యంపట్ల చెప్పాల్సిన అన్ని విషయాలను సోదారణంగా, ప్రయోగాత్మకంగా వివరించినట్లు వెల్లడించారు. డ్రగ్స్‌కు బానిసలు కావడం వల్ల ఎటువంటి నష్టం జరుగుతుంది, మన శరీరం మీద డ్రగ్స్ ప్రభావం ఏమిటి అనే విషయాలను విద్యార్థులకు వివరించామని చెప్పారు. ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

## సిసిఐ నిబంధనలు సడలించాలని పత్తి రైతుల ఆందోళన

**ప్రజాపక్షం/మర్రిగూడ:** మండలంలోని ఎర్రగండ్లపల్లి గ్రామంలో ఉన్న లక్ష్మీనరసింహ స్వామి అగ్రో పత్తి మిల్లు వద్ద మంగళవారం పత్తి రైతులు ఆందోళన నిర్వహించారు. సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మిల్లు సందర్శించి బయ్యర్లతో,యజమానులతో మాట్లాడిన విషయం తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం సూచించిన సిసిఐ నిబంధనలు సడలించి పత్తినీ కొనుగోలు చేయాలని రైతులు కోరుతూ రోడ్డుపై బైఠాయించారు.ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకున్న మర్రిగూడ ఎస్ఐ కృష్ణారెడ్డి తన సిబ్బందితో అక్కడికి చేరుకొని ధర్నాలు విరమింప చేసి రైతులతో మిల్లు లోపల చర్చలు జరిపారు. ఘట నా స్థలానికి చేరుకున్న తహసిల్దార్ జక్కర్తి శ్రీనివాస్ జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌తో మాట్లాడారు. మిల్లు వద్దకు వచ్చిన పత్తి లోడుల వాహనాలను ఖాళీ చేయించాలని అధికారులను రైతులు కోరారు. ఈ ఆందోళన కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మెందు మోహన్ రెడ్డి , బిఆర్ఎస్ మండల అధ్యక్షులు తోటకూరి శంకర్, పిఎసిఎస్ మాజీ చైర్మెన్ పందుల యాదయ్య గౌడ్, బిజెపి మండల నాయకులు నారోజు కుమారస్వామి,పంగ యాదయ్య రైతులు పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

### ఎస్‌పి కె నరసింహ

**ప్రజాపక్షం/అర్వపల్లి :** రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎస్‌పి కె నరసింహ తెలిపారు. మంగళవారం సూర్యాపేట జనగామ 365బి పై తుంగతుర్తి నియోజక వర్గంలోని అర్వపల్లి, నాగారం, తిరుమలగిరి పోలీస్ స్టేషన్ల పరిధిలో రోడ్డు ప్రమాదల స్థలాలు, బ్లాక్ స్పాట్లను డిఎస్‌పి ప్రసన్నకుమార్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావుతో కలిసి ఎస్‌పి పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రత కమిటీలకు పలు సూచనలు, సలహాలు అందించారు. రోడ్డు ప్రమాదాల నివారణ కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రజల ప్రాణాలు పోకుండా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్లాలని అందుకోసం ప్రణాళికలు తయారు చేసుకోవాలని సూచించారు. ముఖ్యమైన కూడళ్ళు, రోడ్డు క్రాసింగ్‌లు, గ్రామాల వద్ద, మూల మలుపుల వద్ద ఎక్కువ మొత్తంలో లైటింగ్ పెంచాలని, స్పీడ్ నియంత్రణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. నిత్యం ప్రమాదాలకు గల కారణాలను నివృత్తి చేసుకొని లోపాలను సవరించడం, చెట్ల పొదలు తొలగించడం, లైటింగ్స్, బారికెట్స్ ఏర్పాటు, డైవర్షన్ గుర్తులు, రోడ్డు నిబంధనల సైన్ బోర్డ్స్ ఏర్పాటు చేయడంతో పాటు ఆ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించడం లాంటి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రయాణ సమయంలో వాహనదారులు ప్రజలు జాగ్రత్తలు పాటించాలని తప్పుడు మార్గంలో వాహనాలను నడపవద్దని కోరారు. అజాగ్రత్త అధిక వేగం కారణంగానే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని ప్రమాదాల బారిన పడకుండా ప్రజలు తక్కువ వేగంతో వాహనాలు నడుపాలని కోరారు. వ్యవసాయ సంబంధ పనులకు వెళ్ళే రైతులు తప్పుడు మార్గంలో వెళ్ళవద్దని సూచించారు. ప్రయాణ సమయంలో మనం తీసుకున్న జాగ్రత్తలు ప్రాణాలు కాపాడుతాయని అశ్రద్ధగా ఉంటే రోడ్డు ప్రమాదాల బారినపడతారన్నారు.



## అంతర్రాష్ట్ర దొంగను పట్టించిన సిసిటివి కెమెరా

### సుమారు రూ. 12లక్షల విలువ గల 6 తులాల బంగారం...35 తులాల వెండి.. ఒక బైక్ స్వాధీనం

### నల్లగొండ డిఎస్‌పి కె శివరాం రెడ్డి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** జిల్లాను నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దాలనే లక్ష్యం తో జిల్లా ఎస్‌పిశరత్ చంద్ర పవార్ నేను సైతం కమ్యూనిటీ సిసిటివి కార్యక్రమాల ద్వారా ప్రతి గ్రామంలో, వార్డ్ లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించడం జరిగిందని నల్లగొండ డిఎస్‌పి కె శివరాం రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వన్ టౌన్ పరిధిలో వారం క్రితం జరిగిన మూడు వేరు వేరు కేసులలో సిసిఎస్ టీమ్,సిబ్బంది కలిసి అంతరాష్ట్ర దొంగ ను పట్టుబడి,అరెస్టు చేసి రిమాండ్ కీ పంపించడం జరిగిందని తెలిపారు.గత నెల 25 న శాంతి నగర్‌లో నివాసం ఉండే జెర్రిపోతుల రవి ఇంట్లో వస్తారు రాత్రి. 7 గంటలకు ఇంటికి తాళం వేసి, ఊరికి వెళ్లి తిరిగి ఉదయం వచ్చేసరికి తాళం పగలగొట్టి, బీరువా ఓపెన్ చేసి దానిలో ఉన్న బంగారు,వెండి ఆభరణాలు కొంత నగదు దోచుకెళిన కరుడు గట్టిన అంతరాష్ట్ర దొంగ పాత నేరస్తుడు అయిన రుద్రాక్షి శ్రీనును మంగళవారం ఉదయం మునుగోడు రోడ్ లో వెహికల్ చెకింగ్ చేస్తుండగా అనుమానాస్పదంగా బైక్ పై పారిపోతుండంగా రుద్రాక్ష శీను గా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. గతంలో తెలంగాణ,ఆంధ్ర ప్రదేశ్ లోని పలు పోలీస్ స్టేషన్ పరిధిలో సుమారు 40 వరకు దొంగతనాలు చేసి ఇటీవల తిరుపతి జైలుకు వెళ్లి, తన ప్రవృత్తి మార్చుకోకుండా తిరిగి పదిహేను రోజుల క్రితం బయటకు వ చ్చి శాంతి నగర్ లోని ఒక ఇంటి లో దొంగతనం,పక్కనే ఇంటి ముందు పార్క్ చేసిన ఒక బైక్ దొంగతనం దేవరకొండ రోడ్ లోనీ కనక దుర్గా కాలనీలో మరొక ఇంట్లో దొంగతనం చేసిన నేరాలు (3) ఒప్పుకొని, దొంగిలించిన సొత్తు, బైక్‌ను చూపించగా వాటిని స్వాధీనం చేసుకుని నేరస్తుడుశ్రీనును జ్యుడీషియల్ కస్టడీ నిమిత్తం రిమాండ్ కి తరలించి అతని వద్ద నుండి సుమారు 6 తులాల బంగారు ఆభరణాలు, 35 తులాల వెండి ఆభరణాలు ఒక యునికార్న్ బైక్‌ని స్వాధీనం పరుచుకోవడం జరిగిందని తెలిపారు. అంతరాష్ట్ర దొంగను పట్టుబడి చేసి చాకచక్యంగా కేసులలో ప్రతిభ కనబరిచిన సిసిఎస్ సిఐ జితేందర్ రెడ్డి, చంద్ర శేఖర్ రెడ్డి, ఎస్ఐ విజయ్,హెడ్ కానిస్టేబుల్ విష్ణు,వన్ టౌన్ సిఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐలు సైదులు, గోపాలరావు, వెంకట నారాయణ, షకీల్, రబ్బాని, ఫింగర్ ప్రింట్స్ ఎస్ఐ శివ, సిసిఎస్ సిబ్బంది సాయి, మహేష్, వహీద్, దస్తగిరి జునైద్ తదితరులను జిల్లా ఎస్‌పి అభినందించారు.





# స్థానికం

REGIONAL NEWS

మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## కష్టపడి చదివితే విజయం మీ సొంతం

కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.సుకన్య

**ప్రజాపక్షం/జడ్చర్ల:** డాక్టర్ బూర్గుల రామకృష్ణ రావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యం.యస్.ఎన్ కంపెనీలో ఉద్యోగాల కోసం ప్లేస్ మెంట్ సెల్ మరియు టిఎస్‌కెసి సంయుక్తంగా నిర్వహించిన ఉద్యోగ మేళా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.సుకన్య మాట్లాడుతూ కష్టపడి చదివితే విజయం మీ సొంతం అవుతుందని పేర్కొన్నారు. అలాగే యం.ఎస్.యన్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ కే.ఎల్.యన్.మూర్తి మాట్లాడుతూ యువత వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, కష్టపడితే సాధ్యం కానిది ఏది లేదని, మా కంపెనీ లో 30,000 వేల మందికి పైగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. యంఎస్ఎన్ కంపెనీ స్థాపకులు సత్యనారాయణ రెడ్డి కంపెనీలో ఒక చిన్న ఉద్యోగం చేసి ఒక పెద్ద కంపెనీ స్థాపించి ఎంతోమందికి ఉపాధి కల్పిస్తున్నారని పేర్కొన్నారు. ఈ ఉద్యోగ మేళాలకు మొత్తం 49 మంది యువకులు హాజరయ్యారని, ఇందులో 21 మంది యువకులు ఉద్యోగాలు పొందారని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.సుకన్య ప్లేస్‌మెంట్ సెల్ అధికారి రాఘవేంద్ర రెడ్డి తెలిపారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత



**ప్రజాపక్షం/మాగనూరు:** పర్మిషన్ లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. ఎస్సై అశోక్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని నల్లగట్టు మారెమ్మ గుడి దగ్గర ఉదయం నాలుగు గంటలకు పెట్రోలింగ్, బ్లాకోట్ విధులు నిర్వహిస్తున్న పోలీసులకు ఒక మిని ట్రాలీతో ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ కనిపించగా పట్టుకుని విచారించగా ఎటువంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో స్టేషన్‌కు తరలించి ట్రాక్టర్ డ్రైవర్, ఓనర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మాగనూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఎటువంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో స్టేషన్‌కు తరలించి ట్రాక్టర్ డ్రైవర్, ఓనర్లపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. మాగనూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే అట్టి వ్యక్తులపై చట్టప్రకారమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై అశోక్ బాబు అక్రమార్కులను హెచ్చరించారు.

## ఇండ్లతోపాటు వీధులన్నీ జలమయం



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీకి నిధులు మంజూరైన నిధులు ఖర్చు చేయడంలో పూర్తిగా విఫలం కావడంతో నాగర్‌కర్నూల్ డ్రైనేజీవ్యవస్థ పూర్తిగా ధ్వంసమైందని సిపిఐజిల్లా కౌన్సిల్‌సభ్యులు శివశంకర్, కపిలవాయిగోపిచారి అన్నారు. మంగళవారం కురిసిన భారీవర్షానికి రోడ్లన్ని జలమయం అయ్యాయి. దీంతో పట్టణంలోని డాక్టర్‌బిఆర్ అంబేద్కర్ చౌరస్తా, రాంనగర్‌కాలనీ, బిఎస్ఎన్ఎల్ కార్యాలయం, చిన్న చిన్న కాలనీలు అన్ని వర్షంనీరు ఇండ్లలోకి, షాపుల్లోకి రావడం జరిగిందన్నారు. దీంతో ఎక్కడి వాహనాలు అక్కడే రోడ్డుపై నిలిచిపోయాయి అన్నారు. ఇప్పటికైనా మున్సిపాలిటి అధికారులు టౌన్‌ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకొని అభివృద్ధికి పాటుపడి డ్రైనేజి వ్యవస్థను మెరుగుపర్చి పట్టణప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. లేనియెడల సిపిఐపార్టీ ఆధ్వర్యంలో మున్సిపాలిటి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు చిన్నపాగ శ్రీనివాసులు, నాగేంద్రం, శివ పాల్గొన్నారు.

## ప్రజా బాటలో విద్యుత్ అధికారులు



**ప్రజాపక్షం/పెబ్బేరు :** పెబ్బేరు మండల కేంద్రంలో విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు విద్యుత్ అధికారులు ప్రజాబాటకు శ్రీకారం చుట్టారు. మంగళవారం జిల్లా విద్యుత్ అధికారుల బృందం చెలిమిళ్ళ వార్డులో పర్యటించి, విద్యుత్ స్తంభాలు, తీగలలో ఓల్టేజ్ సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకోవడమే కాకుండా పెబ్బేరు మండల కేంద్రంలలో ఓల్టేజ్ నివారించుటకు 100 కెవి రెండు విద్యుత్ ట్రాన్సాఫర్మర్లను ఏర్పాటు చేయడమే కాకుండా, అయ్యవారిపల్లి, గుమ్మడం ఉప విద్యుత్ సబ్స్టేషన్‌లలో అదనపు పవర్ టాన్సాఫర్మర్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. ఈ ప్రజా బాట వారానికి మూడు రోజులు నిరంతరంగా కొనసాగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ రాజశేఖర్‌రెడ్డి, డిఈ శ్రీనివాస్, ఏడిఈ శివశంకర్ రెడ్డి, ఏఈ కిరణ్ కుమార్, విద్యుత్ లైన్మెన్లు మధు ,రామకృష్ణ ,అశోక్ ,సాయి ,ప్రసాద్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు నిర్మూలిద్దాం



**ప్రజాపక్షం/వీపనగండ్ల :** బాల్య వివాహాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములైనప్పుడే బాలికల హక్కులను పరిరక్షించిన వారమవుతామని ఐసిడిఎస్ సూపర్వైజర్ సోని అన్నారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల సమాచారాన్ని దాచిపెట్టడం వల్ల మైనర్ బాలిక జీవితాన్ని ఆపదలో పడవేసిన వారమవుతామని ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని సమాచారం తెలిసిన వెంటనే సంబంధిత అధికారులకు తెలిపాలని సూచించారు. డ్రాప్ అవుట్ అయిన బాలికలపై ప్రత్యేక నిఘా పెట్టాల్సిన బాధ్యత అంగన్వాడీ టీచర్లదేనని ఆమె అన్నారు. అంగన్వాడి కేంద్రాలలో పూర్వ ప్రాథమిక విద్యను అభ్యసిస్తున్న చిన్నారుల్లో తక్కువ బరువు ఉన్న వారిని గుర్తించి వారు శారీరకంగా మానసికంగా ఎదిగేందుకు అవసరమైన వైద్యపరీక్షలు చేయించి ప్రభుత్వం అందిస్తున్న పలు రకాల పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా చిన్నారులకు అందివ్వాలని ఆమె అంగన్వాడి టీచర్లకు విజ్ఞప్తి చేశారు.

## నిర్ణీత తేమశాతం ఉండేలా చూసుకోవాలి

కలెక్టర్ విజయేందిర బోయి



**ప్రజాపక్షం/మహబూబ్ నగర్ :** పత్తి రైతులు పత్తిని ఆరబెట్టుకుని నిర్ణీత తేమ శాతం ఉండేలా చూసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి సూచించారు. మంగళవారం ఆమె మిడ్జిల్ మండలం రాణిపేట గ్రామంలో ఎం/ఎస్ పద్మానాభ కాటన్ ఇండస్ట్రీస్ సిసిఐ ద్వారా ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సరైన తేమ శాతం 8 నుండి 12 మధ్య వచ్చిన వెంటనే సిసిఐ అధికారులు పత్తిని కొనుగోలు చేయాలని కోరారు. పత్తిని ఓవర్ లోడ్ లేకుండా కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని అన్నారు. మంచు కురుస్తున్నందున పత్తిని ఆరబెట్టుకొని పూర్తిగా ఎండిన తర్వాతే కొనుగోలు కేంద్రాలను తీసుకురావాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. కలెక్టర్ వెంకట తహశీల్దార్ పులి రాజు తదితరులు పాల్గొన్నారు.

# రూ.603 కోట్లతో మహబూబ్‌నగర్ భూగర్భ డ్రైనేజీ ప్రాజెక్ట్

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి కోసం మొత్తం రూ.603 కోట్ల వ్యయంతో భారీ ప్రాజెక్టుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఆయన, నగర ప్రజలు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న మురుగు నీటి సమస్యలను ఇది శాశ్వత పరిష్కారమవుతుందని అన్నారు. శుభ్రమైన, ఆరోగ్యకరమైన పట్టణ నిర్మాణం దిశగా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని పేర్కొన్నారు. నేషనల్ హౌసింగ్ బ్యాంకింగ్ : 420.32 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వ వాటా: రూ.172.68 కోట్లు ఈ ప్రాజెక్టు కింద ఉందని ఆయన చెప్పారు. అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ ద్వారా ఈ నిధులు విడుదలయ్యాయని తెలిపారు. త్వరలో టెండర్ ప్రక్రియ ప్రారంభమవుతుందని, పనులు అత్యుత్తమ నాణ్యతతో వేగంగా పూర్తి చేయాలని సంబంధిత శాఖలతో సమన్వయం జరుపుతామని ఆయన చెప్పారు. ఇప్పుడు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ప్రాజెక్టు కూడా అమలు దిశగా సాగుతుండటం సంతోషకరమని అన్నారు. గతంలో మహబూబ్‌నగర్ అభివృద్ధికి ఈ స్థాయిలో ప్రాజెక్టు లు ఎవరైనా తెచ్చినట్లు నిరూపిస్తే చర్యకు సిద్ధం అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎన్‌పి. వెంకటేష్, మారేపల్లి సురేందర్ రెడ్డి, జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పర్సన్ ఇంచార్జీ గోనెల శ్రీనివాసులు, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి.మహేందర్, సీజే బెనహర్, సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.




# పోలీసులకు రివార్డ్ అందించిన ఎస్‌పి




**ప్రజాపక్షం/నారాయణపేట్ :** జిల్లాలో నిషేధిత మత్తు పదార్థాల సరఫరాపై గట్టి పర్యవేక్షణలో భాగంగా ఇటీవల గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తులను పట్టుకొని వారి వద్ద నుండి పెద్ద మొత్తంలో గంజాయి స్వాధీనం చేసుకొని నిందితులను జైలుకు పంపిన మక్తల్ సర్కిల్, టాస్క్‌ఫోర్స్ పోలీసు అధికారులు సిబ్బందిని మక్తల్ సీఐ రామ్‌లాల్, ఎస్సైలు, పురుషోత్తం, యస్‌యం. నవీద్, ఎచ్‌సి.గోప్యనాయక్, పిసిలు, రాఘవేందర్, రామస్వామి, అశోక్ కుమార్, శ్రీకాంత్, భానులను జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ అభినందించి రివార్డ్ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మత్తు పదార్థాలు జిల్లాలో పూర్తిగా అరికట్టడం మా ప్రధాన లక్ష్యం అని గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నాయి. పోలీసు అధికారులు కఠిన చర్యలు తీసుకోవడంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పోలీసులు కష్టపడి బాగా పని చేస్తే రివార్డులు అవే వస్తాయి అని అలాగే నిబద్ధతతో పనిచేయాలని, ప్రతి పోలీసు సభ్యుడు ప్రజల రక్షణకు కట్టుబడి ఉండి మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు నల్లపు లింగయ్య, మహేష్‌లు ఉన్నాయి.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించిన కలెక్టర్



**ప్రజాపక్షం/కొత్తకోట :** కొత్తకోట మండల పరిధిలోని పాలెం, కానాయపల్లి గ్రామాల పరిధిలో ఏర్పాటు చేసిన పిఎసిఎస్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో నిర్దేశించిన రిజిస్టర్లు నిర్వహిస్తున్నారా లేదా అని పరిశీలించారు. అదేవిధంగా కలెక్టర్ స్వయంగా తేమ శాతాన్ని పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రానికి దాన్యం తెచ్చిన వెంటనే సీరియల్ నెంబర్ల వారీగా ఎంత ధాన్యం తెచ్చారు, ధాన్యం తేమ వచ్చిన రోజు ఎంత ఉంది అనే వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. నిర్దేశించిన తేమ శాతం వచ్చిన వెంటనే కేటాయించిన మిల్లుకు ధాన్యాన్ని వెంటనే లోడ్ చేసి పంపించేయాలని సూచించారు. ఇక వరి కొనుగోలు కేంద్రాల నిర్వహకులకు సన్న రకం వరి ధాన్యాన్ని దొడ్డు రకం వరి ధాన్యాన్ని గుర్తించడంలో అవగాహన కలిగి ఉండాలని సూచించారు. గతంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఇచ్చిన శిక్షణ కార్యక్రమానికి హాజరైన వారు మాత్రమే కొనుగోళ్ళ ప్రక్రియ నిర్వహించాలని ఆదేశించారు.

**రైతు నేస్తం కార్యక్రమం**

సాగు రైతులకు సలహాలు సూచనలు ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు నేస్తం కార్యక్రమం ఎంతో ఉపయోగకరమని కలెక్టర్ పేర్కొన్నారు. కొత్తకోట మండల పరిధిలోని పాలెం గ్రామంలో రైతు వేదికలో నిర్వహించిన రైతు నేస్తం వీడియో ప్రత్యక్ష ప్రసారం కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ స్థానిక రైతులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా వరి, మొక్కజొన్న, వేరుశనగ పంటలకు ఏర్పడే తెగుళ్ల నుంచి ఎలా కాపాడుకోవాలి అనే అంశంపై ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి నిపుణులు మెలకువలు తెలియజేయగా రైతులు వీక్షించారు. డిసిఓ రాణి, డిసిఎస్ఓ కాశీ విశ్వనాథ్, డిఎం జగన్, తహశీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపిడిఓ వినీత్, ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# 72 గంటల్లోనే హత్య కేసు ఛేధన



బృందాన్ని అభినందించిన ఎస్పీ రావుల గిరిధర్

**ప్రజాపక్షం/వనపర్తి :** వనపర్తి సీఐ దర్యాప్తుతో వెలుగులోకి వచ్చిన సంచలన హత్య కేసు. వనపర్తి పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో పానుగల్ రోడ్డు గణేష్‌నగర్‌కు చెందిన నాగమణి ప్రియుడు శ్రీకాంత్‌లను భయంకరమైన హత్య కేసులో నిందితులుగా గుర్తించారు. ప్రియునితో కలిసి ఆమె భర్తను అక్టోబర్ 25వ తేదీన రాత్రి సమయంలో కురుమూర్తిని గొంతు బిగించి హత్య చేసి సెల్ఫ్ డ్రైవింగ్ కారును అద్దెకు తీసుకుని శ్రీశైలం ప్రాజెక్టు సమీపంలో శవాన్ని పడేసి, అనుమానం రాకుండా వనపర్తి పట్టణ పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. కానీ పోలీసుల క్షుణ్ణ దర్యాప్తు, టెక్నికల్ సాక్ష్యాలు, సీసీటీవీ ఆధారాలతో నిందితులు దొరికిపోయారు. నేరం ఎంత చాకచక్యంగా చేసినా నిజం బయటపడుతుందనే విషయం ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలి నిందితుల వివరాలు ఎ1కేసుల నాగమణి, ఎ2నందిమల్ల శ్రీకాంత్ నందిమల్ల గడ్డ, మెట్టుపల్లి వనపర్తి ఈ కేసును ఛేధించడంలో కీలకపాత్ర పోషించిన వనపర్తి సీఐ, కృష్ణయ్య, వనపర్తి పట్టణ ఎస్సైలు, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి నగదు రివార్డులు అందజేశారు.

# జిన్నింగ్ మిల్లుల ద్వారా పత్తి కొనుగోలు చేయాలి

రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** నారాయణపేట జిల్లాలోని అన్ని జిన్నింగ్ మిల్లులలో సీసీఐ కొనుగోలు కేంద్రాల ద్వారా పత్తి కొనుగోలు చేయాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను సూచించారు. తెలంగాణ కాటన్ జిన్నింగ్ మిల్లుల సంఘం ఈ నెల 6 మార్కెట్ యార్డులలో మిల్లులు, ప్రైవేట్ కొనుగోల్లను మూసివేయాలని పిలుపునిచ్చిన నేపథ్యంలో మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లోని వీసిహాల్‌లో నారాయణపేట జిల్లాలోని జిన్నింగ్ మిల్లుల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 7 జిన్నింగ్ మిల్లులు ఉన్నాయని, వాటిలో ఇప్పటివరకు 5 మిల్లులలో సీసీఐ కొనుగోలు కేంద్రాల ద్వారా పత్తి కొనుగోల్లు జరుగుతున్నాయని, పత్తి రైతులు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని మిగతా 2 మిల్లులలో కూడా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి పత్తిని కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ సీసీఐ సంస్థ ప్రతినిధులను కోరారు. దీనిపై స్పందించిన సీసీఐ జిల్లా ప్రతినిధులు తమ ఉన్నతాధికారులకు సమాచారం ఇస్తామని, తప్పనిసరిగా మిగతా రెండు మిల్లులలో కూడా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. జిల్లా వ్యవసాయ శాఖ అంచనా ప్రకారం ఎకరాకు 12 క్వింటాళ్ల పత్తి వస్తుందని, కపాస్ కిసాన్ యాప్‌లో కూడా మొన్నటి వరకు 12 క్వింటాళ్ల లెక్కనే చూపించిందని, కానీ తాజాగా 12 క్వింటాళ్లకు బదులు కేవలం 7 క్వింటాళ్ల లెక్క చూపుతోందని ఇది అటు రైతులకు, ఇటు పత్తి రైతులకు సమస్యగా మారిందని మిల్లర్లు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. డిప్యూటీ కలెక్టర్ శ్రీరామ్ ప్రణీత్, మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్, సిపిఓ యోగానంద్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారిని బాలామణి, అగ్నిమాపక శాఖ అధికారి సురేష్ రెడ్డి, ఎస్సై గాయత్రి, సీపీఐ ప్రతినిధులు అనూప్ మిశ్రా, శ్రీనివాస్ రావు, మార్కెట్ కార్యదర్శి భారతి, సూపర్‌వైజర్ లక్ష్మణ్, మిల్లలర్లు శ్రీనివాస్, పవన్ లాహోటీ, తమన్న, రాహూల్ జై, ప్రవీణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

## ఆత్మకూరు ఎస్సైగా జయన్న



**ప్రజాపక్షం/ఆత్మకూరు :** వనపర్తి జిల్లా ఆత్మకూరు పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్‌గా జయన్న సోమవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు జిల్లా ఎస్పీ ఆఫీసు నుండి బదిలిపై ఇక్కడ వచ్చారు. ఇక్కడ ఇదివరకు పనిచేసిన నరేందర్ ఎస్పీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ప్రజలు అందరూ సహకరించాలని శాంతి భద్రతల పరిరక్షణకు నా వంతు కృషి చేస్తానని ఎస్సై జయన్న తెలిపారు.

## పశువులకు గాలికుంటు టీకాలు



**ప్రజాపక్షం/వెల్దండ :** మండలపరిధిలోని చొక్కానపల్లి , గుండాల గ్రామాలలోని పశువులకు గాలికుంటువ్యాధి రోగ నివారణ టీకాల కార్యక్రమాన్ని పర్యవేక్షించడానికి రాష్ట్రస్థాయి పర్యవేక్షకులు డాక్టర్ వెంకటయ్యగౌడ్, జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ జ్ఞానశేఖర్, విజయడైరీ డిప్యూటి డైరెక్టర్ సత్యనారాయణయాదవ్ క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఇందులో భాగంగా రైతులతో మాట్లాడి గాలికుంటు నివారణ టీకాల ఆవశ్యకతను తెలియజేశారు. గాలికుంటు వ్యాధి పశువులకు సంక్రమించినప్పుడు, పశువుల ఆరోగ్యం క్షీణించి పాలదిగుబడి తగ్గుదలవలన రైతులు ఎలా నష్టపోతారో తెలియజేశారు. కావున ప్రతి రైతు ఈ టీకాల కార్యక్రమాన్ని సద్వినియోగపర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్యాంసుందర్, పశువైద్యసిబ్బంది నరేష్‌రెడ్డి, నర్సింహ్మా, ఫణిందర్‌రెడ్డి, శ్రీను, తిరుపతయ్య, గోపాలమిత్రలు బాలు, మొగులయ్య, సాయిబాబా పాల్గొన్నారు.

## రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించి వారి మన్ననలు పొందాలి



జిల్లా అదనపు కలెక్టర్

**ప్రజాపక్షం/ధన్వాడ :** ధన్వాడ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం సందర్శించి అన్ని రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం రోగులతో మాట్లాడి ఆస్పత్రిలో అందిస్తున్న వైద్య సేవల గురించి వాకబు చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని అన్ని విభాగాలను చూశారు. ఓపి, మందుల నిల్వ తదితర వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత సీజన్‌కు అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు అందుబాటులో ఉండి వైద్య సేవలందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/నర్వ:** మండల కేంద్రంలోని రైతు వేదిక లక్ష్మీ షాదీ ముబారక్ చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు చెన్నయ్య సాగర్ మాట్లాడుతూ కల్యాణ లక్ష్మీ , షాదీ ముబారక్ పథకం పేదింటి ఆడపడుచు తల్లిదండ్రులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు సంబంధించి 99 మంది లబ్ధిదారులకు రూ.99,11,484 విలువైన కల్యాణలక్ష్మీ , షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లారెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాదిరెడ్డి రవీందర్ రెడ్డి, నాగన్న వివేకవర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు శరణప్ప, ఆంజనేయ రెడ్డి, ఫజల్, సుధాకర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, రాజా రెడ్డి,సంజీవ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కారు లారీ ఢీ: ముగ్గురికి తీవ్రగాయాలు

**ప్రజాపక్షం/అచ్చంపేట :** హైదరాబాద్– శ్రీశైలం జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం హాజీపూర్ సమీపంలోని చెన్నారంవద్ద కారు లారీ ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని వెంటనే వెల్దండ యెన్నం ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ సద్దాంహుస్సేన్ తెలిపారు. వివరాల ప్రకారం .. అచ్చంపేటనుంచి హైదరాబాద్‌కు వెళుతున్న టిజి08యు4662అనే కారు హైదరాబాద్‌కు వెళుతుండగా చెన్నారంనుండి హాజీపూర్‌కు వస్తున్న ఏపి16 పిఇ6427 లారీ ఢీకొంది. దీంతో కారు నుజ్జునుజ్జుకాగా కారులో ఉన్నముగ్గురిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## కల్వకుర్తిలో అర్ధరాత్రి దొంగల హల్‌చల్



మూడుతులాల బంగారం చోరీ

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** కల్వకుర్తిలో వరుసగా దొంగలు దొంగతనాలతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఆదివారం రాత్రి పట్టణంలోని సుభాష్‌నగర్‌కాలనీలో నూతనంగా గృహప్రవేశంచేసిన అనంతరం నిద్రించగా అర్ధరాత్రి 3గంటల సమయంలో మహిళమెడలోగల నల్లపూసలదండను దొంగిలించారని లక్ష్మణ్‌గౌడ్ ఫిర్యాదుమేరకు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. స్థానిక సీఐ నాగార్జునతోకలిసి క్లూస్‌టీం సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

## టీకాలతోనే నివారణ

**ప్రజాపక్షం/కల్వకుర్తిరూరల్ :** పశువులకు సమయానికి టీకావేస్తేగాలికుంటు వ్యాధిని నివారించవచ్చని రాష్ట్రమానిటరింగ్ టీం డాక్టర్ వెంకటయ్యగౌడ్, జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ జ్ఞానశేఖర్ తెలిపారు. మంగళవారం కల్వకుర్తి మండలంలోని జీడిపల్లి గ్రామంలో పశువులకు టీకావేసి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 14వతేదివరకు గాలికుంటు వ్యాధి నివారణకు ఉచితటీకా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. గాలికుంటు వ్యాధిసోకితే పశువులలో ఉత్పాదకశక్తి పునరుత్పత్తి సామర్థ్యం తగ్గిపోతుందన్నారు. గాలికుంటువ్యాధి నివారణకు ఉచితంగా వేస్తున్న టీకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏడి డాక్టర్ భాస్కర్‌రెడ్డి, మండలపశువైద్యాధికారి డాక్టర్ నాగరాజు, సిబ్బంది రాజు, ప్రణీత, ఆంజనేయులు, బాలరాజు పాల్గొన్నారు.

# రీల్

## మీనాక్షి చౌదరి ఫస్ట్ లుక్



యువ సామ్రాట్ నాగ చైతన్య తండేల్ బ్లాక్ బస్టర్ సక్సెస్ తర్వాత ఇప్పుడు నెవర్ బిఫోర్ మిథికల్ థ్రిల్లర్ #NC24 చేస్తున్నారు. ఈ చిత్రానికి విరూపాక్షతో సంచలన విజయాన్ని అందుకున్న కార్తీక్ దండు దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ఎల్ ఎల్ పీ, సుకుమార్ రైటింగ్స్ ప్రతిష్టాత్మక బ్యానర్లపై బివిఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. బాపినీడు సమర్పిస్తున్నారు. మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో ఆమె పాత్ర దక్షగా పరిచయం చేస్తూ ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. ఫస్ట్ లుక్ పోస్టర్ అదిరిపోయింది.

## ఉత్తమ నటుడిగా మమ్ముట్టి



మలయాళ సినిమాకు ఇది ఒక అద్భుతమైన క్షణం. మమ్ముట్టి ప్రధాన పాత్రలో నటించిన 'భ్రమయుగం' గతేడాది అత్యధిక ప్రశంసలు అందుకున్న చిత్రాలలో ఒకటిగా నిలిచింది. విమర్శకుల ప్రశంసలతో పాటు, ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్న ఈ చిత్రం.. తాజాగా 55వ కేరళ రాష్ట్ర సినిమా అవార్డుల్లో సత్తా చాటింది. నాలుగు ప్రతిష్ఠాత్మక విభాగాల్లో అవార్డులను సాధించింది. కొత్త తరహా కథాకథనాలు, అద్భుతమైన సాంకేతికతతో ఈ చిత్రం మలయాళ సినీప్రపంచంలో కొత్త మైలురాయిని సృష్టించింది. 55వ కేరళ రాష్ట్ర చలన చిత్ర పురస్కారాలలో 'భ్రమయుగం' చిత్రానికి గాను ఉత్తమ నటుడిగా మమ్ముట్టి, ఉత్తమ సహాయ నటుడిగా సిద్ధార్థ్ భరతన్, ఉత్తమ నేపథ్య సంగీత దర్శకుడిగా క్రిస్టో జేవియర్, ఉత్తమ మేకప్ ఆర్టిస్ట్‌గా రోనెక్స్ జేవియర్ అవార్డులు గెలుపొందారు. నిర్మాతలు రామచంద్ర చక్రవర్తి (నైట్ షిఫ్ట్ స్టూడియోస్), ఎస్. శశికాంత్ (వైనాట్ స్టూడియోస్) తమ సినిమా సృజనాత్మక దృష్టిని గుర్తించినందుకు కేరళ రాష్ట్ర ప్రభుత్వం, జ్యూరీ, విమర్శకులు, మీడియా మరియు ప్రేక్షకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవార్డులు ప్రయోగాత్మక కథలపై మా నమ్మకాన్ని మరింత బలపరిచాయి. మరిన్ని ప్రయోగాత్మక సినిమాలు చేయడానికి, కేరళ సినిమాకు కొత్త దారులు చూపే ప్రయత్నాలను కొనసాగించడానికి ఇవి మాకు ప్రేరణగా నిలుస్తాయి. మా దర్శకుడు, నటీనటులు, సాంకేతిక బృందం మరియు ప్రేక్షకులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. అంటూ నిర్మాతలు తమ ఆనందాన్ని పంచుకున్నారు.



## చిన్న చిత్రాలను ఆదరించండి

### కె-ర్యాంప్ సక్సెస్ సెలబ్రేషన్స్‌లో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

కె–ర్యాంప్ లాంటి చిన్న చిత్రాలను ఆదరించాలని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పిలుపునిచ్చారు. చిన్న చిత్రాలను ఆదరించినప్పుడే సినిమా పరిశ్రమ మనుగడకు ప్రమాదం ఉండదని ఆయన పేర్కొన్నారు. కిరణ్ అబ్బవరం హీరోగా నటించిన 'కె–ర్యాంప్' సినిమా సక్సెస్ సెలబ్రేషన్ ఘనంగా జరిగాయి. ఈ సెలబ్రేషన్‌కు ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణా స్పీకర్ గడ్డం ప్రసాద్ సినిమా యూనిట్ సభ్యులందరికి షీల్‌లను అందజేశారు. చిన్న చిత్రాలు ఆడటం వల్లే ఎంతో మందికి ఉపాధి దొరుకుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌తో పాటు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, నిర్మాత బండ్ల గణేష్ అతిథులుగా హాజరై అతిథుల చేతుల మీదుగా మూవీ టీమ్‌కు జ్ఞాపికలు అందించారు. హీరో కిరణ్ అబ్బవరం నటించిన 'కే–ర్యాంప్' మూవీ హౌస్ ఫుల్ షోస్‌తో పెరుగుతున్న కలెక్షన్స్‌తో బ్లాక్ బస్టర్ విజయం దిశగా పరుగులు తీస్తోంది. ఈ సినిమా సక్సెస్ ఫుల్‌గా థర్డ్ వీక్ ప్రదర్శితమవుతూ 40 కోట్ల రూపాయలకు పైగా వసూళ్లను సాధించి దీపావళి బాక్సాఫీస్ విన్నర్‌గా నిలిచిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎడిటర్ ఛోటా కె ప్రసాద్, డీవోపీ సతీష్ రెడ్డి మాసం, మ్యూజిక్ డైరెక్టర్ చేతన్, నటుడు మురళీధర్ గౌడ్, డైరెక్టర్ జైన్స్ నాని, ఫైట్ మాస్టర్ పృథ్వీ, ప్రొడ్యూసర్ రాజేశ్ దండ, హీరో కిరణ్ అబ్బవరం తదితరులు పాల్గొన్నారు.



## 'రాజా సాబ్' ఆగేది లేదు..

రెబెల్ స్టార్ ప్రభాస్ 'రాజా సాబ్' పూర్తి స్థాయిలో పోస్ట్‌ప్రొడక్షన్ పనులు పూర్తి చేసుకుని, ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో జనవరి 9న విడుదలకు సిద్ధంగా ఉంది. రెబెల్ స్టార్ ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై నిర్మించిన ఈ చిత్రం జనవరి 9, 2026న సంక్రాంతి పండుగ సందర్భంగా విడుదల కానుంది. ఇటీవల, ఈ సినిమా విడుదల మరోసారి వాయిదా పడిందని సోషల్ మీడియాలో కొన్ని నకిలీ పుకార్లు వ్యాపించాయి. రాజా సాబ్ ప్రకటించిన విధంగానే జనవరి 9న ఎటువంటి ఆలస్యం లేకుండా విడుదల అవుతుందని నిర్మాతలు స్పష్టం చేశారు. ప్రస్తుతం విఎఫ్ఎక్స్ ఇతర పోస్ట్‌ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి.

## 7న 'ప్రెడేటర్: బ్యాడ్‌ల్యాండ్స్' విడుదల

కామిక్ కాన్ యాక్షన్ సైఫై కలగలిసిన యుద్ధభూమిగా మారింది. 'ప్రెడేటర్: బ్యాడ్‌ల్యాండ్స్' విడుదలకు సిద్ధమైంది. అందులో అత్యధిక ఉత్సాహాన్ని తెచ్చింది ప్రెడేటర్ హంటర్ టెక్ సర్క్యూట్ చల్లేంజ్‌లో పాల్గొన్నవారు మెటల్ సర్క్యూట్‌పై కంట్రోల్ వాండ్ని నడపాలి ఒక్క చిన్న పొరపాటు చేసినా వెంటనే రెడ్ అలర్ట్ వస్తుంది. ఈ టాస్క్ గేమింగ్ థ్రిల్, సస్పెన్స్ రెండింటినీ మిళితం చేసి, ప్రతి ఒక్కరినీ ఆడకముందే టెన్షన్లోకి నెట్టేసింది. అదే సమయంలో ప్రెడేటర్ కాస్ ప్లేయర్లు తమ యాక్షన్ మూవీస్‌తో ఫ్లోర్ మొత్తం ఆక్రమించేశారు. ఈ అనుభవం మొత్తం కామిక్ కాన్లో అత్యంత ఆకర్షణగా నిలిచింది. ప్రేక్షకుల ఉత్సాహం, సోషల్ మీడియాలో వైరల్ కంటెంట్‌తో దూసుకుపోతోంది. దీంతో సినిమా ప్రమోషన్‌కు మరింతగా ఆసక్తి కలిగించింది. ఇల్లే ఫెన్నింగ్, డైమిట్రోయిస్, కోలో మాటంగి ప్రధాన పత్రాలు పోషించిన ఈ సినిమాను 20 సెంచరీ స్టూడియోస్ నిర్మించింది. ఈనెల 7న తెలుగు, హిందీ, తమిళం, ఇంగ్లీష్ భాషలలో విడుదల కానుంది.





## ఆషికాతో రవితేజ డ్యూయెట్

రవితేజ హీరోగా, కిషోర్ తిరుమల దర్శకత్వంలో నిర్మిస్తున్న ఆర్ 76 రెగ్యులర్‌గా షూటింగ్ జరుపుకుంటోంది. ఎస్‌ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. హీరో రవి తేజ, హీరోయిన్ ఆషికా రంగనాథ్‌పై ఒక పాటను చిత్రీకరిస్తున్నారు. ఈ పాట కోసం అన్నపూర్ణ స్టూడియోస్‌లో ప్రత్యేకమైన సెట్ వేశారు. శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీలో రూపొందుతున్న ఈ పాట అదిరిపోయే డ్యాన్స్‌తో ప్రేక్షకులను అలరించనుంది. ఎనర్జీతో ప్రేక్షకులను అలరించే రవితేజ ఈ సినిమాలో న్యూ స్టైలిష్ లుక్‌లో కనిపించనున్నారు. ఇది హ్యూమర్, ఎమోషన్, రవితేజ మాస్ ఎలిమెంట్స్‌తో ఫుల్‌ఫ్లెడ్జ్ ఫ్యామిలీ డ్రామాగా తెరకెక్కుతోంది. ఎమోషనల్ కథలతో అలరించే దర్శకుడు కిశోర్ తిరుమల ఈ చిత్రాన్ని అన్ని వర్గాల ప్రేక్షకుల ఆకట్టుకునేలా రూపొందిస్తున్నారు.



## 'ఫీనిక్స్' ప్రీరిలీజ్

మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి కుమారుడు సూర్య సేతుపతి హీరోగా పరిచమైన చిత్రం ఫీనిక్స్. ప్రముఖ స్టంట్ మాస్టర్ అనల్ అరసు దర్శకత్వం వహించారు. ఏకే బ్రేవ్మ్యాన్ పిక్చర్స్ బ్యానర్‌పై రాజలక్ష్మి 'అన్ల్' అరసు ఈ సినిమాని నిర్మించారు. ఇప్పటికే తమిళ్‌లో విడుదలైన ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ అయ్యింది. ఈ చిత్రం తెలుగులో నవంబర్ 7 రిలీజ్ కానుంది. ఈ సందర్భం హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ ఈవెంట్ ఘనంగా నిర్వహించారు. హీరో విజయ్ సేతుపతి మాట్లాడుతూ.. నేను జవాన్ సినిమా చేస్తున్నప్పుడు అనల్ అరసు మాస్టర్‌ని కలిసాను. అప్పుడు ఈ కథ చెప్పారు. మా అబ్బాయి ఇందులో నటించాలని అన్నారు. మీ ఇద్దరు మాట్లాడుకోండి అని చెప్పాను. ఆ తర్వాత నాకు ఏమీ తెలియదు. వాళ్ళిద్దరే మాట్లాడుకున్నారు. సినిమా చేశారు. నేను సినిమా చూశాను. నాకు చాలా నచ్చింది. ఇది మా అబ్బాయికి చాలా మంచి ఆరంభం. ఒక తండ్రిగా నేను చాలా ఆనందంగా ఉన్నాను. తనకు చిన్నప్పటి నుంచి యాక్షన్ సినిమా చేయాలని ఉండేది. తనకి యాక్షన్ చాలా ఇష్టం. నన్ను యాక్షన్ సినిమాలు చేయమని చెప్తుండేవాడు. యాక్షన్ సినిమాని చాలా బాగా సెలబ్రేట్ చేసుకుంటాడు. అలాంటి సినిమాలు చేయడం తన కల. తను యాక్టర్ కావాలి అని చెప్పాడు. అలా చెప్పిన ఏడాదిలోనే సినిమా చేశాడు. అదంతా డైరెక్టర్ అనల్ అరసు మాస్టర్, నిర్మాత రాజ్యలక్ష్మి మేడం వలన సాధ్యపడిందన్నారు. ఈనెల 7న సినిమా రిలీజ్ అవుతుంది. అందరం థియేటర్స్‌లో కలుద్దాం అని అన్నారు. ఈ కార్యక్రమాలో డైరెక్టర్ గోపీచంద్ మలినేని, హీరో సూర్య సేతుపతి, నటి వరలక్ష్మి శరత్ కుమార్, డైరెక్టర్ అనల్ అరసు, రచయిత భాష్యశ్రీ, నిర్మాత రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.



# పెన్షనర్లకు మోదీ సర్కారు తీరని ద్రోహం

### 8వ వేతన సంఘం పరిధిలో చేర్చకపోవడం అన్యాయం

### ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్

### కార్మిక సంఘాలు ఉద్యమించాలని పిలుపు

**న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల పట్ల కేంద్రంలోని మోడీ సర్కారు ఉదాసీనంగా వ్యవహరిస్తోందని ఎఐటియుసి తీవ్రంగా ఖండించింది. ఎనిమిదవ కేంద్ర వేతన సంఘం పరిధి నుండి 69లక్షల మంది పెన్షనర్లు, కుటుంబ పెన్షనర్లను దూరం పెట్టడం ద్వారా మోడీ సర్కారు వారికి తీరని ద్రోహం చేసిందని ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ మండిపడ్డారు. ఈ మేరకు ఆమె మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుత పెన్షనర్ల విధి విధానాలు నిర్ణయించడానికి ఆర్థిక బిల్లు ద్వారా పార్లమెంటు నుంచి పొందిన క్రమబద్ధీకరణ అధికారాన్ని ప్రభుత్వం ఉపయోగించుకుంటోంది. 8వ కేంద్ర వేతన సంఘానికి ఇచ్చిన నిబంధనల (టీఓఆర్) పత్రం... కార్మిక వర్గం, వద్ధాప్య పెన్షనర్ల పట్ల ప్రభుత్వ ఉదాసీనతకు నిదర్శనం. 8వ కేంద్ర వేతన సంఘం ఉద్యోగుల జీవన అవసరాలకు తగినట్లుగా మంచి వేతనం సిఫార్సు చేయలేదు. కాంట్రిబ్యూటరీ ఎన్‌పిఎస్, యూపిఎస్ స్థానంలో నాన్‌కంట్రిబ్యూటరీ పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించడం గురించి నిబంధనలలో ఎటువంటి ప్రస్తావన లేదు. పార్లమెంట్‌లో ఆర్థిక బిల్లు ఆమోదం పొందిన తర్వాత ఇప్పటికే ఉన్న 69లక్షలకు పైగా పెన్షనర్లు, కుటుంబ పెన్షనర్లను 8వ వేతనసంఘం పరిధి నుండి కేంద్రం దూరంగా ఉంచింది. అంటే 0101 2026 నుండి పెన్షన్‌లో ఎటువంటి సవరణ ఉండదు. ఇది దేశ సేవ కోసం తమ చెమటను, రక్తాన్ని ధారపోసిన సీనియర్ సిటిజన్లకు చేసిన ద్రోహమే కాకుండా తీవ్ర అన్యాయం అని కౌర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీ సర్కారు ప్రభుత్వం అనుసరిస్తున్న ఉద్యోగి, పెన్షనర్ వ్యతిరేక విధానాన్ని ఏఐటీయూసీ తీవ్రంగా ఖండిస్తోందని ఆమె తెలిపారు. 8వ సిపిసికి ప్రభుత్వం టీఓఆర్‌లో ఈ క్రింది వాటిని చేర్చాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కుటుంబ సభ్యుల సంఖ్యను కనీసం 5 మందిగా పరిగణించి... నేటి జీవనశైలికి తగినట్లుగా పోషక, పరిశుభ్ర ఆహారం తదితర రోజువారీ అవసరాలు, విద్య, ఆరోగ్యం, గృహనిర్మాణం, తాగునీరు, రవాణా మొదలైన వాటిపై ఖర్చులకు కనీసం 25శాతం వ్యయం అవసరం వంటి అంశాలను చేర్చాలి. కాంట్రిబ్యూటరీ ఎన్‌పిఎస్, సిపిఎస్ స్థానంలో నాన్‌కంట్రిబ్యూటరీ ఓల్డ్ పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలన్న 26 లక్షలకు పైగా ఎన్‌పీఎస్ ఉద్యోగుల డిమాండ్‌ను పరిశీలించాలి. పెన్షన్ నిర్మాణం, సవరణ, 11సంవత్సరాల తర్వాత పెన్షన్ విలువ పునరుద్ధరణ వంటి ఇతర సంబంధిత విషయాలను పరిగణలోకి తీసుకోవాలి. అలాగే పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సిఫార్సు చేసిన విధంగా పదవీ విరమణ తేదీ నుండి ప్రతి 5 సంవత్సరాలకు 5శాతం పెన్షన్ పెంచాలి. 112026 నుండి ఉద్యోగులు, పెన్షనర్లకు 8వ సిపిసి సిఫార్సుల్ని అమలు చేయాలి. వేతనాలు, పెన్షన్ సవరణ పదేళ్లకొకసారి మాత్రమే జరుగుతుంది కాబట్టి, మోదీ సర్కారు ఉద్యోగ, పెన్షనర్ వ్యతిరేక వైఖరికి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, వారి ట్రేడ్ యూనియన్లు వెంటనే నిరసన తెలపాలని, డిమాండ్ల సాధనకు కార్యాచరణ కార్యక్రమాలను రూపొందించాలని ఎఐటియుసి పిలుపునిచ్చింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు చేపట్టే పోరాటానికి ఎఐటియుసి అండగా ఉంటుందని కౌర్ స్పష్టం చేశారు.






# ఫిబ్రవరిలో ఐజెయు ప్లీనరీ

### విజయవాడలో నిర్వహించాలని ఎపియుడబ్ల్యుజె నిర్ణయం

**అమరావతి :** ఇండియన్ జర్నలిస్టుల యూనియన్ (ఐజెయు) ప్లీనరీ సమావేశాలను ఫిబ్రవరి నెల మొదటివారంలో విజయవాడలో నిర్వహించాలని ఎపియుడబ్ల్యుజె నిర్ణయించింది. యూనియన్ అధ్యక్షులు ఐ.వి.సుబ్బారావు అధ్యక్షతన మంగళవారం విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ హాలులో యూనియన్ రాష్ట్ర విస్తృత కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఐ.జే.యూ. జాతీయ అధ్యక్షులు, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి, సి.రాఘవాచారి ప్రెస్ అకాడమీ, ఆంధ్రప్రదేశ్, చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్, ఐజెయు జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సమావేశంలో జర్నలిస్టుల సమస్యలతోపాటు, ఐజెయు ప్లీనరీ ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఐజెయు ఆవిర్భావం తర్వాత 1992లో రెండో ప్లీనరీ విజయవాడలో ఘనంగా నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. దాదాపు మూడు దశాబ్దాల తర్వాత ఐజెయు 11వ ప్లీనరీని నిర్వహించే అవకాశం మరోసారి ఎపియుడబ్ల్యుజెకు వచ్చిందని, ప్లీనరీని విజయవాడలోనే నిర్వహించాలని యూనియన్ నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. మూడు రోజులపాటు జరిగే సమావేశాల్లో జర్నలిస్టు సమస్యలు, వత్తి విలువల రక్షణకై తీసుకోవల్సిన చర్యలు, జర్నలిస్టుల భద్రత, మీడియా స్వేచ్ఛపై జరుగుతున్న దాడులు, ఇతర అంశాలపై సుదీర్ఘంగా చర్చించి తీర్మానాలు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ మహాసభలకు దేశం నలుమూలల నుండి దాదాపు 350 మంది ప్రతినిధులు హాజరవుతారని, ప్లీనరీని విజయవంతం చేయడానికి ప్రజాస్వామ్యవాదులంతా సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఐజెయు ప్లీనరీ నిర్వహణకు మొత్తం తొమ్మిది కమిటీలు ఏర్పాటు చేయాలని కార్యవర్గ విస్తత సమావేశం నిర్ణయించింది. అలాగే ఐజెయు ప్లీనరీని పురస్కరించుకుని మంచి వ్యాసాలతో సావనీర్‌ను విడుదల చేయాలని సమావేశం తీర్మానించింది. ఎపియుడబ్ల్యుజె డిప్యూటీ జనరల్ సెక్రటరీగా విజయనగరానికి చెందిన పి.ఎస్.ఎస్.వి. ప్రసాదరావును కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకుంది. విశాలాంధ్ర ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ కూన అజయ్ బాబును యూనియన్ క్రమశిక్షణ, అర్హతల కమిటీ కన్వీనర్‌గా ఎన్నుకున్నారు. ఇవిగాక ప్లీనరీ ఏర్పాట్ల కోసం వివిధ ఉప కమిటీలను త్వరలో ఏర్పాటు చేయాలని, ఎపి ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్స్ అసోసియేషన్, సామ్నా రాష్ట్ర సమావేశాలను నిర్వహించాలని విస్తత కార్యవర్గ సమావేశం తీర్మానించింది. ఈ సమావేశంలో ఎపియుడబ్ల్యుజె రాష్ట్ర ప్రధానకార్యదర్శి కంచల జయరాజ్ యూనియన్ ఇటీవల కాలంలో నిర్వహించిన కార్యకలాపాలపై నివేదిక సమర్పించగా, మాజీ ప్రధానకార్యదర్శి చందు జనార్ధన్, ఐజెయు జాతీయ కార్యవర్గసభ్యులు నల్లి ధర్మారావు, డా.ఎం.ప్రసాద్ ప్రసంగించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, 26 జిల్లా శాఖల అధ్యక్ష కార్యదర్శులు, కన్వీనర్లు సమావేశంలో పాల్గొన్నారు.



## ఓటర్ల జాబితా అవకతవకలపై ఇసి చర్యలు

### మహారాష్ట్ర కాంగ్రెస్ డిమాండ్

**ముంబయి :** స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు ఓటర్ల జాబితాలలో 'అవకతవకలను' సరిదిద్దాలనే ప్రతిపక్ష పార్టీల డిమాండ్‌ను ఎన్నికల కమిషన్ వెంటనే పరిగణనలోకి తీసుకోవాలని మహారాష్ట్ర కాంగ్రెస్ మంగళవారం కోరింది. పాలక వర్గం నాయకులు కూడా ఇలాంటి వాదనలు చేశారని ఉటంకించారు. రాజకీయ పార్టీలు ప్రజాస్వామ్యంలో ముఖ్యమైన భాగమని, అవి లేకుండా ఎన్నికల ప్రక్రియ అసంపూర్ణమని మహారాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సచిన్ సావంత్ అన్నారు. 'అన్ని ప్రతిపక్ష పార్టీలు కలిసి పారదర్శక, తప్పులు లేని ఓటర్ల జాబితాను డిమాండ్ చేస్తున్నప్పుడు చర్య తీసుకోవడం ఇసి విధి. ఇప్పుడు ముఖ్యమంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ బవాంకులేతో సహా అధికార పార్టీ నాయకులు కూడా ఓటర్ల జాబితాను రద్దు చేయాలని చెప్పారు. అధికార పార్టీ కూడా అదే చెబుతుంటే, ఇప్పుడు సమస్య ఏమిటి?' అని సావంత్ 'ఎక్స్' పోస్ట్‌లో ప్రశ్నించారు. మహారాష్ట్ర మంత్రి అశిష్ షెలార్ సోమవారం మాట్లాడుతూ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ సిబ్బందిపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే, ఎంఎన్‌ఎస్ అధ్యక్షుడు రాజ్ ఠాక్రే బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడుతున్నారని అన్నారు. ఓటర్ల జాబితా గురించి విపక్షం తప్పుడు ప్రచారం చేసేందుకు ప్రయత్నిస్తోందని తెలిపారు. కాగా బిజెపి నాయకుల ప్రకటనలను సావంత్ ప్రస్తావిస్తూ, 'అంతకుముందు, అనురాగ్ ఠాకూర్, ఇప్పుడు అశిష్ షెలార్ ఓట్ల దొంగతనాన్ని అంగీకరించారని అన్నారు. మహారాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి... షెలార్‌ను ఒక అఫిడవిట్ సమర్పించాలని అడుగుతారా?' అని పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా 'ఓటు దొంగతనం'కు బిజెపి బ్రాండ్‌గా నిలిచిందని అన్నారు.

## ప్రచారానికి తెర

(మొదటి పేజీ తరువాయి)

121 నియోజక వర్గాల్లో తొలి విడత పోలింగ్ జరగనుంది. ఈ విడతలో ఆర్‌జెడి అగ్రనేత, మహాఘడ్‌బంధన్ సిఎం అభ్యర్థి తేజస్వీ యాదవ్, ఆయన సోదరుడు తేజ్‌ప్రతాప్ యాదవ్, బిహార్ ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌధరీ, జానపద గాయకురాలు మైతిలీ ఠాకూర్ సహా 1,314మంది అదృష్టం పరీక్షించుకుంటున్నారు. మిగితా 122 సీట్లకు ఈనెల 11న రెండో విడతలో ఓటింగ్ జరగనుంది.

### మాజీమంత్రి తేజ్ ప్రతాప్ యాదవ్ బరిలో

రాఘోపుర్ నియోజకవర్గం స్థానం నుంచి తేజస్వీ యాదవ్ పోటీ చేస్తున్నారు. ఎన్‌డిఎ తరపున బిజెపికి చెందిన సతీశ్‌కుమార్, జన్‌సురాజ్ పార్టీ నుంచి చంచల్‌కుమార్ ఆయనతో తలపడుతున్నారు. వైశాలి జిల్లాలోని మహువా స్థానం నుంచి లాలు పెద్దకుమారుడు, మాజీమంత్రి తేజ్ ప్రతాప్ యాదవ్ బరిలో ఉన్నారు. ఆర్‌జెడి తరఫున సిట్టింగ్ ఎమ్మెల్యే ముకేశ్ కుమార్, ఎల్‌జెపి నుంచి సంజయ్ సింగ్ పోటీచేస్తున్నారు. ముంగర్ జిల్లా తారాపుర్ నుంచి బిహార్ ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌధరీ అదృష్టం పరీక్షించుకుంటున్నారు. మహాఘట్‌బంధన్ తరపున ఆర్‌జెడికి చెందిన అరుణ్‌షా ఆయనతో తలపడుతున్నారు. దర్భంగా జిల్లా అలీనగర్ నుంచి జానపద గాయకురాలు, బిజెపికి చెందిన మైతిలీ ఠాకూర్ ఎన్‌డిఎ అభ్యర్థిగా రంగంలో ఉన్నారు. ఆర్‌జెడి నుంచి బినోద్ మిశ్రా, జన సురాజ్ పార్టీ తరపున విప్లవ్‌కుమార్ చౌదరీ పోటీ చేస్తున్నారు.

## ప్రభుత్వ పతనం ఖాయం (మొదటి పేజీ తరువాయి)

తప్పించి, ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో సవరణ డ్రైవ్‌ను ఎంపిక చేసుకుని నిర్వహిస్తున్నారని ఎన్నికల సంఘం (ఇసి)పై మండిపడ్డారు. కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో ఇసి ఎస్ఐఆర్ నిర్వహిస్తోందని, కానీ, బిజెపి పాలిత అసోంలో ఎందుకు చేపట్టడం లేదని నిలదీశారు. ఈ నాలుగు రాష్ట్రాల్లో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. 'బిజెపి పాలిత అసోం, త్రిపుర, ఇతర ఈశాన్య రాష్ట్రాలలో ఎస్ఐఆర్ ఎందుకు చేపట్టడం లేదో ఎన్నికల సంఘం కూడా సమాధానం చెప్పాలని అని ఆమె డిమాండ్ చేశారు. ఈ చర్యను కేంద్రంలో అధికార పార్టీకి సహాయం చేయడానికి ఉద్దేశించిన స్పష్టమైన వివక్ష అని ఆమె పేర్కొన్నారు. 2002లో పశ్చిమ బెంగాల్‌లో జరిగిన చివరి సర్ పూర్తి కావడానికి కనీసం రెండు సంవత్సరాలు పట్టిందని ఆమె అన్నారు. ఈసారి దానిని కేవలం ఒక నెలలోనే పూర్తి చేయడానికి ఇసి ఎందుకు తొందరపడుతుందని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. దీనిని రాజకీయ ప్రేరేపిత చర్యగా ఆమె అభివర్ణించారు. అర్హత కలిగిన ఒక్క ఓటరును అయినా ఓటర్ల జాబితా నుండి తొలగిస్తే ఈ బిజెపి ప్రభుత్వం పతనమవుతుందని హెచ్చరించారు. పశ్చిమ బెంగాల్‌లో అక్రమ ఓటర్లు ఉన్నారని బిజెపి పదే పదే చేస్తున్న వాదనలను మమతా బెనర్జీ తిప్పికొట్టారు. సర్ తర్వాత బీహార్‌లో ఎంత మంది రోహింగ్యాలు లేదా బంగ్లాదేశీయులు కనిపించారని ప్రశ్నించారు. బెంగాలీలో మాట్లాడటం వల్ల ఎవరైనా బంగ్లాదేశీయులుగా మారరని ఆమె నొక్కిచెప్పారు. కాషాయ పార్టీ బెంగాలీలను కించపరిచేలా నకిలీ వార్తలు, మత ప్రచారాన్ని వ్యాప్తి చేస్తోందని ఆరోపించారు. బిజెపి ఓట్ల ఆధారంగా కాదు, నోట్ల బలం ఆధారంగా గెలవాలని చూస్తోందని, ఈ ఓటర్ల జాబితాలు నకిలీ అయితే, అదే జాబితా ఆధారంగా జరిగిన మునుపటి ఎన్నికల్లో బిజెపి ఎలా గెలిచిందని ప్రశ్నించారు. ఎస్ఐఆర్ 'నిశ్శబ్ద, అదృశ్య రిగ్గింగ్' అని అన్నారు. ఓటర్లలో భయాన్ని కలిగించడానికి బిజెపి దీనిని ఉపయోగిస్తోందని మండిపడ్డారు. 'ఈ భూమిలో పుట్టి పెరిగిన తర్వాత బిజెపి ముందు మన పౌరసత్వాన్ని నిరూపించుకోవాలా? ప్రజలను ప్రశ్నించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com